ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

19-9-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 229 పేజీలు: 12 వెల: 6.50

ఓట్ల తొలగింపు ఆన్‌లైన్‌లో అసాధ్యం: ఇసి

అమెరికాలో ట్రంప్ పసిడి విగ్రహం!

9లో

# ముందే వచ్చిన దసరా, దీపావళి

## జిఎస్టీ సంస్కరణలు ప్రజలకు పండుగ బోనస్

### కేంద్ర నిర్ణయాలను అభినందిస్తూ అసెంబ్లీలో తీర్మానం

### 'వన్ నేషన్, వన్ టాక్స్' వల్ల ఎంతో ప్రయోజనం

### గేమ్ ఛేంజర్‌గా మారిన జిఎస్టీ అమలు: సిఎం చంద్రబాబు



గురువారం అసెంబ్లీలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఆర్థికంగా భారం పెరిగినా భరిస్తుందని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు.దేశంతో పాటు,రాష్ట్రంలో ప్రజల జీవన విధానంలో సంచలనాత్మక మార్పులు రానున్నాయన్నారు.ఆ క్రమంలో జిఎస్టీలో కేంద్రం తీసుకుని వచ్చిన సంస్కరణలకు ఎపి ప్రభుత్వం పరిపూర్ణ మద్దతునిస్తున్నట్లు వెల్లడించారు. జిఎస్టీ ప్రయోజనాలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టే ఆలోచనలో కూటమి ప్రభుత్వం జిఎస్టీ 2.0 సంస్కరణలపై శాసన సభలో ప్రవేశపెట్టిన తీర్మానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ దేశంలోనే తొలిసారి జిఎస్టీ 2.0 సంస్కరణలపై తీర్మానంపై చర్చించిన ఎపి శాసనసభగతంలో సిఎస్టీ, వ్యాట్ లాంటి సంక్లిష్టమైన పన్నుల వ్యవస్థ ఉండేది. 17 రకాల పన్నులు, 13 రకాల సెస్సులు సర్చార్జిలు ఉండేవి. ఒక ఉత్పత్తికి అనుబంధ ఉత్పత్తులు వచ్చినా పన్నులు వేసే పరిస్థితి ఉండేది. 140 కోట్ల మంది ప్రజలకు ప్రయోజనం కలిగేలా జిఎస్టీలో రెండుస్లాబులతో సంస్కరణలు తీసుకువచ్చింది. రెండు శ్లాబులతో పన్నుల వ్యవస్థను మరింత సరళతరం చేశారు.

ప్రభుత్వానికి ఆదాయం వస్తే అభివృద్ధి సంక్షేమం జరుగుతుంది. నెక్స్ జెన్ జిఎస్టీ అమలు దేశంలో ఓ గేమ్ చేంజర్ సంపద సృష్టించని వారికి సంక్షేమం చేసే అధికారం లేదు. కేంద్రం తీసుకువచ్చిన ఈ సంస్కరణలతో ముందుగానే దీపావళి, దసరా పండుగల బోనస్ ఇచ్చారు. 99 శాతం మేర వస్తువులన్నీ 5 శాతం పన్ను పరిధిలోకే వచ్చాయి. పేద మధ్యతరగతి ఇలా అందరికీ లబ్ది కలుగుతుంది.ఈ రిఫార్మ్స్ వల్ల పన్ను చెల్లింపు దారుల సంఖ్య 1.51 కోట్లకు పెరిగింది. అలాగే జిఎస్టీ వసూల్లు 22 లక్షల కోట్లకు పెరిగాయి. వన్ నేషన్ వన్ ట్యాక్స్ అనే విధానం సక్రమంగా అమలు కావటం వల్ల ప్రయోజనం చేకూరుతోంది. ఈ నెక్స్ జెన్ రిఫార్మ్స్ వల్ల ప్రపంచవ్యాప్తంగా డబుల్ డిజిట్ గ్రోత్ సాధించే దేశంగా భారత్ ఉంటుంది. జిఎస్టీ సంస్కరణలతో వచ్చిన ప్రయోజనాలను ప్రజలందరికీ చేరువ చేసే బాధ్యత అందరం తీసుకోవాలినిత్యావసర వస్తువులు సబ్బులు, టూత్ పేస్టు, షాంపూలు, నెయ్యి లాంటి వస్తువులన్నీ 5 శాతానికి వచ్చాయి. ఎసిలు, ఫ్రిడ్జ్‌ల ధరలు కూడా గణనీయంగా తగ్గుతాయి. జీవిత భీమా, ఆరోగ్యభీమాలకుకూడా జిఎస్టీ సున్నా శాతానికి వెళ్లింది. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రూ.750 కోట్ల వరకూ ఏపీకి ఆదా అవుతుంది. అగ్రిటెక్ యంత్రాలకు కూడా గణనీయంగా పన్ను తగ్గింది. రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

ఇళ్ల నిర్మాణానికి వినియోగించే వస్తువుల ధరలు కూడా 5శాతం శ్లాబ్‌లోకి వచ్చాయి. నిర్మాణరంగం పుంజుకుంటుంది. సాధారణ ప్రజలుకూడా వినియోగించు కునేలా ఎలక్ట్రానిక్స్ వస్తువులపై జిఎస్టీ తగ్గింది. రాష్ట్రంలో ప్రతీఒక్కరికీ ఈ జిఎస్టీ ప్రయోజనాలు దక్కాలి. చిట్ట చివరి వ్యక్తికి కూడా ఈ అంశాలు తెలియాలి. ఈసారి అన్ని పండుగలు ఘనంగా జరుపుకునే అవకాశం >>2



## 'పోలవరం' గడువు 3 నెలలు పొడిగింపు

### వచ్చే మార్చికి పనులు పూర్తిచేయాలని లక్ష్యం

### రూ. 55,548.90 కోట్లకు పెరిగిన అంచనా వ్యయం

**విజయవాడ, సెప్టెంబరు 18, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న 3 సాగునీటి ప్రాజెక్టులు 83 శాతానికి పైగా పూర్తయినట్లు కేంద్ర గణాంకశాఖ విడుదల చేసిన సమాచార పత్రంలో వివరించింది. రాష్ట్రంలో వివిధ శాఖలకు చెందిన 51 ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతుండగా రూ.1.30 లక్షల కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుల తాజా అంచనాలు రూ.1.84 లక్షల కోట్లకు పెరిగాయి. వాటికి ఇప్పటివరకూ రూ.1.01 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఇందులో పోలవరం ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.10,151.04 కోట్లనుంచి ఏకంగా రూ.55,548.90 కోట్లకు పెరిగింది.

కేంద్ర నిధులతో రాష్ట్రంలో చేపడుతున్న మొత్తం ప్రాజెక్టుల అంచనా వ్యయంలో పోలవరానిదే 30.13 శాతంగా ఉంది. దీనికి ఇప్పటివరకూ రూ.24,347.76 కోట్లు ఖర్చుచేశారు. రాష్ట్రంలో మొత్తం కేంద్ర ప్రాజెక్టుల కోసం చేసిన ఖర్చులో ఈ ప్రాజెక్టుకే 23.90 శాతం వెచ్చించారు. 2022 ఏప్రిల్‌కి పూర్తి కావాల్సిన పోలవరం ప్రాజెక్టు తాజా గడువును 2026 మార్చి వరకు పొడిగించారు. ఇప్పటివరకు 95 శాతం పూర్తయిన సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీని 2026 జూన్ నాటికి, 98 శాతం పూర్తయిన గుండ్లకమ్మ ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. దేశవ్యాప్తంగా కేంద్ర నిధులతో చేపట్టిన రూ.150 కోట్లకు మించిన ప్రాజెక్టుల పురోగతిని కేంద్ర గణాంకశాఖ తాజాగా వెల్లడించింది. దీనిప్రకారం కేంద్రనిధులతో చేపడుతున్న >>2



స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశం దృశ్యం

## 30 దాకా అసెంబ్లీ సమావేశాలు

**సచివాలయం,సెప్టెంబరు 18,ప్రభాతవార్త :** ఈనెల 30వ తేది వరకు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు బిఎసి సమావేశంలో తీర్మానించారు. గురువారం సీ ్పకర్ అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన జరిగిన బిఎసి సమావేశంలో మొత్తం 10 పనిదినాలుగా సమావేశం జరపాలని నిర్ణయించారు.ఈనెల 20,21,28 తేదీల్లో సెలవు దినాలుగా ప్రకటించారు.సమావేశంలో 19 అంశాలపై చర్చించాని టిడిపి నిర్ణయించగా బిజెపి 9 అంశాలపై చర్చించాలని సూచించగా జనసేన మూడు అంశాలపై చర్చించాలని బిఎసిలో నిర్ణయించారు.ఈ సమావేశంలో సిఎం చంద్రబాబు నాయుడు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టిడిపి నుండి చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు, జనసేన నుండి నాదెండ్ల మనోహర్, బిజెపి నుండి విష్ణు కుమార్ రాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

## కేబినెట్ భేటీ నేటికి వాయిదా

**విజయవాడ,సెప్టెంబరు18,ప్రభాతవార్తప్రతినిధి:** అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబునాయుడు కేబినెట్ భేటీ గురువారం మధ్యాహ్నం నిర్వహించాల్సి ఉంది. కానీ అనూహ్యంగా సమావేశం వాయిదా పడింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే....నేడు మధ్యాహ్నం నిర్వహించాల్సిన కేబినెట్ భేటీ అర్థాంతరంగా వాయిదా పడింది. రేపు మధ్యాహ్నం వెలగపూడిలోని సచివాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు సిఎం చంద్రబాబు ఛాంబర్‌లో మంత్రివర్గ సమావేశం నిర్వహించినట్లుగా అధికారులు వెల్లడించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోకి ప్రభుత్వం పలు బిల్లులను ఆర్డినెన్స్‌ల రూపంలో ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని యోచిస్తోంది. తొలుత కేబినెట్ భేటీ నిర్వహించి అమరావతి ప్రత్యేక ప్రయోజన వాహనం ఆమోదముద్ర వేయనున్నారు.

అదే విధంగా వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీని తాడిగడప పురపాలక సంఘంగా పేరు మార్చే ప్రతిపాదనకు ఓకే చెప్పనున్నారు. ఇక పంచాయితీ రాజ్, మున్సిపల్ చట్ట సవరణకు సంబంధించి ఆర్డినెన్స్, నాలా చట్ట సవరణ, షెడ్యూల్ సబ్ కాస్ట్, ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆర్డినెన్స్‌లకు కేబినెట్ ఆమోదం తెలిపి చట్ట సభల్లో ప్రవేశపెట్టనున్నారు.



## పోలీసు కస్టడీకి ఎంపి మిథున్ రెడ్డి!

**విజయవాడ, సెప్టెంబరు 18,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టిస్తోన్న ఎపి లిక్కర్ స్కాంకేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ మిథున్ రెడ్డిని పోలీస్ కస్టడీకి ఇస్తూ విజయవాడలోని ఎసిబి ప్రత్యేక న్యాయస్థానం గురువారం ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఐదు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సిట్ ఎసిబి కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే, సిట్ పిటిషన్‌పై నేడు ఎసిబి హైకోర్టు విచారణ చేపట్టింది. మిథున్‌రెడ్డిని రెండు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రెండు రోజుల పాటు అంటే ఈ నెల 19, 20 తేదీల్లో రెండు రోజులు కస్టడీలోకి తీసుకోనున్నారు.ఇక, ఏసీబీ కోర్టు ఆదేశాల మేరకు రేపు అనగా సెప్టెంబర్ 19న ఉదయం 8 గంటలకు మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు కస్టడీలోకితీసుకోనున్నారు. రెండు రోజుల పాటు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారించనున్నారు.

## 3 దశల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు!

### నవంబర్ తొలి వారంలో మొదటి దశ!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. నవంబర్ తొలి వారంలో తొలి దశ ఉండనున్నది. ఎన్నికల సంఘం డ్రాఫ్ట్ ప్రపోజల్ ద్వారా ఓ మీడియా సంస్థ ఈ అంచనా వేసింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను అక్టోబర్ మొదటి వారంలో ఇసి ప్రకటించనున్నది.

ఛాత్ పూజా సంబరాలు ముగిసిన తర్వాత ఎన్నికల ప్రక్రియ చేపట్టాలన్న ఆలోచనలో ఇసి ఉన్నట్లు తెలుస్తోంది. మూడు దశల్లోనే ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఇసి ప్రణాళిక వేసినట్లు భావిస్తున్నారు. బీహార్ అసెంబ్లీ కాల పరిమితి నవంబర్ 22వ తేదీన ముగుస్తుంది. అయితే ఎన్నికలను ఆతేదీలోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. 2020లో కూడా బీహార్ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించారు.

# ఇబ్బందులున్నా సంస్కరణలే మిన్న

### జిఎస్టీ సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఎపి

### ప్రజల చేతిలో పెరగనున్న సంపద: అసెంబ్లీలో డిసిఎం పవన్



గురువారం అసెంబ్లీలో మాట్లాడుతున్న డిసిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా ఈ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఎపినే అని రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేసారు. జిఎస్టీ 2.0 సంస్కరణలపై ఎపి శాసనసభలో తీర్మానం చేశారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిఎస్టీ సంస్కరణలపై ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రకటనను స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. జిఎస్టీ మండలి 56వ సమావేశంలో జిఎస్టీ సంస్కరణలను కేంద్రమంత్రి నిర్మాలా సీతారామన్ ఆమోదించారని గుర్తుచేశారు. రాష్ట్ర ఆదాయాలకు ఇబ్బందిగా ఉన్నా ఈ చారిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలిరాష్ట్రం ఎపినే అని ఉద్ఘాటించారు. జిఎస్టీ పన్నుల నూతన విధానం ద్వారా ప్రజలకు మేలు చేసే వీలు కలుగుతుందన్నారు. ఇది ప్రజలు, ఆర్థిక వ్యవస్థకు చాలా లాభదాయకని నొక్కిచెప్పారు. వ్యవసాయ పనిముట్లు, యంత్రాల రేట్లు తగ్గి ఉత్పత్తి పెరుగుతుందని పేర్కొన్నారు.

పాలు, పెరుగుపై పన్ను 5శాతం నుంచి సున్నా శాతానికి అలాగే నిత్యావసరాల ధరలు చాలా వరకూ 18 నుంచి 5 శాతానికి తగ్గుతున్నాయని గుర్తుచేశారు. సిమెంట్‌పై పన్నును 28 నుంచి 18కి తగ్గించారని తెలిపారు. అత్యవసర మందులపై జిఎస్టీ పన్ను లేకుండాచేయడం ఎంతోమేలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ సంస్కరణల ద్వారా ప్రజల చేతిలో సంపద పెరిగి వస్తువుల వాడకం పెరుగుతుందని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్.

జిఎస్టీ విషయంలో వాణిజ్య, వ్యాపార సంఘాలు అంగీకారం తెలిపినందుకు ఎపి ప్రభుత్వం తరఫున ధన్యవాదాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లా నుంచి గ్రామస్థాయి వరకూ ఏఏ బెనిఫిట్స్ జిఎస్టీ సంస్కరణల ద్వారా అమలు అవుతాయో తెలియజేయాల్సిన అవసరం కూడా ఉందని నొక్కి చెప్పారు పవన్. పరస్పర అవగాహనతోపాటు మీడియా వేదిక ద్వారా ప్రజలకు లాభాల గురించి తెలియజేయాలని కోరారు. జీఎస్టీ సంస్కరణలపై ఎపి ప్రభుత్వం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వ్యవసాయ ఉత్పాదకతపెరిగి గ్రామీణ ప్రజల ఆదాయం పెరుగుతుంది.

రైతుల కోసం ట్రాక్టర్లు, వ్యవసాయ యంత్రాలు పరికరాలు, ఇన్ పుట్స్‌పై పన్నులు తగ్గించడం సాగు వ్యవసాయ వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకత పెంచుతాయి. తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల ఆదాయం పెంచుతాయి. ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం ప్రోత్సహించడం ద్వారా వ్యవసాయ వృద్ధి బలపడతుంది. తక్కువ ఆదాయ కుటుంబాల కోసం పాలు,పెరుగు, పన్నీర్ లాంటి నిత్యవసరాలపై పన్ను తగ్గించడం >>2



## పంచాయితీల్లోనూ ఆన్‌లైన్ అనుమతులు

### భవన నిర్మాణాలకు మరింత సౌలభ్యం

### డిపిఎంఎస్ విధానం త్వరలో అనుసంధానం

### జనవరి ఫస్ట్ నుంచి అమలుకు అవకాశం

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ పంచాయితీల్లోనూ భవన నిర్మాణాలకు ఆన్ లైన్‌లో అనుమతులిచ్చేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. పట్టణ స్థానిక సంస్థల్లో అమలులో ఉన్న డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం (డిపిఎంఎస్)ను పంచాయితీలకూ అనుసంధానించనున్నారు. పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోని అన్ని పంచాయితిల్లోనూ ఇదేవిధానంలో కొత్త నిర్మాణాలకు అనుమతులు ఇవ్వనున్నారు. పురపాలక,పంచాయితీరాజ్ శాఖల మధ్య దీనిపై ఇప్పటికే చర్చలు జరిగాయి. వచ్చే ఏడాది జనవరి నుంచి పంచాయితీల్లోనూ ఆన్‌లైన్ అనుమతుల విధానం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. పంచాయితీల్లో కొత్త ఇళ్లు,భవన నిర్మాణాలకు అనుమతులకు ఇప్పటి వరకు పారదర్శకమైన వ్యవస్థ లేదు. చాలా చోట్ల నేతల ప్రమేయంతో అనుమతులు లేకుండానే నిర్మాణాలు వెలుస్తున్నాయి. పంచాయితీ కార్యదర్శులు,జిల్లా పట్టణ ప్రణాళిక అధికారుల నుంచి అనుమతులు తీసుకున్నా నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారు.ఈ క్రమంలో పరిస్థితిని చక్కదిద్దడానికి అనుమతుల్లో పారదర్శకత, జవాబుదారీతనం కోసం పట్టణ,స్థానిక సంస్థల్లో అమలులో ఉన్న డిపిఎంఎస్ విధానాన్ని పంచాయితీలకు అనుసంధానించాలని ఆరు నెలల క్రితమే ప్రభుత్వం నిర్ణయించింది. >>2

## రాష్ట్రానికి 13 వేల మె.ట యూరియా కేటాయింపు

### ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు తీసుకొంటున్నాం: మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రానికి 13,050 మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయిస్తూ గురువారం కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నెల 20వ తేదీకి గంగవరం పోర్ట్‌కు యూరియా రాష్ట్రానికి చేరుతుందనిఅన్నారు. ఈ కేటాయింపుతో రైతులకు మరింత వెసులుబాటు లభిస్తుందని, రైతులకు ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, రాష్ట్రంలో ఇప్పటికే సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి భరోసా ఇచ్చారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతి రైతు అవసరాలను, సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సమగ్ర దృష్టితో ముందుకొస్తుందని, రైతుల ఆదాయాన్ని పెంచడం, పంటలకు సరైన మార్కెటింగ్‌ను అందించడం కూటమిలక్ష్యమని తెలిపారు.

# 5 రాష్ట్రాల్లో ఇడి తనిఖీలు

### ఎపి లిక్కర్ కేసులో తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోనూ కీలక పత్రాలు స్వాధీనం

### హవాలా, షెల్ కంపెనీల ద్వారా రూ. 3,500 కోట్లు మళ్లినట్లు ఆరోపణలు

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీ హయాంలో ఎపిలో జరిగిన మద్యం కుంభకోణం అభియోగం కేసు విచారణలో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరక్టరేట్ (ఇడి) రంగంలోకిదిగింది. సిట్ సేకరించిన వివరాల ఆధారంగా తెలుగు రాష్ట్రాలతోపాటు, తమిళనాడు, కర్ణాటక, దిల్లీలోనూ సోదాల కొరడా ఝుళిపించింది. ఏకకాలంలో 5 రాష్ట్రాల్లోని 20 ప్రాంతాల్లో ఇడి అధికారులు తనిఖీలు చేస్తూ కీలకపత్రాలను స్వాధీనం చేసుకుంటున్నారు.

ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో చోటుచేసుకున్న మద్యం కుంభకోణాల్లో హవాలా కోణాలు వెలికితీసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఎట్టకేలకు రాష్ట్రంలో వైఎస్సార్సీ హయాం లిక్కర్ స్కామ్‌పైనా దృష్టిసారించింది. పిఎంఎల్ఎ చట్టం కింద కేసు నమోదు చేసి దేశవ్యాప్తంగా ఏకకాలంలో 5 రాష్ట్రాల్లో ఆకస్మిక సోదాలు చేస్తోంది. హవాలా మార్గాల్లో విదేశాలకు తరలిపోయిన నగదుతో పాటు ముడుపులతో కూడబెట్టిన ఆస్తులపై ఆరా తీస్తోంది. హైదరాబాద్ వెస్ట్ మారేడ్ పల్లిలోని వెల్లింగ్టన్ ఎంక్లేవ్‌లో వ్యాపారవేత్త బూరుగు రమేష్, ఆయన కుమారుడు విక్రాంత్ నివాసంలో దాదాపు 7 గంటలపాటు తనిఖీలు చేసిన అధికారులు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. కాస్పో లీగల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్,మహదేవ జువెలర్స్, రాజశ్రీ ఫుడ్స్ కంపెనీల్లో విక్రాంత్ డైరెక్టర్‌గా ఉన్నారు. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి ఆస్తులపై ఇడి దృష్టి సారించినట్లు తెలుస్తోంది. మొత్తం 23 సూట్ కేసు కంపెనీల్లో లావాదేవీలపై ఇడి దృష్టి పెట్టినట్లు సమాచారం. సిట్ వేసిన ఛార్జిషీట్‌లోని నిందితుల ఆస్తులు, కంపెనీలపై దృష్టి సారించిన ఇడి హైదరాబాద్‌లో సిట్ స్వాధీనం చేసుకున్న 11 కోట్ల రూపాయలపై ఆరాతీసినట్లు తెలుస్తోంది. పలు కంపెనీలకు ఇడి అధికారులు నోటీసులు ఇచ్చి వెళ్లారు.

వైఎస్సార్సీ హయాంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు తెరిచి ప్రముఖ బ్రాండ్లన్నీ పక్కనపెట్టి జే బ్రాండ్లకు గేట్లెత్తారు. కొన్ని >>2

## వివిధ ఆలయాల బోర్డులకు చైర్మన్ల నియామకం

2లో

19-09pg2exHMNWJQE 2_19-09pg2exHMNWJQE.qxd 9/19/2025 12:12 AM Page 1





గురువారం డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌తో భేటీ అయిన ఎమ్మెల్సీ నాగబాబు

# డి సిఎం పవన్‌తో నాగబాబు భేటీ

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన నేత, నూతన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు ఉప ముఖ్యమంత్రి, తన సోదరుడు పవన్ కల్యాణ్‌ను కలిశారు. శాసనమండలి సభ్యుడిగా తొలిసారి సమావేశాలకు హాజరయ్యే ముందు ఆయన పవన్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసనమండలి సమావేశాలు నేటి నుంచి ప్రారంభమైన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. ఈ సందర్భంగా, మండలిలో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రజా సమస్యల ప్రస్తావన వంటి పలు అంశాలపై నాగబాబుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. రాష్ట్రంలో ఇటీవల ఖాళీ అయిన ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి ఒక స్థానం దక్కింది. ఆ స్థానానికి పార్టీ తరఫున నాగబాబు పేరును ఖరారు చేయడంతో, ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఎమ్మెల్సీగా ఎన్నికైన తర్వాత తొలిసారి శాసన మండలి సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న నాగబాబు, తన తమ్ముడు, డిప్యూటీ సిఎంను కలవడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

# ముందే వచ్చిన దసరా, దీపావళి

>> ఉంది.
మోడీ సంస్కరణలతో పరోక్ష పన్ను చెల్లింపుదారులు 132 శాతం పెరిగారు.
2017లో 65 లక్షల మంది ఉంటే.. ప్రస్తుతం 1.51 కోట్ల మంది పన్ను చెల్లింపుదారులున్నారు.
జిఎస్టీ రిసిప్ట్‌ల ద్వారా 2018లో రూ.7.19 లక్షల కోట్లు మాత్రమే ఆదాయం, ప్రస్తుతం రూ.22.08 లక్షల కోట్ల ఆదాయం.
జిఎస్టీ సంస్కరణలు.. పేదల జీవితాల్లో ప్రభావం చూపుతుంది.
వాజ్‌పేయీ హయాంలో జీఎస్టీ సంస్కరణలు తీసుకువచ్చారు.
ఇపుడు జిఎస్టీ రెండో తరం సంస్కరణలు తీసుకువచ్చారు.
ఆ సంస్కరణలకు నేను ఎప్పుడూ ముందుంటాను.
అభివృద్ధి జరిగితే సంపద సృష్టి.. ప్రభుత్వానికి ఆదాయమనీ, ప్రభుత్వానికి ఆదాయం వస్తే సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందనీ సిఎం అన్నారు.
అప్పులు చేసి సంక్షేమం ఇవ్వడం సరికాదనేది నా నమ్మకం.
ఆర్థిక ఇబ్బందులు వచ్చినా.. దేశం, రాష్ట్రమే ముఖ్యం.
దీర్ఘకాల సంస్కరణలను దృష్టిలో పెట్టుకుని చూడాలి.
జిఎస్టీ గేమ్ ఛేంజర్.. సంస్కరణలకు మద్దతివ్వాలని చెప్పానని అన్నారు.
గతంలో 4 టైర్ (5, 12, 18, 28 శాతం)పన్నుల వ్యవస్థ ఉండేది.
ఒకే ఉత్పత్తికి సంబంధించి అనుబంధ ఉత్పత్తులు వస్తే పన్నులు మార్చేవారు.
పన్నుల విధానంలో 2 శ్లాబులు (5, 18 శాతం) ఉంచి సరళతరం చేశారు.
కొత్త పన్నుల విధానంతో ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుంది.
సంస్కరణలను ముందుండి నడిపిన నిర్మలా సీతారామన్ కృషి అభినందనీయం.
రాష్ట్ర ఆదాయానికి నష్టం కలిగినా సామాజిక ప్రయోజనాల కోసం సమర్థించామని పేర్కొన్నారు.
చరిత్రాత్మక సంస్కరణలకు మద్దతు తెలిపిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.
జిఎస్టీ పన్ను విధానం సులభతరం ద్వారా ప్రజలకు ప్రత్యక్ష లాభం చేకూరుతుందని అన్నారు.
వ్యాపారులపై పన్నుల భారం తగ్గి.. పన్నుల వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది.
ప్రజల పొదుపు పెంచి.. కొనుగోలు శక్తి పెంపొందించేందుకు దోహదం చేస్తుంది.
స్థిరమైన వృద్ధి మార్గంలో నిలపడానికి ఈ సంస్కరణలు ఉపయుక్తంగా ఉంటుందన్నారు.
కొత్త పెట్టుబడులు పెంచి.. ఆర్థిక వృద్ధికి దారితీస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.



అమరావతిలో నిర్మిస్తున్న ప్రభుత్వ సముదాయం సూక్ష్మ నమూనా

# ఆకట్టుకునేలా అమరావతి ప్రభుత్వ సముదాయ సూక్ష్మ నమూనా

## -19న నిర్వహించే ప్రాపర్టీ షోలో ప్రదర్శన

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతిలో నిర్మిస్తున్న ప్రభుత్వ సముదాయం (గవర్నమెంట్ కాంప్లెక్స్) సూక్ష్మ నమూనాను ప్రభుత్వం తయారు చేయించింది. హైదరాబాద్‌లో తయారైన నమూనా గురువారం విజయవాడ రానుంది. అమరావతి నగరం గురించి ప్రజలు తెలుసుకునేలా, భవిష్యత్తులో సమకూరబోయే మౌలిక వసతులు,నిర్మాణాలు నమూనాలో సమకూర్చారు. రాజధానినిర్మాణం పూర్తయ్యాక స్వరూపం ఎలా ఉంటుందో తిలకించే అవకాశం ఏర్పడుతుంది. సూక్ష్మ నమూనాలో అసెంబ్లీ భవనం,హైకోర్టు 50 అంతస్థుల జిఎడి టవర్‌తో పాటు నాలుగు హెచ్‌వోడీ టవర్లు,మెట్రో లైన్లు, ఐకానిక్ తీగల వంతెన,ప్రధాన మౌలిక వసతులు,రవాణా సదుపాయాలున్నాయి. నరెడ్కో సెంట్రల్ జోన్,కేంద్ర గృహ నిర్మాణ,పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అధ్వర్యంలో నగరంలోని ఏ కన్వెన్షన్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు జరిగే 11వ అమరావతి స్థిరాస్థి ప్రదర్శనలో ఈ నమూనాను ప్రదర్శిస్తారు. అనంతరం అమరావతిలోని ఎపి సిఆర్డీఎ కార్యాలయంలో ఉంచుతారు.

# ఇబ్బందులున్నా సంస్కరణలే మిన్న

>> ద్వారా 5 శాతం నుంచి 0 శాతానికి తగ్గించడం ద్వారా రోజు వారి వ్యయాన్ని తగ్గించినట్టు అవుతుంది. నెయ్యి, వెన్న, వంట పాత్రలపై పన్ను 12 శాతం నుంచి 5 శాతంకి తగ్గించడం ద్వారా కుటుంబ బడ్జెట్‌కి చాలా ఉపశమనం కలిగిస్తుంది. సబ్బులు, షాంపూలు, పేస్టులు వంటి వ్యక్తిగత సంరక్షణ వస్తువులపై జిఎస్టీ తగ్గింపు ద్వారా వాటి ధరల గణనీయంగా తగ్గుతాయి. తద్వారా ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత మెరుగవుతుంది. మధ్య తరగతి కోసం కార్లు, ఫ్రిజ్‌లు, టీవీలు, ఎయిర్ కండీషన్లపై 18 శాతానికి తగ్గించడం ద్వారా వాటి ధరలు అందుబాటులోకి వచ్చి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయి. గృహ నిర్మాణానికి అవసరం అయిన సిమెంటుమీద పన్ను 18 శాతానికి తగ్గించడం నిర్మాణవ్యయం తగ్గుతుంది.

**శ్లాబులపై ప్రజలకు అవగాహన కల్పిద్దాం**

జిఎస్టీ సంస్కరణల లాభాలు ప్రతి కుటుంబానికి చేరే విధంగా అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలి. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు ప్రజలందరికీ తెలియజేసే కార్యక్రమం చేపట్టాలి.
గ్రామ స్థాయిలో రెవెన్యూ అధికారులు ప్రజలను నేరుగా కలిసి వారికి ఎలా లబ్ధి చేకూరుతుందో చెప్పాలి. ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలి. ప్రతి కుటుంబం జిఎస్టీ సంస్కరణల గురించి తెలుసుకుని లాభాలు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ చారిత్రాత్మక మార్గదర్శక సంస్కరణలను ఆహ్వానిస్తూ ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం వాటి విజయవంతమైన అమలుకు సహకరిస్తుంది" అన్నారు.

## మెగా డిఎస్సీ నియామక పత్రాల పంపిణి వాయిదా

**విజయవాడ, సెప్టెంబరు 18, ప్రభాతవార్త ప్రతినిధి:** భారీ వర్షాల కారణంగా ఎపి మెగా డిఎస్సీ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం వాయిదా వేశారు. డిఎస్సీ ద్వారా ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు శుక్రవారం నియామక పత్రాలు అందించాల్సి ఉంది. సిఎం చంద్రబాబు,మంత్రి లోకేష్, ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అసెంబ్లీ వెనుక ప్రాంగణంలో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. కానీ బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ప్రాంగణం తడిసి ముద్దయింది. ప్రదేశం అనుకూలంగా లేకపోవడంతో కార్యక్రమాన్ని ప్రభుత్వం వాయిదా వేసింది.

## ఆన్‌లైన్ అనుమతులు

>> ఆగస్టు 15 నుంచి అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసినా కొన్ని సాంకేతిక, ఫీజుల విషయంలో తలెత్తిన సమస్యలతో తాత్కాలికంగా వాయిదా వేశారు. వీటి పరిష్కారానికి ఉన్నత స్థాయిలో ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయి. 300 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మాణాలకు ఇప్పటి వరకు పంచాయితీ కార్యదర్శులు అనుమతులిస్తున్నారు. అంతకంటే మించినవి జిల్లా పట్టణ ప్రణాళిక అధికారులకు వెళ్తున్నాయి. భారీభవనాలైతే పట్టణాభివృద్ధి సంస్థలు అనుమతులు ఇస్తున్నాయి. నిబంధనల ప్రకారం పంచాయితీలకు ఫీజుల్లోరావాల్సిన వాటా మొత్తాలు పట్టణాభివృద్ధి సంస్థలు సరిగా విడుదల చేయట్లేదు. డిపిఎంఎస్ విధానం అమల్లోకి వచ్చాక పంచాయితీలకు పక్కాగా ఆదాయం రావాల్సిందేనని పంచాయితీరాజ్ శాఖ పట్టుబడుతోంది. ప్రభుత్వ స్థాయిలో త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

# 3 నెలలు పొడిగింపు

>> ప్రాజెక్టుల్లో రైల్వేవి అత్యధికంగా 28 ఉన్నాయి. ఇందులో మలుగూరు పాలసముద్రం మధ్య 17.97 కిలోమీటర్ల పొడవైన కొత్త రైల్వే ప్రాజెక్టు, గుంతకల్లు వెస్ట్‌మల్లప్ప గేట్ రైల్ ఓవర్ రైల్ ట్రాక్, తిరుపతి-కాట్పాడి మధ్య 104.39 కిలోమీటర్ల లైన్, గూడూరు-రేణిగుంట మధ్య 83.17 కి.మీ. మూడో లైన్, ముద్ఖేడ్, మేడ్చల్ మహబూబ్‌నగర్, డోన్ సెక్షన్‌లో 417.88 కి.మీ. డబ్లింగ్, విజయనగరం-సంబల్‌పూర్ మూడో లైన్, మల్కన్‌గిరి-పాండురంగాపురం మధ్య కొత్త రైల్వే లైన్, ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు రైల్వే లైన్ నిర్మాణాలు ఇంకా జీరో పురోగతిలోనే ఉన్నాయి. కర్నూలు 3 పీఎస్ఆర్ ఈ ట్రాన్స్‌మిషన్ లైన్, కర్నూలు4 ఆర్ఈజెడ్ ఫేజ్1 ట్రాన్స్‌మిషన్ సిస్టం ప్రాజెక్టులూ సున్నా స్థాయిలోనే ఉన్నాయి.
కర్నూలు, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టులు 6 శాతం మేర పూర్తయ్యాయి. 2022 మార్చికి పూర్తికావాల్సిన ఈ ప్రాజెక్టు గడువును 2030 మార్చికి పొడిగించారు. రూ.1,420 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రూ.165.65 కోట్లు ఖర్చుచేశారు. పెట్రోలియం శాఖకు చెందిన విశాఖరాయ్‌పూర్ పైప్‌లైన్ ప్రాజెక్టు 8 శాతం మాత్రమే జరిగింది. 2024 సెప్టెంబరుకు పూర్తికావాల్సిన ఈ ప్రాజెక్టును 2027 సెప్టెంబరుకు వాయిదా వేశారు. రూ.2,212 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటివరకు రూ.13.45 కోట్లే ఖర్చుచేశారు. కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఇప్పటివరకూ 24 శాతం మాత్రమే పూర్తయింది. రూ.305 కోట్ల ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.83.33 కోట్లు ఖర్చుచేశారు. దీని గడువును 2027 జూన్‌గా తెలిపారు.
విజయవాడ విమానాశ్రయంలో కొత్త సమీకృత టెర్మినల్ నిర్మాణం 79 శాతం పూర్తయినట్లు కేంద్రం వెల్లడించింది. 2022 సెప్టెంబర్ నాటికి పూర్తికావాల్సిన దీని నిర్మాణ గడువును తాజాగా 2025 డిసెంబరుకు పొడిగించినట్లు తెలిపింది. రూ.611.8 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు ఇప్పటివరకు రూ.473.27 కోట్లు ఖర్చు చేసింది. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో డొమెస్టిక్ టెర్మినల్ నిర్మాణం 51 శాతం పూర్తి కాగా రూ.347.15 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు రూ.90.56 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మొత్తం పనులు పూర్తిచేయా లన్నది లక్ష్యం. కడప విమానాశ్రయంలో కొత్త డొమెస్టిక్ టెర్మినల్ నిర్మాణం, ఇతర పనులు, నిర్వహణ పనులు అన్నీ కలిపి 34 శాతం పూర్తయ్యాయి. రూ.265.91 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టుకు రూ.50.06 కోట్లు ఖర్చు అయ్యినట్లు తెలిపింది. 2026 మార్చి నాటికి మొత్తం పనులు పూర్తి చేయాలన్నది లక్ష్యమని కేంద్రం వెల్లడించింది.

# వివిధ ఆలయాల బోర్డులకు చైర్మన్ల నియామకం

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ దేవాలయాల బోర్డులకు చైర్మన్లను నియమించింది. టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీలకు ప్రెసిడెంట్లను నియమించింది. వివిధ ఆలయాల బోర్డులకు చైర్మన్లను నియమిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. శ్రీశైలం భ్రమరాంబ మల్లిఖార్జున స్వామి దేవస్థానం పాలక మండలికి చైర్మన్‌గా పోతుగుంట రమేశ్ నాయుడు శ్రీకాళహస్తి కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మండలికి చైర్మన్‌గా కొట్టె సాయి ప్రసాద్, కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం మండలికి చైర్మన్‌గా వి. సురేంద్ర బాబు (మణి నాయుడు),విజయవాడ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం (ఇంద్రకీలాద్రి) మండలికి చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ (గాంధీ), వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం మండలికి చైర్మన్‌గా ముదునూరి వెంకట్రాజులు నియమితులయ్యారు.

**టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీలకు ప్రెసిడెంట్ల నియామకం**

టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - ఏవీ రెడ్డి, టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - నేమూరి శంకర్ గౌడ్,. టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, బెంగళూరు - వీరాంజనేయులు, టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, ఢిల్లీ - ఎదుగుండ్ల సుమంత్ రెడ్డి. టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, ముంబై - గౌతమ్ సింగానియా, టిటిడి లోకల్ అడ్వైజరీ కమిటీ, విశాఖపట్నం - వెంకట పట్టాభిరామ్ చోడేలు నియమితులయ్యారు.

# తెలంగాణలో పండుగలకు 7754 ప్రత్యేక బస్సులు

## 20 నుంచి అక్టోబరు 2 దాకా స్పెషల్ సర్వీసులు

**హైదరాబాద్, ప్రభాతవార్త, సెప్టెంబరు 18:** తెలంగాణ రాష్ట్రంలో ఘనంగా నిర్వహించే బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ఆర్‌టిసి) యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. దసరా, బతుకమ్మ పండుగలకు రాష్ట్రవ్యాప్తంగా 7754 స్పెషల్ బస్సులను నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. వాటిలో 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు ఆర్‌టిసి ప్రకటించింది. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, దసరా అక్టోబర్ 2న ఉన్నందున.. ఈ నెల 27 నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది. తిరుగు ప్రయాణానికి సంబంధించి అక్టోబర్ 5, 6వ తేదిల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులను సంస్థ ఏర్పాటు చేయనుంది. హైదరాబాద్‌లో ప్రధాన బస్టాండులైన ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తోపాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్‌రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్ సుఖ్ నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడిపించనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు ప్రత్యేక బస్సులు నడుపుతోంది. దసరా స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరించనుంది. ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 తేదివరకు వరకు... అలాగే అక్టోబర్ 1,5,6 తేదిల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే సవరణ (అదనపు) ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యూలర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని.. అవి యధావిధిగా ఉంటాయని ఆర్‌టిసి పేర్కొంది. గత దసరా కంటే ఈ సారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని.. ముఖ్యంగా ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్ నగర్, తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కూర్చీలు, తాగునీరు, మౌలిక సదుపాయాలతోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్టు ఆర్‌టిసి ఎండి విసి సజ్జనార్ తెలిపారు. ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నామని, ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారని తెలిపారు.
పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి.. ఇబ్బందులు పడొద్దని సజ్జనార్ సూచించారు. ఆర్‌టిసిలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షి తంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను సంస్థ అధికారిక వెబ్ సైట్‌లో చేసుకోవాలని కోరారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టిజిఎస్ఆర్‌టిసి కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

# 5 రాష్ట్రాల్లో ఇడి తనిఖీలు

>> డిస్టిలరీలను హస్తగతం చేసుకుని రకరకాల పేర్లతో మద్యం ఉత్పత్తి చేయించారు. కమీషన్లు ఇచ్చిన కంపెనీలకే అధిక ఆర్డర్లు కట్టబెట్టారు. బెవరేజెస్ కార్పొరేషన్ నుంచి మద్యం సరఫరదారుకు బిల్లులు చెల్లించగానే మద్యం ముఠా తమ ముడుపులు వసూలు చేసుకునేవారు. ఈ ప్రక్రియంతా పక్కా కుట్రపూరితంగా జరిగిందని ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ తేల్చింది. వైఎస్సార్సీ హయాంలో మద్యం మాటున దాదాపు రూ.3,500 కోట్ల దోపిడీకి పాల్పడినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం గుర్తించింది. ఈ మొత్తాన్ని డొల్ల కంపెనీలు, బినామీ సంస్థల ద్వారా మళ్లించినట్లు ఛార్జిషీట్లలో పేర్కొంది. మద్యం ముడుపుల సొమ్ముతో కొందరు స్థిరాస్తి వ్యాపారాలు చేయగా మరికొందరు విదేశాల్లో పెట్టుబడులు పెట్టినట్లు సిట్ కొన్ని కీలక ఆధారాలు సేకరించింది. ఇప్పటివరకూ 29 మంది వ్యక్తులు, 19 సంస్థలను నిందితులుగా చేర్చింది. 12 మందిని అరెస్టు చేసింది. మద్యం ముడుపులను విదేశాలకు హవాలామార్గంలో తరలించారనే కోణంలో ఇడి రంగంలోకి దిగింది.

## ఎయిరిండియాకు తప్పిన పెను ప్రమాదం!

- విశాఖ నుండి హైదరాబాద్ వెళ్లే విమానం రెక్కలో ఇరుక్కున్న పక్షి
- చాకచక్యంగా వ్యవహరించిన పైలట్

**విశాఖపట్నం, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:** విశాఖ నుంచి హైదరాబాద్‌కు బయల్దేరిన ఎయిరిండియా విమానానికి పెను ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి మధ్యాహ్నం 2.20 గంటలకు హైదరాబాద్‌కు విమానం బల్దేరింది. విమానం గాలిలోకి ఎగిరిన కొంతసేపటికే విమానం రెక్కలో పక్షి ఇరుక్కుంది. దీంతో ఇంజిన్ ఫ్యాన్ రెక్కలు దెబ్బతిన్నాయి.పైలట్ చాకచక్యంగా వ్యవహరించి విమానాన్ని తక్షణమే వెనక్కి తిప్పి తీసుకొచ్చి ల్యాండ్ చేశారు. ఘటన సమయంలో విమానంలో మొత్తం 103 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎయిరిండియా యాజమాన్యం ప్రయాణికులు హైదరాబాదు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.

## వారం - వర్జ్యం

19-09-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
త్రయోదశి రా.11.40
ఆశ్లేష ఉ.7.06
వర్జ్యం : రా.7.36-9.16
దు.ఉ.8.23-9.12, మ.12.27-1.16
శుభసమయం : ఉ.6.45-7.30
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** ఆస్తి పంపకములో నిందారోపణలు రానివ్వకుండా చాకచక్యంగా వ్యవహరిస్తారు.

**వృషభం:** నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు.

**మిథునం:** ఎదురు చూడని అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగ యత్నాలకు అనుకూలమై కాలం.

**కర్కాటకం :** గృహం, భూములు కొనుగోలు యత్నాలు ముమ్మరం చేస్తారు. ఆర్థిక పరిస్థితి అనుకూలం.

**సింహం:** క్రమశిక్షణకు ప్రాధాన్యత నిచ్చి, కష్టపడి, ప్రతిష్టాకమైన మంచి ఫలితాలను సాధిస్తారు.

**కన్య :** నూతన ప్రయత్నాలలో పురోగతిని సాధిస్తారు. ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**తుల :** ప్రముఖులను కలుసుకొని కీలక సమాచారం తెలుసుకుంటారు. ఉద్యోగులకు హోదాలు లభిస్తాయి.

**వృశ్చికం:** సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు.

**ధనుస్సు:** మాటల చాతుర్యంతో శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**మకరం:** నూతన ప్రయత్నాలలో పురోగతి సాధిస్తారు. సంఘంలో ప్రత్యేకమై గుర్తింపు పొందుతారు.

**కుంభం:** ప్రముఖులతో చర్చలు సాగిస్తారు. ఇంటిలో శుభకార్యాల ప్రస్తావన వుంటుంది.

**మీనం :** నూతన ఉద్యోగావకాశాలు లాభిస్తాయి. స్థిరాస్తి వివాదాల నుండి బయటపడతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోలి, హైదరాబాద్

# గిన్నిస్‌లోకి తెలంగాణ 'బతుకమ్మ'

## ప్రపంచ రికార్డు సృష్టించేలా సంబురాలు జరుపుతాం: తెలంగాణ మంత్రులు జూపల్లి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 18,ప్రభాతవార్త:** గిన్నిస్ బుక్ రికార్డులో చేరేలా బతుకమ్మ సంబరాలు జరుపుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. గాంధీభవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, హనుమంతరావుతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి అని బతుకమ్మ అంటే ప్రకృతి గౌరవించడం,ప్రకృతిని కాపాడటమని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పండుగలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని తెలంగాణ సంస్కృతి ప్రపంచానికి చాటి చెప్పాలి మంత్రి పిలుపునిచ్చారు. 21నుండి31 వరకు బతుకమ్మ పండుగ ఘనంగా జరుపుతామని వివరించారు. 21 న వెయ్యి సంభాల వద్ద ప్రారంభం చేయబోతున్నామని అన్నారు. పూలనే దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ, బతుకమ్మ పండుగ పూల పండుగ మాత్రమే కాదు , ఆడబిడ్డలను గౌరవించుకునే పండుగ అని తెలిపారు. బతుకమ్మ తెలంగాణ ఆత్మగౌరవానికి, ప్రత్యేక సాంస్కృతిక అస్తిత్వానికి ప్రతీతెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా గౌరవిస్తుందని తెలిపారు. కవులను రచయితలను పిలిచి వారితో చర్చించి బతుకమ్మ పాటలకు ట్యూన్స్ కట్టించడంతోపాటు, ఆ పాటలను ముందు తరాలకు అందించేలా ముద్రణ చేయిస్తామని తెలిపారు. బతుకమ్మ జరిగే ప్రాంతంలో డెకరేషన్ ఏర్పాటు చేయడంతోపాటు విమానాశ్రయంలో కూడా మన సంస్కృతి తెలిసేలా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బతుకమ్మ పండుగలో ప్రజలు అందరూ భాగస్వామ్యం కావాలి అని కోరుతున్నాను. వివిధ రుగ్మతలు పారదోలే విధంగా అవగాహన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని అన్నారు. బతుకమ్మ పండుగ ఉద్దేశం అందరూ కలిసి ఆత్మీయత కోసం ఇది వ్యక్తుల కార్యక్రమం కాదు అందరి పండుగ అని ఆయన తెలిపారు. మాజీ ఎంపీ హనుమంతరావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా బతుకమ్మ కుంటలో ఆడకుండా చేశారు గత ప్రభుత్వం హయంలో ఎంతోమందిని అడిగినా పట్టించుకోలేదని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ నాయకుడు కబ్జా చేశాడు కాంగ్రెస్ అధికారంలో రాగానే బతుకమ్మ కుంట చాలా బాగా చేసారు నేను సోనియా గాంధీకి ఇది మా సంస్కృతి అని కూడ బతుకమ్మ అని చెప్తే ఆమె కూడ బతుకమ్మ ఎత్తుకుందని గుర్తుచేసుకొన్నారు. బతుకమ్మ కుంటను కాపాడిన రేవంత్ రెడ్డికి, హైడ్రాకు నా అభినందనలు అని అన్నారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ సంప్రదాయం బతుకమ్మ పండుగ కాంగ్రెస్ శ్రేణులు ఎంగిలి పువ్వు నుండి సద్దుల బతుకమ్మ వరకు ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్ళాలని కోరారు. చాలా వరకు 2000 నుండి బతుకమ్మ ఏర్పాటు అయింది అపోహ ఉందని కానీ ఇది పాత పండుగనే అని ఆయన తెలిపారు. కొందరు బతుకమ్మను రాజకీయం చేశారని అన్నారు. రకరకాల పాటలతో బతుకమ్మ ను ఇప్పటికీ రాజకీయం చేస్తున్నారు ఇది తెలంగాణ సంస్కృతికి దర్పణం పట్టేపండుగ అని ఆయన అన్నారు. తెలంగాణ సంప్రదాయంబతుకమ్మ పండుగలో ప్రతి ఒక్కరూ పార్టీలకు అతీతంగా జరుపుకోవాలిబతుకమ్మ కుంట బతుకమ్మ కోసం మళ్ళీ వచ్చింది. బతుకమ్మ కుంటను కాపాడటంలో రేవంత్ రెడ్డి,హనుమంతరావు పాత్ర కీలకమని ఆయన అన్నారు.

# అమెరికా సుంకాలు 25% తగ్గొచ్చు

## కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలపై దేశ ప్రధాన ఆర్థికసలహాదారు వి.అనంత నాగేశ్వరన్ మాట్లాడుతూ త్వరలోనే అమెరికా ప్రతీకార సుంకాలను ఉపసంహరించుకనే అవకాశం ఉందని తెలిపారు. అలాగే పరస్పర సుంకాలను కూడా తగ్గించే అవకాశం ఉందని అన్నారు. దీంతో అధిక సుంకాల భారంతో ఇబ్బంది పడుతున్న భారతీయ ఎగుమతిదారులకు ఉపశమనం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కోల్‌కతాలో జరిగిన కార్యక్రమంలో నాగేశ్వర్ మాట్లాడుతూ, ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. గత ఆగస్టులో అమెరికా విధించిన 25శాతం ప్రతీకార సుంకాన్ని నవంబర్ చివరి నాటికి ఉపసంహరించుకోవచ్చు. నవంబర్ 30 తరువాత ప్రతీకార సుంకాలు ఉండవని నేను నమ్ముతున్నా. ఇది ఏదైనా నిర్దిష్ట లేదా స్పష్టమైన ఆధారాల ప్రకారంగా చేసిన ప్రటకటన కాదు. కానీ, ఇటీవల జరిగిన పరిణామాలను చూస్తే, రాబోయే రెండు నెలల్లో ప్రతీకార సుంకాల సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నా. అలాగే పరస్పర సుంకం విషయంలో కూడా సానుకూల పరిణామాలు ఎదురవుతాయని భావిస్తున్నానని అనంత నాగేశ్వర్ తెలిపారు. ప్రస్తుతం 25శాతం పరస్పర సుంకాన్ని 10లేదా 15శాతానికి తగ్గించే అవకాశం ఉందని నాగేశ్వరన్ పేర్కొన్నారు. మొత్తం సుంకాల సమస్య 8 నుంచి 10 వారాల్లో పరిష్కారం అవుతుందని ఆయన అంచనా వేశారు. అయితే, ఇది పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయమేనని, అధికారిక హామీపై ఆధారపడలేదని స్పష్టం చేశారు. ఇటీవల జీఎస్‌టీ విధానంలో తీసుకొచ్చిన మార్పులు దేశంలో వినియోగాన్ని పెంచుతుందని భావిస్తున్నట్లు నాగేశ్వరన్ అన్నారు. దీని ప్రభావం జిడిపి వృద్ధిపై గణనీయంగా ఉంటుందని తెలిపారు. ప్రజలు చేతుల్లో అధిక కొనుగోలు శక్తి ఉన్నప్పుడు, రేట్లు తగ్గుతాయని పేర్కొన్నారు. అది డిమాండ్, ఉత్పత్తి, సామర్థ్యం పెరుగుదలకు దారితీస్తుందని అన్నారు. ఇది ఆదాయ వృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు.

# దేశంలో పథకం ప్రకారం ఓట్ల చోరీ

**- రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల**

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** దేశంలో పథకం ప్రకారం ఓట్ల చోరీ జరిగిందని, దీని వెనుక ప్రధాని మోదీ ఉన్నారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో విమర్శించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)పై సంచలన ఆరోపణలు షర్మిల చేశారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఓట్ల తొలగింపు వ్యవహారంపై ఆధారాలతో మాట్లాడుతుంటే, ప్రధాని మోదీ బండారం బయటపడుతోందని గురువారం ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘం, బీజేపీకి కీలుబొమ్మగా మారిందని షర్మిల ఆరోపించారు. లక్షలాది మంది ఓటు హక్కును కాలరాస్తూ, బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. "ప్రధాని మోదీ కోసం అవసరమైన చోట దొంగ ఓట్లు సృష్టించడం, కాంగ్రెస్‌కు అనుకూలమైన చోట ఓట్లు తొలగించడం ద్వారా ఈసీ తన స్వయంప్రతిపత్తిని కోల్పోయింది" అని ఆమె పేర్కొన్నారు. కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుస్తుందనే ఉద్దేశంతోనే, నకిలీ లాగిన్ల ద్వారా సుమారు 6 వేల ఓట్లను తొలగించారని ఆమె ఆరోపించారు సాఫ్ట్‌వేర్‌ను హైజాక్ చేసి, ఆటోమేటెడ్ ప్రోగ్రామింగ్ ద్వారా ఓట్లను తొలగించడం దేశద్రోహంతో సమానమని షర్మిల అభిప్రాయపడ్డారు. నకిలీ ధృవపత్రాలు, తప్పుడు ఫోన్ నంబర్లతో ఓట్లను అక్రమంగా తొలగించడాన్ని ఉగ్రవాద చర్యగా ఆమె అభివర్ణించారు. రాహుల్ గాంధీ డిమాండ్ చేసిన తొలగించిన ఓటర్ల వివరాలను, వాటికి ఉపయోగించిన ఫోన్ నంబర్లు, ఓటీపీల సమాచారాన్ని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

# మునోత్ ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం

**పరుగులు తీసిన ఆర్‌డిఓ, ఏర్పేడు అధికారులు**



**శ్రీకాళహస్తిరూరల్,సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** ఏర్పేడు మండలంలోని మనోత్ ఇండస్ట్రీస్‌లో గురువారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.50కోట్ల ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. సంఘటన విషయం తెలిసిన వెంటనే తెల్లవారుజామునే శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు ఎంపిడిఓ పరుగులు తీసారు. అయితే అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం వాటిల్లిక పోవటంతో ఊపిరి పీల్చుకున్నారు.ఏర్పేడు మండలంలోని మనోత్ ఇండస్ట్రీస్ లిథియం ఆయాన్ బ్యాటరీలను తయారు చేస్తుంది.ఈ ఫ్యాక్టరీలో 125 మంది కార్మికులు పని చేస్తున్నట్లు సమాచారం. వేకువ జామున ప్రమాదం జరిగినపుడు ఫ్యాక్టరీలో ఎవ్వరూ లేదని ఆర్‌డిఓ భానుప్రకాష్‌రెడ్డి వివరించారు. అయితే సంఘటన విషయం తెలిసిన వెంటనే తిరుపతి,శ్రీకాళహస్తి డివిజన్లలోని 9 ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పటానికి రంగంలో దిగాయి.ఏర్పేడు పోలీసులు పరుగులు తీసారు.మండలంలో జరిగిన సంఘటనలో ఏం జరిగిందో అని ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐ శ్రీకాంత్, ఎంపిడిఓ పంచాయతీ కార్యదర్శులు, వికృతమాల,మర్రిమంద పంచాయతీ అధికారులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజునాయుడు అక్కడకు చేరుకున్నారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు అక్కడే పరిశీలించారు. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీలో కార్మికులు ఎవ్వరూ లేదని తెలిసింది.

# తిరుమల సమాచారం

## మరింత నాణ్యత పాటించండి

**- అన్నప్రసాదాలు రుచిగా ఉండాలి - టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్**



**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతి నిధి:** మరింత నాణ్యతతో అన్నప్రసాదాలు ఉండేలా చూడాలని, రుచికరంగా తయారుచేయాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ అన్నదానం విభాగం అధికారులను ఆదేశించారు. అన్నప్రసాదాలు తయారీలో నాణ్యత పాటించాలని, శుచిగా వుండాలని సూచించారు. గురువారం రాత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటశాల, అక్కడ సిబ్బంది తయారుచేస్తున్న వంటలు, శుభ్రతను గమనించారు. అనంతరం భక్తులు భోజనం చేస్తున్న హాల్‌కెళ్లి భక్తులతో మాట్లాడి అభిప్రాయాలను తీసుకున్నారు . అన్నప్రసాదాల నాణ్యత రుచిపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాల సమయంలో మరింతగా శుచిగా ఉండాలన్నారు.

## తిరుమలలో అలజడులకు వైసిపి కుట్ర



**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** బ్రహ్మోత్సవాల ఆరంభమయ్యే వేళ తిరుమల టార్గెట్‌గా వైసిపి అనవసర రాద్ధాంతం చేస్తుందని టిటిడి బోర్డుసభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి మండిపడ్డారు. శనీశ్వరుడి విగ్రహం వివాదం నేపథ్యంలో అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో భూమనపై కేసు నమోదైందని, అయితే ఆయన విచారణకు గురువారం రావాల్సి ఉండగా 23వతేదీ వస్తానంటూ వెల్లడించడం దేనికి సంకేతమన్నారు. 24వతేదీ బ్రహ్మోత్సవాలు మొదలవుతున్నాయని, ఆరోజు సిఎం చంద్రబాబునాయుడు తిరుమలకు వస్తున్న నేపథ్యంలో అలజడులు జరిగే అవకాశం ఉందని ఆయన ఆరోపించారు. ఇలాంటి వాటిని వైసిపి మానుకోవాలని భానుప్రకాశ్‌రెడ్డి హితవు పలికారు.

# సిఎం చంద్రబాబును అభినందిస్తూ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల



**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** జీఎస్టీ రెండో తరం సంస్కరణలకు మద్దతు తెలిపిన ముఖ్యమంత్రిని అభినందిస్తూ పయ్యావుల ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏపీ అసెంబ్లీ. ఆమో దించింది. జీఎస్టీ సంస్కరణలతో రాష్ట్ర ఆదాయం కొంత మేర తగ్గుతున్నా... మొదటగా వాటిని స్వాగతించి మద్దతు తెలిపినందుకు సీఎం చంద్రబాబుకు ఆర్థిక మంత్రి పయ్యావుల, అభినందనలు తెలిపారు. రాష్ట్రానికి ఆదాయం తగ్గినా, ప్రజలకు లబ్ధి చేకూరుతుందనేది ముఖ్యమంత్రి ఆలోచన అని అన్నారు. రూ. 8 వేల కోట్లు నష్టం వస్తుందని ఆర్థిక శాఖ అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్తే... ప్రజలకు రూ. 8 వేలు కోట్ల లబ్ధి చేకూరుతుంది కదా అని సీఎం అన్నారని తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని, ఆర్థిక సుస్థిరతను దృష్టిలో పెట్టుకుని సంస్కరణలను సీఎం మద్దతు తెలిపారు. జీఎస్టీ సంస్కరణలకు చంద్రబాబు మద్దతు తెలుపుతున్నారని జీఎస్టీ కౌన్సిల్ సమావేశానికి వెళ్లే ముందు మీడియాతో చెప్పి వెళ్లానన్నారు. చంద్రబాబు మద్దతిచ్చారని తెలియగానే... జీఎస్టీ సంస్కరణలపై అందరిలోనూ ఓ పాజిటివ్ ధృక్కోణం ఏర్పడిందన్నారు. అనుభవమున్న నాయకుడైన చంద్రబాబు జీఎస్టీ సంస్కరణలకు మద్దతివ్వడంతో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం మొత్తం పాజిటివ్ మూడ్ లో జరిగింది. ఈ సంస్కరణలు ఆమోదం పొందడానికి రెండు రోజుల పాటు జీఎస్టీ కౌన్సిల్ సమావేశాలు పెట్టినా... ఒక్క రోజులోనే సంస్కరణలకు ఆమోదం లభించిందని వివరించారు.

# జాతీయ స్థాయి బాలల లఘు తెలుగు నాటికల ప్రదర్శన పోటీలు

**- ఆంధ్ర సారస్వత పరిషత్తు**
**- అధ్యక్షుడు డా. గజల్ శ్రీనివాస్**

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆంధ్ర ప్రదేశ్ ,ఠాగూర్ మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో 3 వ ప్రపంచ తెలుగు మహా సభలు 2026 సన్నాహాల్లో భాగంగా 8 నుండి 15 సంవత్సరాల వయసులోపు వున్న వారికి జాతీయ స్థాయి ..బాలల లఘు తెలుగు నాటికల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 5 తేది ఉదయం 9 గంటల కు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన కేంద్రం, గుంటూరులో నిర్వహించనున్నట్లు పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలకు సంచాలకులుగా అభినయ శ్రీనివాస్, మానాపురం సత్య నారాయణ లు వ్యవహరిస్తారని డా. శ్రీనివాస్ తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనేవారు విద్యాలయాల తరఫు నుండి గానీ, సాంస్కృతిక సంస్థల నుండి గాని మీ ఎంట్రీలు పంపవచ్చు. నాటిక నిడివి 15 నిమిషాలు మాత్రమే వుండాలన్నారు.నాటిక స్క్రిప్ట్ ను అక్టోబర్ 15 న కల్లా నెంబరు 83310 20896 వాట్సాప్ కు పీడీఎఫ్ ద్వారా పంపాలి. ఎన్నిక అయిన నాటికల వివరాలను నేరుగా సంస్థలకు తెలియ జేస్తారు.. జాతీయ సమైక్యతకు భంగం వాటిల్లే అంశాలు,సంభాషణలు వుండరాదు. వేదిక, లైటింగ్ , సౌండ్ సిస్టమ్ సదుపాయాలు నాటిక ప్రదర్శనకు అందజేయబడతాయి. ప్రదర్శనకు అర్హత సాధించి ప్రదర్శించిన నాటికకు అభినందన ప్రశంసా పత్రం, పాత్ర ధారులకు అభినందన పతకములు, ప్రశంసా పత్రం అందజేయ బడతాయి. ప్రదర్శన రోజున భోజన , అల్పాహార ఏర్పాట్లు చేయబడతాయి. ప్రథమ బహుమతి : 10,000/ , పతకము, ప్రశంశా పత్రము, జ్ఞాపిక , ద్వితీయ బహుమతి 7500/ రూపాయలు,జ్ఞాపిక , పతకము, ప్రశంశా పత్రము, తృతీయ బహుమతి 5,000/ , పతకము, జ్ఞాపిక, ప్రశంశా పత్రము, మూడు ప్రత్యేక బహుమతులు , అభినందన పత్రాలు అందజేయ బడతాయి. నటులకు వ్యక్తిగత ప్రతిభా బహుమతులు వుంటాయి. విజేతలకు ప్రపంచ తెలుగు మహా సభలలో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుందని ముఖ్య సమన్వయకర్తలు పి.రామచంద్ర రాజు, వి.విద్యాసాగర్ లు తెలిపారు.

# రాహుల్‌దేవ్ సింగ్‌కు గుంతకల్లు రైల్వే ఎస్పీగా అదనపు బాధ్యతలు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 15,ప్రభాతవార్త** ప్రస్తుతం విజయవాడ రైల్వే ఎస్పీగా పనిచేస్తున్న రాహుల్‌దేవ్ సింగ్‌కు గుంతకల్లు రైల్వే ఎస్పీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సంబంధిత ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గుంతకల్లు రైల్వే ఎస్పీగా పనిచేస్తున్న రాహుల్ ను కోనసీమ ఎస్పీగా బదిలీ చేసారు.

# నిందితులపై మా సమాధానాలు పట్టించుకోకుండానే డిఫాల్ట్ బెయిలిచ్చారు : హైకోర్టులో సిఐడి వాదనలు

**మద్యం నిందితుల బెయిలు రద్దుపై విచారణ**

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో నిందితులు ధనుంజయ రెడ్డి(ఏ31), కృష్ణ మోహన్ రెడి (ఏ-32),బాలాజీ గోవిందప్ప(ఏ-33)లకు విజయవాడ ఎసిబి కోర్టు ఈ నెల 6న డిఫాల్ట్ బెయిలిచ్చిందని...అయితే అభియోగపత్రాలపై ఆ కోర్టు లేవనెత్తిన అభ్యంతరాలకు 1వ తేదీనే సమాధానం ఇచ్చామని సిఐడీ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టుకు చెప్పారు. వివరాలన్నీ ఎసిబి కోర్టు ముందు ఉన్నప్పుడు వాటిపై నిర్ణయం తీసుకోకుండా అసంపూర్తి అభియోగపత్రం దాఖలు చేశామనే కారణంతో డిఫాల్ట్ బెయిలివ్వడానికి వీల్లేదన్నారు. చార్జిషీట్ దర్యాప్తు అధికారి అభిప్రాయం మాత్రమేనని,దానిని పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాల్సింది న్యాయాధికారేనని లూథ్రా పేర్కొన్నారు. డిఫాల్ట్ బెయిలిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని హైకోర్టులో సిఐడి పిటీషన్ వేసింది. బుధవారం విచారణలో లూథ్రా వాదనలు వినిపించారు. 'మద్యం కుంభకోణం కేసులో ఈ ఏడాది జులై 19న మొదటి ఛార్జిషీట్,ఆగస్టు 11న మరో ఛార్జిషీట్ వేశాం.అభియోగపత్రాలు దాఖలు చేశాక ఏసిబీ కోర్టు నిందితులకు సీఆర్‌పీసీ సెక్షన్ 309ని అనుసరించి రిమాండ్ పొడిగించాలి. నిందితుల తరపు న్యాయవాదులు చెబుతున్నట్లు సీఆర్‌పీసీ సెక్షన్ 167(2) అనుసరించి రిమాండ్ పొడి గించినట్లు ఏసీబీ కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొనలేదు. పబ్లిక్ సర్వెంట్ అయిన ధనుంజయరెడ్డి విషయంలో కాంపిటెంట్ అథారిటీ నుంచి విచారణకు అనుమతి తీసుకోలే దన్న కారణంతో అభియోగ పత్రం అసంపూర్తిగా ఉందని కోర్టు పేర్కొనడం అభ్యంతరకరం.కేసు పెండింగ్‌లో ఉండగా అనుమతి ఉత్తర్వులను ఎప్పుడైనా కోర్టులో వేయెచ్చు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు సైతం అభియోగపత్రంతో వేసి తీరాలనే నిబంధన ఏమీ లేదు.

అభియోగపత్రాలపై అభ్యంతరాలను లేవనెత్తుతూ ఏసీబీ కోర్టు న్యాయాధికారి మెమోరాండం జారీ చేశారు. ఇలాంటి అంశం చట్టంలో ఎక్కడా లేదు. న్యాయాధికారికి అభియోగపత్రాలపై సందేహాలుంటే దర్యాప్తు అధికారిని పిలిపించి నివృత్తి చేసుకోవాల్సింది. సాంకేతిక అంశాలను కారణంగా చూపుతూ ఏసీబీ కోర్టు డిఫాల్ట్ బెయిలు మంజూరు చేసింది'అని వాదించారు. పూర్తి స్థాయి వాదనలు వినేందుకు విచారణను గురువారానికి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు.

# తల్లితో కలిసి తండ్రిని హత్య చేసిన కుమారుడు

**పామిడి, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** అనంతపురం జిల్లా పామిడి పట్టణంలోని షాధీఖానా వెనుకనున్న బెస్తవీదిలో జన్మనిచ్చిన తల్లి మీనాక్షిని వేధిస్తున్నాడని ఆవేశంతో రగిలిపోయిన కుమారుడు ప్రకాష్ తన పుట్టుకకు కారణమైన తండ్రి బెస్త సుధాకర్(45)ను హత్య చేయటం బుధవారం అర్ధరాత్రి కలకలం రేపింది. సంఘటనకు సంబంధించి పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన హతుడు బెస్త సుధాకర్ బార్య మీనాక్షి కుమారుడు ప్రకాష్ అందించిన సమాచారం మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలావున్నాయి.. బెస్త సుధాకర్ ఐచర్ డ్రైవర్ కావటంతో మద్యానికి బానిసై తరుచూ మద్యం సేవించి బార్య మీనాక్షిని కొడుతుండటంతో కుమారుడు ప్రకాష్ తండ్రితో గొడవ పడుతుండేవాడన్నారు. దీంతో బెస్త సుధాకర్ అర్ధరాత్రి మద్యం మత్తులో బార్య మీనాక్షితో గొడవపడగా తట్టుకోలేని కుమారుడు ప్రకాష్ ఆవేశంతో రగిలిపోయి అక్కడే ఉన్నటువంటి రోకలికర్రతో తలపై బలంగా బాదటం కారణంగా తీవ్ర రక్తగాయమై ఆయన అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. తన తండ్రి బెస్త సుధాకర్‌ను తామే హతమార్చామని తల్లి కుమారుడు పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన సిఐ యుగంధర్ బెస్త సుధాకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించి.

**Ref.B1/86/2025, dt. 18-09-2025**

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, రాజమహేంద్రవరం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
ఫారమ్ నెం.VI (ఎ)

(2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

ప్రాథమిక ప్రకటన

ఈ దిగువ షెడ్యూల్ లో చూపబడిన అల్లూరి ఏలూరు, బుట్టాయి గూడెం గంగవరం మండలం, బుట్టాయి గూడెం గ్రామముల నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద వి.ఆర్.పురం మండలం, సోములగూడెం గ్రామం లోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము భూమి అవసరమైనట్లు ప్రాజెక్ట్ ఆఫీసర్, ఐ.టి.డి.ఎ, చింతూరు, ఆర్ & ఆర్ అధికారి చింతూరు యూనిట్, చింతూరు, అల్లూరి సీతారామరాజు జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు పారదర్శకత చట్టం నందలి 11వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10.05.2020వ తేదీన జారీ చేసిన జి.ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వరరామచంద్రపురం యూనిట్-2, చింతూరు వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, వరరామచంద్రపురం యూనిట్-2, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ -15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు /ఆక్షేపణలు ఉన్నయెడల సంబంధించిన వ్యక్తి-వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేదీ నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

షెడ్యూల్

జిల్లా : ఏలూరు మండలం : బుట్టాయి గూడేం గ్రామం : బుట్టాయి గూడేం

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | భూసేకరణ క్రింద విస్తీర్ణం(య. సెంట్లు) | భూమి తరగతి | సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా | సరిహద్దులు | | | | చెట్లు కట్టడములు ఇతరముల వివరములు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | తూర్పు | పడమర | ఉత్తరము | దక్షిణం | |
| 1 | 685/1A | 2.00 | మెరక | దండాబత్తుల బసవయ్య | 686/1 | 237 | 665/2 | 684 | తాడిచెట్లు-3, రావి చెట్టు-1, బోరు-1 |
| 2 | 171 | 7.00 | మెరక | తురసం టేబిరాణి | 178 | 168 | 146 | 170 | తాడిచెట్లు-5, టేకు చెట్లు-2 ,వేప చెట్టు-1 |
| 3 | 179/2 | 2.32 | మెరక | తురసం టేబిరాణి | 179/1 | 145 | 144 | 178 | బోర్లు-2 , |
| 4 | 1482/1 | 2.59 | మెరక | కోసూరి దశరదరామయ్య | 1481 | లక్ష్ముడు గూడెం గ్రామం | 1483 | 1481 | వేప చెట్లు-5,టేకు చెట్లు-60, మామిడి చెట్లు-25, జీడిమామిడి-34,తాడిచెట్లు -60, కుంకుడు చెట్లు-10 |
| 5 | 1455 | 5.00 | మెరక | కోసూరి దశరదరామయ్య | 1454 | 1456 | 1492 | 1447 | బోర్లు-2,బావి-1 , తాడి చెట్లు-200, జీడిమామిడి-14 , వేప చెట్లు-5 |
| 6 | 1455 | 4.89 | మెరక | కోసూరి బాలత్రిపురసుందరి | 1454 | 1456 | 1492 | 1447 | - |
| 7 | 686-1 | 0.89 | పల్లం | కరాటం లక్ష్మి | 685 | 686/2 | 88/2 | 684 | - |
| 8 | 718 | 1.65 | మెరక | కరాటం లక్ష్మి | 719 | 717, 716 | 721 | 154 | - |
| 9 | 718-1 | 2.00 | మెరక | సిద్దిన లావణ్య | 719 | 717, 716 | 721 | 154 | - |
| 10 | 718-2 | 2.00 | మెరక | కరాటం సతీష్ కుమార్ | 719 | 717, 716 | 721 | 154 | - |
| 11 | 718 | 5.00 | మెరక | కరాటం సత్యవతి | 719 | 717, 716 | 721 | 154 | - |
| 12 | 718 | 1.66 | మెరక | కరాటం సర్వారాయుడు | 719 | 717, 716 | 721 | 154 | - |
| 13 | 165 | 7.34 | మెరక | కోర్స ముత్యాలమ్మ | 166 | 418 419 | 164 | 250 | ఆయిల్ పామ్ య.1.00 సెంట్లు, టేకు-2 |
| 14 | 166 | 2.27 | మెరక | కోర్స ముత్యాలమ్మ | 167 | 165 | 162 | 250 | - |
| 15 | 266-3C | 3.22 | మెరక | మామిళ్ళపల్లి వెంకట శివ రామరావు | 266/2 | 266/4 | 273 | 266/1 | బోరు-1 |
| 16 | 626-2 | 2.62 | మెరక | కరాటం సత్యవతి | 220 | 234 | 236 | 225 | బోరు-1 |
| 17 | 626-3 | 1.38 | మెరక | కరాటం సత్యవతి | 220 | 234 | 236 | 225 | - |
| 18 | 626-4 | 0.44 | రక | కరాటం సత్యవతి | 220 | 234 | 236 | 225 | - |
| 19 | 686-1A | 1.89 | పల్లం | కరాటం పాపారాణి | 686/2 | 685 | 686/2 | 684 | తాడి చెట్లు-3 |
| 20 | 686-1 | 1.00 | పల్లం | కరాటం శివాజీ | 686/2 | 685 | 686/2 | 684 | - |
| 21 | 686-1B | 1.00 | పల్లం | కోన సునీత | 686/2 | 685 | 86/2 | 684 | తాడి చెట్లు-3 |
| 22 | 627 | 6.06 | పల్లం | గొడ్డుముక్కల వెంకటరామరాజు | 631 | 666 | 626 | 628 | బోరు-1 |
| 23 | 192/1 | 2.00 | మెరక | పిండ్రా బాల వెంకట మహాలక్ష్మి | 185 | 192/2 | 193 | 186 | బోరు-1 , కొబ్బరి చెట్లు-3 |
| 24 | 177 | 7.25 | మెరక | పిండ్రా బాల వెంకట మహాలక్ష్మి | 196 | 172 | 178 | 176 | తాడిచెట్లు -30, కొబ్బరి చెట్లు-15, వెదురు పొదళ్ళు-30, |
| 25 | 1176-2 | 4.46 | మెరక | అయినం వెంకన్న | 1177 | 1211 | 1185 | 1176/1 | - |
| 26 | 1185-2 | 7.44 | మెరక | అయినం వెంకన్న | 1183 | 1209 | 1186 | 1185/1 | - |
| 27 | 1187-2 | 3.98 | మెరక | అయినం వెంకన్న | 1150 | 1188 | 1150 | 1186 | - |
| 28 | 266-3A | 1.62 | మెరక | మామిళ్ళపల్లి స్వాతి | 66/2 | 266/4 | 273 | 266/1 | - |
| 29 | 418/1 | 4.00 | మెరక | మేకల స్పందన | 165 | 414 | 419 | 417/2B | - |
| 30 | 417/2B | 2.00 | మెరక | కరాటం కాంతిరావు | 417/2A | 415 | 418 | 417/1 | - |
| 31 | 418/2 | 1.86 | మెరక | కరాటం సోంబాబు | 165 | 414 | 419 | 417/2B | పామాయిలు తోట |
| 32 | 418/3 | 2.00 | మెరక | కరాటం శ్రీనివాస్ | 165 | 414 | 419 | 417/2B | పామాయిలు తోట |
| 33 | 420 | 9.41 | మెరక | కరాటం నారాయణరావు | 421 | 419 | 422 | 413/1 | - |
| 34 | 419 | 7.31 | మెరక | కరాటం నారాయణరావు | 165 | 414 | 420 | 418 | బోరు |
| మొత్తం: | | 117.55 | | | | | | | |

సం/- కె. ఆంజనేయులు
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూసేకరణాధికారి)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, వి.ఆర్.పురం యూనిట్-II, చింతూరు

సం/- యస్.సరళా వందనం
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, రాజమహేంద్రవరం

# స్వచ్ఛఉత్సవ్ - షెడ్యూల్‌ఖరారు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 18,ప్రభాతవార్త** కేంద్రప్రభుత్వం గత పదకొండేళ్లుగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛభారత్-స్వచ్ఛ రైలు కార్యక్రమంలో భాగంగా దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో ఈ ఏడాది నిర్వహిస్తున్న స్వచ్ఛ ఉత్సవ్ కార్యక్రమ వివరాలను సంబంధిత ఉన్నతాధికారులు వెల్లడించారు. స్వచ్ఛతాహీ సేవ-25 షెడ్యూల్ : స్వచ్ఛతాహీసేవ-25 కార్యక్రమం 11వ వార్షికోత్సవం సందర్భంగా బుదవారం నుంచి గాంధీ జయంతి వరకు ప్రతిరోజు చేపట్టే కార్యక్రమ వివరాలు ఇలా వున్నాయి. 19న శుక్రవారం స్వచ్ఛమైన రైల్వే స్టేషన్లు, 20,21వ తేదీల్లో శనివారం ఆదివారాల్లో స్వచ్ఛమైన రైలు బండి, 22న సోమవారం స్వచ్ఛమైన రైలు మార్గం, 23న మంగళవారం స్వచ్ఛమైన రైల్వే పరిసరాలు, 24,25న బుధ,గురువారాల్లో స్వచ్ఛమైన ఆహారం, 26న శుక్రవారం స్వచ్ఛమైన తాగునీరు, 27న శనివారం స్వచ్ఛమైన జలాశయాలు, పార్కులు, 28న ఆదివారం స్వచ్ఛమైన శౌచాలయాలు, పర్యావరణం, 29న సోమవారం స్వేచ్ఛా అంశంపై వ్యాసరచన పోటీలు, 30న మంగళవారం ప్లాస్టిక్ వినియోగం, నిషేధం, అక్టోబరు 1న బుధవారం స్వచ్ఛ రైలు నిర్వహణపై సమీక్ష, సంవివరణ,స్వచ్ఛ అవగాహన ర్యాలీ, 2న గురువారం స్వచ్ఛ ఉత్సవ్ దినోత్సవం ముగింపు.

# ప్రతి భక్తుడు సురక్షితంగా, సౌకర్యంగా దర్శనం చేసుకోవాలి

**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలకొండపై తొమ్మిదిరోజులుపాటుజరిగే శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామని, పోలీసుశాఖ తరపున సాంకేతికతతో భక్తుల భద్రత పర్యవేక్షణ ఉంటుందని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. తిరుమలకు వచ్చిన ప్రతి భక్తుడు సురక్షితంగా, సౌకర్యవంతంగా మూలవిరాట్టుతోబాటు వాహనసేవల దర్శనం చేసుకునే విధంగా చూస్తామని తెలిపారు. 4వేల సిసికెమెరాలు, 6వేలమంది పోలీసులు, విజిలెన్స్ సిబ్బందితో విశాలమైన భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. బ్రహ్మోత్సవాల భద్రత, పోలీసుశాఖ పరంగా తీసుకున్న చర్యలు గురించి గురువారం మధ్యాహ్నం తిరుమలలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఒ కెవి మురళీకృష్ణతో కలసి మీడియాతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాలకు మొత్తం 5,691మంది పోలీసు అధికారులు, సిబ్బందిని నియమిస్తున్నామని, ఇందులో తిరుమలలోనే 4,223మంది పోలీసులు, తిరుపతిలో 1,468మంది బందోబస్తు విధుల్లో ఉంటారన్నారు. సివిల్‌పోలీస్, ఏపిఎస్‌పి,ఎఆర్, ఎస్‌బి స్పాటర్స్, ఆక్టోపస్, విజిలెన్స్ సిబ్బంది ప్రత్యేక బృందాలు నాలుగుమాఢవీధుల్లో ,క్యూకాంప్లెక్స్‌లు, ఘాట్‌రోడ్డు,పార్కింగ్ ప్రాంతాల వంటి కీలక ప్రాంతాల్లో విస్తృతంగా నియమించడం జరుగుతుందన్నారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు బారికేడ్ల ఏర్పాటు, డ్రోన్‌తో పర్యవేక్షణ, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీనియర్ పోలీస్ అధికారులతో పర్యవేక్షణ ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పోలీసు సిబ్బందికి ఒంటిపై ధరించే కెమెరాలు, ఆధునిక సమాచార వ్యవస్థ, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం ,భక్తులకు కేటాయించిన పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలనే నిలుపుదలచేయడం వంటివి పోలీసులు చేపడతారన్నారు. బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులు పూర్తిగా గ్యాలరీల్లోకి ప్రవేశ నిష్క్రమణ మార్గాలను వినియోగించాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు. బ్రహ్మోత్సవాల్లో 24వతేదీ సిఎం చంద్రబాబునాయుడు విచ్చేస్తుండటంతో భద్రత మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. గరుడసేవరోజు తిరుమల ఘాట్‌లో ద్విచక్రవాహనాలను నిషేధం ఉంటుందన్నారు.

# రైతు సమస్యలపై చర్చించాలని శాసనమండలిలో వైఎస్సార్సీ సభ్యుల డిమాండ్

**సచివాలయం,సెప్టెంబర్ 18,ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 48వ శాసనమండలి సమావేశం మొదటి రోజు గురువారం రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు అధ్యక్షత ప్రారంభమైంది.ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో భాగంగా వైకాపా సభ్యులు తోట త్రిమూర్తులు, యల్లారెడ్డిగారి శివరామిరెడ్డి,పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, రైతుల సమస్యలు,యూరియా కొరతపై ఇచ్చిన వాయిదా తీర్మానం తిరస్కరించబడిందని మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తెలిపారు.రైతు సమస్యలపై మాట్లాడడానికి తాము ఎల్లప్పుడు సిద్దంగానే ఉన్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సభాముఖంగా తెలిపారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నల్లో గ్రామీణాభివృద్ధికి సంబంధించి గ్రామాలకు అనుసంధాన రోడ్లు,వాటిని అభివృద్ధి చేసే క్రమంలో రైతుల వాటాదారులుగా చేర్చే అంశం మరియు మరొక్క ప్రశ్న పంచాయితీరాజ్ కు సంబంధించి 2019-24మధ్య కాలంలో పారిశుధ్య వ్యవస్థ నిర్వహణ లోపాలు,ప్రస్తుత ప్రభుత్వం లో తీసుకొచ్చిన మార్పులకు సంబంధించిన ప్రశ్నలను వాయిదా వేయడం జరిగింది. బీద రవీంద్ర,కావలి గ్రీష్మ ప్రసాద్,పేరాబత్తుల రాజశేఖరంలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాల గురించి పూర్తి వివరాలు కోరగా,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సమాధానమిస్తూ రాష్ట్రంలో 1143పిహెచ్‌సిలు ఉన్నాయని మరియు అదనంగా 88నూతన పిహెచ్‌సిలను మంజూరు చేశామని నిర్మాణ దశలో ఏ ఒక్క భవనం ఆగిపోలేదని వివరించారు.

# బాలాజీ ఆరోగ్యవరప్రసాదినికి రూ.10లక్షలు విరాళం

**తిరుమల,సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ట్రస్ట్‌లు, పథకాల్లో బాలాజీ ఆరోగ్యవరప్రసాదిని ట్రస్ట్‌కు ఓ దాత తనవంతు విరాళమందించారు. విజయనగరంకు చెందిన కృష్ణహరీశ్ ఈశ్వర్ భక్తుడు గురువారం ఉదయం 10లక్షలు రూపాయలు డిడిని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డుసభ్యుడు భాను ప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

వార్త

ఈ భూమ్మీద మనిషంత గొప్పవాడు ఎవడూ లేడు. మనిషిలో మెదడంత గొప్ప అవయవం మరొకటి లేదు.

-విలియం హామిల్టన్

# ప్రభుత్వ విద్యకు తగ్గుతున్న ఆదరణ

ఒకనాడు ఎంతో పవిత్రంగా భావించి ఆరాధించి పూజించిన విద్య రానురాను అంగడి సరుకుగా మారిపోతున్నది. ప్రస్తుతం విద్య ఒక వ్యాపార రూపం దాల్చింది. విద్యనే కాదు విద్యార్థులతోసహా ఏకంగా విద్యాసంస్థలను అమ్ముకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. తాజాగా విస్తుపోయే విధంగా హైదరాబాద్ నగరంలో నడిబొడ్డున ఒక విద్యాసంస్థ ముసుగులో నడుస్తున్న డ్రగ్స్ తయారీ కేంద్రాన్ని అధికారులు కనుగొన్నారు. పగలు విద్యాబోధన చేస్తూ అదే పాఠశాలలో రాత్రివేళలో భారీ ఎత్తున మత్తుమందు తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్‌తోసహా మరికొందరిని ఈగల్‌టీమ్ సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. అందుకు సంబంధించిన లక్షలాది రూపాయలు విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు అక్కడికి చేరుకొని పాఠశాలను సీజ్ చేసి అక్కడ చదువుతున్న విద్యార్థులను ఇతర పాఠశాలల్లో చేర్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దేశంలోని ఎన్నో ప్రాంతాలకు సరఫరా చేసినట్లు సమాచారం. విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనంగా విద్యావ్యాపారం వింతపోకడలు తొక్కుతున్నది. బహుశా దేశంలోని పాఠశాల తరగతి గదుల పక్కనే ఏకంగా డ్రగ్స్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పడం పోలీసు వర్గాలే విస్తుపోతున్నాయి. ప్రైవేట్‌రంగంలో విద్యావ్యాపారం వెర్రితలలు వేస్తుందనేందుకు ఇది పరాకాష్ఠగా చెప్పొచ్చు. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలున్నా, అమలు చేయగలిగే సామర్థ్యం ఉన్న పరిస్థితి రానురాను అగమ్యగోచరంగా మారుతున్నది. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్పప్రైవేట్ బడులు లేవు. ఎక్కడో పట్టణాలు, నగరాల్లో నడిచేవి. వాటిల్లో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవికావు. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం సేవాదృక్పథంతో విద్యాసంస్థలు సేవలు అందించేవి. నిర్వహకులు సామాజిక బాధ్యతగా భావించి ఆ పాఠశాలలను నడిపేవారు. ఇక ప్రభుత్వరంగంలో కూడా ఆనాడో పాఠశాలలు అంతో ఇంతో పటిష్టంగా నడిచేవి. కానీ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు, అవినీతి, వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. రాబోయే రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బీదాబిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లోనే దొరుకుతుందనే నమ్మకంతో ఆవైపే అడుగులు వేస్తున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతి లేనివారు, మరో దారిలేనివారు, విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వపాఠశాలల బాటపడుతున్నారు. గ్రామాల్లో కూడా ఈ ప్రైవేట్ విద్యావ్యాపారం విస్తరిస్తున్నది. అధికారుల రికార్డుల ప్రకారమే అంకెలు చూసినా ఆశ్చర్యం గొలిపే విషయాలు వెలుగు చూస్తున్నాయి. 2021-2022 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు ముప్పైలక్షల డెబ్బైఎనిమిదివేల నూటఎనభై తొమ్మిది మంది ఉండగా ప్రైవేట్ బడుల్లో ఇరవైఎనిమిది లక్షల అరవైఏడువేల ఐదువందల తొంభైఏడు మందిఉన్నారు. అయితే 2022-23 విద్యాసంవత్సరం నాటికి ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులసంఖ్య తగ్గి ప్రైవేట్ స్కూళ్లలో పెరిగిపోయింది. సర్కారు బడుల కంటే ప్రైవేట్ స్కూళ్లల్లో దాదాపు రెండులక్షల మందికి పైగా విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వస్కూళ్లలో చేరేవారి సంఖ్య మరింతగా తగ్గిపోయింది. సర్కారు బడుల్లో ఇరవైఆరు లక్షల ముప్పైఆరువేల ఆరువందల ముప్పైకి పరిమితం కాగా ప్రైవేట్ బడుల్లో ముప్పైనాలుగు లక్షలకుపైగా పెరిగిపోయింది. అంటే దాదాపు ప్రభుత్వ స్కూళ్ల కంటే ప్రైవేట్ స్కూళ్లలో ఏడు లక్షలకుపైగా ఎక్కువ మంది చేరారు. గత పదేళ్ల నుంచి పరిశీలించినా క్రమేపీ ప్రభుత్వ స్కూళ్లలో సంఖ్య తగ్గుతుంటే ప్రైవేట్ స్కూళ్లలో పెరిగిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎటువైపు దారిస్తుందో. ఎందుకు ఈ పరిస్థితి దాపురిస్తుందో? కారకులు ఎవరు? కారణాలు ఏమిటి? అనేది అటు అధికార వర్గాలకు కానీ, ఇటు పాలకులకు గాని తెలియంది కాదు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు కాగితాల వరకు బాగానే ఉంటున్నాయి. ఆచరణకు వచ్చేసరికి అసలు సమస్యలే కారణాలవుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో యేటా వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు. ప్రభుత్వాలు బడిబాటంటూ పాఠశాలల్లో చేర్పించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన మేరకు ఫలితాలు కన్పించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా పాఠశాలల్లో కనీస వసతుల కొరత తీవ్రంగా కన్పిస్తున్నది. వేలాది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉంటున్నట్లు సమాచారం. ప్రభుత్వ పాఠశాలల్లో మంచినీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేకపోవడంతో ప్రధానంగా బాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా అందరికి విద్య అందించాలనే లక్ష్యం కను చూపు మేరలో కన్పించడంలేదు. దేశాభివృద్ధికే కాదు మానవ జాతి అభ్యున్నతికి విద్య పునాది అనేది నిర్వివాదాంశం. ఆరేళ్ల నుంచి పద్నాలుగేళ్ల బాలబాలలందరికీ ఉచిత విద్య అందించాలనే కార్యక్రమం పదేళ్లలో పూర్తి చేయాలని స్వాతంత్ర్యం రాగానే పెద్దలు నిర్ణయించిన సంకల్పం కాగి తాల్లోనే కన్నుమూసింది. ఇక డిపెప్, ఎపెప్, సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్ష లాది కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తూనే ఉన్నారు. కానీ లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా పాల కులు కళ్లు తెరవాలి. బాలబాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వరంగంలోని విద్యావ్యవస్థను ఇంతటి దారుణ పరిస్థితుల్లోకి నెట్టడం సమంజసం కాదు.

బుద్ధిహీనులూ, మృతులూ మాత్రమే తమ అభిప్రాయాలను మార్చుకోకుండా ఉంటారు.



లోవెల్

మహామేధస్సులో అనేదేదీ లేదు. మహామేధస్సు అంటేశ్రమ, నైపుణ్యంల సమాహారమే.



లియో టాల్‌స్టాయ్

# భారత్ వ్యూహంతో ట్రంప్ దారికొచ్చేనా?

**చైనాతో స్నేహం భారత్‌కి ముఖ్యం. చైనాకు భారత్ స్నేహ హస్తం అందిస్తుంది. ఇక రష్యాతో ఇప్పటికే ఉన్న బంధాన్ని మరింతగా పెంచుకొని ఇరుదేశాల వాణిజ్యాన్ని మరింతగా విస్తరించాలని భావిస్తుంది. భారత్ మెతక దేశం సుంకాల పెంపుద్వారా భారత్‌ను దారికి తెచుకోవచ్చు అని భావించిన ట్రంప్‌కు షాంగై సదస్సు ద్వారా భారత్ అంటే ఏమిటో తెలిసివచ్చింది. ఇక ఏళ్ల తరబడి చైనా అండతో భారత్ పైకి ఉగ్రవాదని ప్రోత్సహిస్తున పాకిస్థాన్‌ను చైనాతో స్నేహ సం బంధాలు పెంచుకోవడం ద్వారా ఆదేశాన్ని ఒంటరి చేయడం అనేది మరొకవ్యూహం. చైనా, భారత్ ప్రపంచంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశాలు. రెండు దేశాల మార్కెట్ పరిధి ప్రపంచ మార్కెట్‌లో సుమారు 50 శాతం. అనూహ్యంగా భారత్ మరియు చైనా దేశాలమధ్య స్నేహం చిగురించింది. ఇప్పుడు చైనా అమెరికాను అడ్డుకట్టవేయాలంటే తప్పకుండా భారత్ సహకారం అవసరం. ఇటు భారత్‌కు కూడా చైనాతో స్నేహం తప్పనిసరి. కానీ చైనా గతఅనుభవాలను దృష్టిలో ఉంచుకొని భారత్ మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి.**



డాక్టర్ రామకృష్ణ బండారు

ఎన్నో సంవత్సరాల నుండి భారత్‌కు మిత్రదేశంగా వ్యవహరిస్తున్న అమెరికా, డోనాల్డ్ ట్రంప్ రెండవ సారి అధ్యక్ష బాధ్యతలు చెప్పటినప్పటి నుండి భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరిస్తోంది. గత ఆరు నెలలుగా అమెరికా అధ్యక్షుడుడోనాల్డ్ ట్రంప్ భారత్‌పై వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ భారత్‌ను ఇరుకున పెట్టె ప్రయత్నం చేస్తున్నాడు. గతంలో, తమ మధ్య వాణిజ్యాన్ని2030 నాటికల్లా 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని భావించిన ఇరు దేశాలు ట్రంప్ తీరుతో ఆ లక్ష్యాలను పక్కన పెట్టాయి. చైనా, రష్యా, దక్షిణాఫ్రికా వ్యవస్థాపక సభ్యులుగా ఉన్న బ్రిక్స్‌కూటమిలో భారత్ సభ్యత్వం కలిగినందుకు పదిశాతం సుంకాలు, రష్యానుంచి భారత్ చమురు కొనుగోలు చేయడానికి జరిమానాగా మరో 25 శాతం సుంకాలు, ఇలా భారత్ ఎగుమతులపై సుంకాలను మొత్తంగా 50శాతానికి పెంచి భారత్ ఆర్థిక వ్యవస్థను బలహీనపరచడంతో పాటు ఇరు దేశాల మధ్య ఉన్న దౌత్య సంబంధాలకు ఆటంకం కలిగేలా ట్రంప్ వ్యవహరిస్తున్నాడు. భారత్ ఫార్మా, సాఫ్ట్‌వేర్ రంగాల ఎగుమతులపై కూడా 200 శాతం సుంకాలు విధించాలని భావిస్తున్నాడు. భారత్ చైనాతో చీకటి ఒప్పందం చేసుకున్నట్లుగా, భారత్‌ను తాము విడిచిపెట్టినట్లుగా ప్రకటించాడు. ఇలా భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడుతూ, పాకిస్థాన్‌కు దగ్గరవుతున్న డోనాల్డ్ ట్రంప్ భారత్‌ను వత్తిడికి గురిచేసి తన ఆధీనంలోకి తెచ్చుకోవాలని చూస్తున్నాడు. ఎప్పుడూ శాంతి, సహనం కోరుకొనే భారత్ మాత్రం ఈసారి దెబ్బకు దెబ్బ అన్నట్లుగా వ్యవహరిస్తోంది. ట్రంప్ సుంకాల పెంపు బెదిరింపులకు ఏ మాత్రం భయపడక, చలించక తన వ్యూహాత్మక ఎత్తుగడలతో భారత్ ట్రంప్‌కు చెక్ పెట్టేందుకు సిద్ధం అయింది. అందులో భాగంగానే 50 శాతం సుంకాల పెంపు ప్రకటన తరువాత భారత్ ప్రధాని యు.కెలో పర్యటించి భారత్ యూ.కే మధ్య స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నాడు. తాజాగా ఎస్.సి.ఓ సదస్సు కోసం చైనాలో పర్యటించి చైనాకు దగ్గరయేందుకు పావులు కదుపుతుంది. కేవలం చైనాతోనే కాకుండా అటు రష్యా, జపాన్ దేశాలతోనూ బంధాన్ని బలపర్చుకునే విధంగా ప్రయత్నాలు చేస్తుంది. ఇన్నాళ్లు భారత్ శాంతి సహనాలను చుసిన అగ్రరాజ్యం ఇప్పుడు భారత్ వ్యూహాత్మక 'దౌత్య తంత్రాని' చూసి తట్టుకోలేకపోతుంది. అందుకే, భారత్ తమకు మిత్ర దేశం, భారత్‌తో వాణిజ్య చర్చలకు మేము సిద్ధం అని ఇటీవల ట్రంప్ ప్రకటించాడు. ఇటు పాకిస్థాన్ కూడా భారత్ చైనా రష్యా దేశాధినేతల కలయికను చూసి తట్టుకోలేక పోయింది. చైనాతో స్నేహం, రష్యాతో బంధం బలోపేతంతో ట్రంప్‌ను ఏకాకిని చేసి పాకిస్థాన్‌ను కూడా ఇరుకునపెట్టే 'వ్యూహం'తో భారత్ ముందుకు పోతుంది. అసలు ట్రంప్ భారత్ పై ఎందుకు కక్ష కట్టాడు? ఒక వైపు భారత్‌తో వాణిజ్య చర్చలుంటాయి అంటూనే మరోవైపు జి 7 కూటమిపై కూడా భారత్ పై సుంకాలు పెంచేలా ఒత్తిడి ఎందుకు తెస్తున్నాడు? భారత్ వ్యూహంతో ట్రంప్ దిగి వస్తాడా? చైనాతో స్నేహబంధం మంచిదేనా? భారత్ సహాయసహకారాలు లేకుండా పెద్దన్న పాత్రపోషించగలడా? అనేవి ఇప్పుడు ఆసక్తి కలిగిన అంశాలు. భారత్‌తో అమెరికాకు భారీ వాణిజ్య లోటు ఉన్నదని, ఫలితంగా అమెరికా నష్టాలను చవిచూస్తున్నది అనేది ట్రంప్ ముఖ్య వాదన. కానీ వాస్తవాలను పరిశీలిస్తే ట్రంప్ నిజస్వరూపం తెలుస్తుంది. అమెరికాకు చైనాతో 295.4 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉన్నది. యూరోపియన్ యూనియన్‌తో 235. 6 బిలియన్ డాలర్లు, మెక్సికోతో 157.2 బిలియన్ డాలర్లు, వియాత్నంతో 113.1 బిలియన్ డాలర్లు, కెనడాతో 54.8 బిలియన్ డాలర్ల వాణిజ్యలోటు ఉన్నది. ఇక భారత్ విషయానికి వస్తే



కేవలం 45.8 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటు ఉన్నది. వాణిజ్యలోటు ఎక్కువగా ఉన్న చైనాపై మొదట 50 శాతం సుంకాలను విధించాడు. చైనా ప్రతీకార సుంకాలకు దిగడంతో 50శాతం నుండి 30శాతానికి తగ్గించాడు. ఇక ఈ యూపై 15శాతం, ఇలా వాణిజ్య లోటు ఎక్కువగా ఉన్న ఇతర దేశాలపై తక్కువ శాతం పన్నులు విధించి భారత్‌పైమాత్రం 50 శాతం విధిస్తున్నాడు. వస్తువుల వాణిజ్యంలో అమెరికాకు లోటు ఉన్నప్పటికీ, సేవల వాణిజ్యంలో అమెరికాకు లాభం ఉన్నది. ఐటి. సాఫ్ట్‌వేర్, బి పి ఓ సేవలు భారత్ అమెరికాకు చేస్తుంది. ఒక సాఫ్ట్‌వేర్ తయారు చేయడానికి అమెరికాలో అయ్యే ఖర్చుతో పోలిస్తే, భారత్‌లో కేవలం 50 శాతం తక్కువ ధరకు తయారు చేసి అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. ఫలితంగా అక్కడి కంపెనీలకు బిలియన్ డాలర్ల మేర లాభాలు వస్తున్నాయి. టిసిఎస్ ఇన్ఫోసిస్, విప్రో వంటి భారత్ కంపెనీలు సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్, క్లౌడ్ సర్వీసెస్, డేటా అనలిటిక్స్ వంటి సేవలను అతి తక్కువ ఖర్చుతో అమెరికా కంపెనీలకు ఎగుమతి చేస్తున్నాయి. భారత్ ఐటి సపోర్ట్‌తోనే అక్కడి బ్యాంకింగ్, డిజిటల్ మార్కెటింగ్ ఇతర రంగాలలో సేవలు అందించగలుగుతున్నాయి. కానీ ట్రంప్ ఒక్క ఉత్పతుల లోటును మాత్రమే పదేపదే చెప్తున్నాడు. ట్రంప్‌కు ఇవన్నీ తెలియనివి కావు. కానీ ట్రంప్ వ్యక్తిగత విషయాలలో భారత్ సపోర్ట్ చేయడం లేదనే కారణంతో ఇదంతా చేస్తున్నాడు. నిన్నటివరకు భారత్‌కు మిత్ర దేశంగా ఉన్న అమెరికా, ట్రంప్ అనూహ్య నిర్ణయాలతో ఒక్కసారిగా భారత్‌కు శత్రు దేశంగా మారిపోయింది. అయితే భారత్ తన సిద్ధాంతాలైన శాంతి, సహనాన్ని పాటిస్తూనే, అమెరికాకు చెక్‌పెట్టేందుకు అడుగులు వేస్తుంది. అమెరికా సుంకాల పెంపుతో వాటిల్లే నష్టాలను పూడ్చడంకోసం ఇతర దేశాలలో మార్కెట్ పెంచుకునేలా స్వేచ్ఛవాణిజ్య ఒప్పందాలను చేసుకుంటుంది. దానిలో భాగంగానే ఇటీవల యూకేతో వాణిజ్య ఒప్పందాలు చేసుకుంటుంది. అలాగే యూరోపిన్ దేశాలలో సైతం మార్కెట్‌ను పెంచుకునేలా దౌత్యసంబంధాలు నడుపుతుంది. ముఖ్యంగా అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసేందుకు త్రిశూల వ్యూహం అమలు చేస్తున్నది. అందులో భాగంగా, మొదటిది చైనాకు దగ్గరవడం, రష్యాతో బంధాన్ని బలోపేతం చేయడం ద్వారా ఇరు దేశాలతో దౌత్య, వాణిజ్య సంబంధాలు పెంచుకోవడం. రెండవది చైనా రష్యాలతో భారత్ చేతులు కలపడం ద్వారా భారత్‌పై ట్రంప్ ఆధిపత్యానికి అడ్డుకట్ట వేయడం. ఇక మూడవది చైనా అండతో భారత్ పై కాలు దువ్వుతున్న పాకిస్థాన్‌ను చైనా నుండి దూరం చేయడం. ఇలా ట్రంప్ సుంకాల దెబ్బదుకు భరత్ దీటుగా, వ్యూహాత్మకంగా అడుగులు వేస్తుంది. ముందుగా, శత్రువుకి శత్రువు మనకి మిత్రుడు అన్నట్లుగా అమెరికాకు ఎప్పటి నుండో కొరకరాని కొయ్యగా ఉన్న చైనాతో దౌత్య వాణిజ్య సంబంధాలు పెంచుకునేలా అడుగులు వేస్తుంది. ప్రస్తుత పరిస్థితులలో భారత్‌తో చేయి కలపడం చైనాకు సైతం అత్యవసరం. చైనాతో ఇప్పటికే భారత్‌కు భారీవాణిజ్య లోటు ఉన్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 14.25 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను చైనాకు భారత్ ఎగుమతి చేయగా, 113.5 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను చైనా నుండి దిగుమతి చేసుకుంది. 2003-04 చైనాతో భారత్‌కు వాణిజ్య లోటు1.1బిలియన్ డాలర్లుగాఉండగా ప్రతుతం 99.2బిలియన్ డాలర్లకు చేరుకుంది. కాబట్టి, చైనాతో స్నేహం భారత్‌కి ముఖ్యం. చైనాకు భారత్ స్నేహ హస్తం అందిస్తుంది. ఇక రష్యాతో ఇప్పటికే ఉన్న బంధాన్ని మరింతగా పెంచుకొని ఇరుదేశాల వాణిజ్యాన్ని మరింతగా విస్తరించాలని భావిస్తుంది. భారత్ మెతక దేశం సుంకాల పెంపుద్వారా భారత్‌ను దారికి తెచుకోవచ్చు అని భావించిన ట్రంప్‌కు షాంగై సదస్సు ద్వారా భారత్ అంటే ఏమిటో తెలిసివచ్చింది. ఇక ఏళ్ల తరబడి చైనా అండతో భారత్ పైకి ఉగ్రవాదని ప్రోత్సహిస్తున పాకిస్థాన్‌ను చైనాతో స్నేహ సం బంధాలు పెంచుకోవడం ద్వారా ఆదేశాన్ని ఒంటరి చేయడం అనేది మరొకవ్యూహం. చైనా, భారత్ ప్రపంచంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన దేశాలు. రెండు దేశాల మార్కెట్ పరిధి ప్రపంచ మార్కెట్‌లో సుమారు 50 శాతం. అనూహ్యంగా భారత్ మరియు చైనా దేశాలమధ్య స్నేహం చిగురించింది. ఇప్పుడు చైనా అమెరికాను అడ్డుకట్టవేయాలంటే తప్పకుండా భారత్ సహకారం అవసరం. ఇటు భారత్‌కు కూడా చైనాతో స్నేహం తప్పనిసరి. కానీ చైనా గతఅనుభవాలను దృష్టిలో ఉంచుకొని భారత్ మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ●

# వివిధ శాఖలను అనుసంధానించడం అత్యవసరం!

చిందం మధు

మనదేశంలో ఎన్నో మెట్రోపాలిటన్ నగరాలు, మరెన్నో నగరాలున్నాయి. ఇన్ని నగరాలు ఉన్నా కూడా మనదేశంలో ప్రణాళిక బద్ధమైన నగరం మాత్రం చండీగఢ్ ఒక్కటే. మన దేశంలో ప్రణాళిక బద్ధమైన నగరాలు లేకపోవడానికి కారణాలను వెతికినప్పుడు ఒక కారణం మాత్రం మనకు స్పష్టంగా కనిపిస్తుంది. అదే విద్యుత్ విభాగం, రోడ్డు రవాణావిభాగం, పట్టణ సుందరీకరణ, ఫారెస్ట్ విభాగం లాంటి విభాగాల మధ్య సమన్వయం లేకపోవడం మనకు ప్రధాన కారణంగా తెలుస్తుంది. మనదేశంలో అన్ని విభాగాలు కూడా వాటి పరిధిలో అవి పనిచేస్తాయి. కానీ ఒక విభాగానికి మరొక విభాగానికి మధ్య సమన్వయలేమి మనకు కనిపిస్తుంది. మనదేశంలో అన్నివిభాగాలు కూడా నిరంతరంగా పనిచేస్తూనే ఉంటాయి. ఉదాహరణకు రోడ్డు, రవాణా వ్యవస్థ అనేది పాత రోడ్లను పునరుద్ధరించి కొత్త రోడ్లను వేయడం, కొత్తగా రోడ్లను విస్తరించడం లాంటి పనులు చేస్తాయి. విద్యుత్ విభాగం కూడా దేశానికి వెలుగును అందించడానికి నిరంతరంగా కృషి చేస్తుంది. అందుకు ఈవిభాగం 24 గంటలు సేవలు అందించడం జరుగుతుంది. వీరు ముఖ్యంగా వర్షాకాలంలో ఎంతో అప్రమత్తతతో పనిచేయాల్సి ఉంటుంది. కరెంటు వైర్లు వర్షానికి తెగిపడితే వాటిని బాగు చేయడం, కరెంటు స్తంభాలు కూలితే వాటి స్థానంలో మరొకటి పునరుద్ధరించడం లాంటి పనులు చేస్తారు. అంతేకాకుండా సంవత్సరం పొడుగునా కొత్తగా కరెంటు వైర్లువిస్తరించడం, పాత వాటిని పునరుద్ధరించడం వీరి పని. వీరు మన దేశంలో ముఖ్యంగా, మన రాష్ట్రంలో చాలాచక్కగా పని చేస్తున్నారు. దాని ఫలితమే 24గంటల నిరంతర విద్యుత్. ఇంకాఅత్యంత ముఖ్యమైన విభాగం మనదేశంలో అటవీ విస్తీర్ణం 33శాతం ఉండేందుకు కృషి చేస్తున్న విభాగం అటవీ విభాగం (నగర సుందరీకరణ హెచ్ఎండిఏ, జిహెచ్ఎంసి హైదరాబాద్లో అయితే వీటి పరిధిలోకి వస్తాయి) వారు కూడా తమ పనిలో పూర్తిగా నిమగ్నమై పనిచేస్తారు. అందులో భాగంగానే మీరు ప్రతి వర్షాకాలంలో మొక్కలునాటే ప్రక్రియను ప్రారంభిస్తారు. ఈ మూడు విభాగాలను విడిగా చూసినప్పుడు మనకు అంతా బాగానే కనిపిస్తుంది. ఇక ఈ విభాగాల అనుసంధానం ఎందుకని అనిపిస్తుంది. కానీ అసలు సమస్య ఇక్కడే ఉంది. వర్షాకాలంలో అటవీశాఖ (నగర సుందరీకరణ విభాగం) వారు రోడ్లకు ఇరువైపులా మొక్కలనునాటుతారు. అవి వర్షాలకు పెద్దగా కూడా అవుతాయి. ఈ మొక్కలను రోడ్లకు ఇరువైపులా మాత్రమే నాటితే ఎటువంటి సమస్య ఉండదు. కానీ వారు చెట్లు నాటేది కరెంటు వైర్ల కింద, స్తంభాల మధ్య ప్రభుత్వాలు నాటిన మొక్కలు వేపుగా తొందరగా పెరిగి చెట్లుగా మారుతాయి. ఈ విద్యుత్ సిబ్బంది వారు సంవత్సరం లేదా రెండు సంవత్సరాలు తిరిగే లోపు ఎండాకాలంలో ఆ చెట్ల తలలను నరికి వేస్తారు. ఇక ఇంతటితో ఆగకుండా రోడ్డు రవాణా విభాగం వారు రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా ఆ చెట్లను వేళ్లవరకు తొలగిస్తారు. అంతేకాకుండా ఈ రోడ్ల విస్తరణ పనుల్లో భాగంగా పనులకు అంతరాయం కలిగించే విద్యుత్ స్తంభాల కరెంట్ సరఫరాను నిలిపివేస్తారు విద్యుత్ శాఖ వారు. కానీ ఆ స్తంభాలను అక్కడి నుంచి తొలగించడం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారు. ఈ రోడ్ల రవాణా విభాగం వారు ఆ స్తంభాలను రోడ్డుకు మధ్యలోనే ఉంచి అలాగే ఆ రోడ్డును విస్తరిస్తారు. ఆ స్తంభం కారణంగా ప్రమాదాలు జరిగాక తీరికగా వచ్చి అప్పుడు విద్యుత్ శాఖ వారు ఆ స్తంభాన్ని అక్కడి నుంచి తొలగిస్తారు. ఈ అన్ని శాఖలు కూడా వారి పరిధిలో పడి పనిచేస్తున్నాయి. కానీ ప్రభుత్వం, ఆయాశాఖలు అనుకున్న లక్ష్యాలను సాధిస్తున్నాయా అనే ప్రశ్నకు సమాధానం మాత్రం లేదు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మొక్కలను నాటడం, విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు చెట్ల కొమ్మలను నరకడం, రోడ్ల విస్తరణంలో భాగంగా మొత్తం చెట్లనే తొలగించడం ఇది నిరంతర ప్రక్రియగా మారింది. ప్రతి సంవత్సరం ఇన్ని మొక్కలు నాటడం, పర్యావరణం కోసం ప్రభుత్వం ఇంత కృషిచేస్తుంది. తీరా చూస్తే నాటిన మొక్క చెట్టు అయ్యేలోపు ఆయా విభాగాల సమన్వయలేమికి బలి అవుతుంది. ఎటువంటి ప్రతిఫలం లేకుండా వృధా అవుతున్న ధనం ప్రజలదేకదా. ఆ ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండాలి అంటే ఆయా శాఖలను అత్యవసరంగా అనుసంధానించి, ప్రజల సొమ్మును కాపాడటానికే మేమున్నాం అని చెప్పుకునే పాలకులు తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాల్సిన అవసరం కచ్చితంగా ఉంది. ●

# ప్రజావాక్కు



## బకాయిల వెంటనే చెల్లించాలి

**కూటమి** ప్రభుత్వం వచ్చి ఏడాదిపైనే అయిపోయినప్పటికీ ఉద్యోగులకు రావలసిన బకాయిలు, పి.ఆర్.సి., మధ్యంతర భృతి వాటి గురించి స్పందించటం లేదు. జీతాలు సకాలంలో చెల్లిస్తామని ఎన్నికల వాగ్దానాన్ని మాత్రమే అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు అనేక రీతులలో ప్రభుత్వానికి తెలియజేసినప్పటికీ నిష్ప్రయోజనమే అయినది. ఈ నేపథ్యంలో పలు ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు వివిధ రీతులలో నిరసన కార్యక్రమాలు కూడా ప్రారంభించారు. ఈఅసంతృప్తి ముదిరి పాకాన పడక ముందే కూటమి ప్రభుత్వం కళ్లు తెరిచి ఉద్యోగులకు ఇవ్వవలసిన కనీసం రెండు డిఏలను ప్రకటించి మధ్యంతర భృతి, పి.ఆర్.సి. కమిషన్ గురించి ఒక స్పష్టత ఇవ్వవలసినదిగా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు.

- పారేపల్లి సత్యనారాయణ, దేవులపల్లి, ఏలూరు జిల్లా

## పోస్టుల సర్దుబాటు అన్యాయం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల వ్యవస్థలో పాత కళాశాలలలో ఆనాడు ఉన్న డిమాండుననుసరించి ఒక్కొక్క సబ్జెక్ట్‌కు మూడేసి నాలుగేసి పోస్టులు మంజూరై విద్యార్థులకుసంపూర్ణ విద్యనందించే వెసులుబాటు కల్పించారు. తరువాత కాలంలో వచ్చిన నూతన కళాశాలలను మంజూరైతే చేసారుగాని, పోస్టులు మంజూరు చేయలేదు. ప్రక్క కళాశాలల నుంచి సిబ్బందిని డెప్యుటేషన్ ద్వారా అసంపూర్తి బోధనతో కాలం వెళ్ల బుచ్చేవారు. ఇటువంటి కళాశాలలలో పోస్టులు మంజూరు చేయవలసిన బాధ్యత ఉంది. కానీ పాత కళాశాలలలోనున్న మంజూరు పోస్టులను అదనంగా ఉన్నాయనే నెపంతో నాన్‌సెంక్షన్ కళాశాలలలో సర్దుబాటు చేసారు. ఇది బాధాకరం.

- డా.దన్నాన అప్పలనాయుడు, చీపురుపల్లి

## పోస్టులను భర్తీ చేయాలి

ఆంధ్రప్రదేశ్ జూనియర్ కళాశాలలో పూర్వకాలంలో లైబ్రేరియన్ పోస్టు జూనియర్ లెక్చరర్ ఇన్ లైబ్రరీ సైన్స్‌గా మార్చారు. జోన్ రెండు జోన్‌మూడులలో షెడ్యూల్డ్ ట్రైబ్ కేటగిరీలో రెండుపోస్టులు నింపడానికి నోటిఫికేషన్ ఇచ్చారు. జోన్ వన్‌లో కూడా ఖాళీలున్నాయి క్యారీ ఫార్వర్డ్ పోస్టులను ఓపెన్ క్యాటగిరిగా మార్చాలి.

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## సభలకు రాకుంటే రాజీనామా చేయాలి

'నో వర్క్ నో పే' అనే పదం కార్మిక వర్గాలకు వర్తిస్తుంది. ఎన్నుకోబడిన రాష్ట్ర అసెంబ్లీ పార్లమెంటు సభ్యులకు ఈ రూలు ఎందుకు అమలు చేయడం లేదు. వీరందరు విధిగా సెషన్స్ జరుగుతున్నన్ని రోజులు సభలకు తప్పని సరిగా హాజరై ప్రజా సమస్యల మీద చర్చలు జరిపి అవసరమయితే చట్టాలు చేసి ప్రజలకు సేవ చేయాలి. అటువంటి బాధ్యతను ప్రజలు ఓటేసి కట్టబెడితే చట్ట సభలకు రాకపోతే సభా మర్యాదను అగౌరవ పరిచినట్లతుంది. వీరికి ఇబ్బడి ముబ్బడిగా జీతభత్యాలు నాగా లేకుండా ముదుతున్నాయి. పనిచేయకుండా జీతాలు తీసుకోవడం సిగ్గుపడాల్సిన విషయం. సభలకు హాజరు కాకూడదని నిర్ణయించు కున్నట్లయితే తమ సభ్యత్వానికి రాజీనామా చేయాలి. దీనికోసం పార్లమెంటులో చట్టం చేయాలి. ఈ దిశగా సుప్రీం కోర్టు కూడా స్పందించి తగు సలహాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలి. పాలకులలో క్రమశిక్షణ లోపిస్తే పాలితులు సంఘ వ్యతిరేకులవుతారు.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## పారదర్శకత పెరిగితేనే మార్పు సాకారం

సీఎం ప్రకటించిన కొత్త విద్యా విధానం పట్ల రాష్ట్ర ప్రజల్లో ఆసక్తి కలగడం సహజం. విద్యారంగం దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే ప్రధానాధారం. కాబట్టి కొత్తవిధానం రూపకల్పనలో విద్యార్థుల అవసరాలు, ఉపాధ్యాయుల సమస్యలు, తల్లిదండ్రుల ఆశలు అన్నీ ప్రతిబింబించాలి. నేటి పరిస్థితుల్లో విద్యార్థులకు పుస్తక జ్ఞానం మాత్రమే కాకుండా జీవిత నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత, నైతికవిలువలు కూడా అవసరం. కొత్తవిధానం ఈఅంశాలపై దృష్టిసారిస్తేనే ప్రయోజనం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## వాటర్ షెడ్ పథకం

నీటిసౌకర్యం లేని ప్రాంతాలలో లేక వర్షాధారంపైన ఆధారపడి వ్యవసాయం చేసే ప్రాంతాలలో వర్షపు నీటిని ఒడిసి పట్టి తద్వారా పంటలు పండించడం పంట ఉత్పాదకత పెంచడం పంట సాంద్రత పెంచడమే లక్ష్యంగా వాటర్ షెడ్ పథకం ప్రవేశపెట్టారు ఆ కోణంలో చూస్తే భారత దేశంలోని భూ పరివేష్టిత రాష్ట్రాలు గిరిజన జనాభా ఆధారపడి చేసే పోడు వ్యవసాయ రాష్ట్రాలు ఈశాన్య భారత రాష్ట్రాలు అన్నింటికీ ఇది ఒక జీవధారం లాగా పనిచేస్తుంది. దీనివల్ల వాతావరణ సమతుల్యం కాపాడుకోవడంతో పాటు పంటల వైవిధ్యం కూడా సాధ్యం.

-భారత అవినాష్, జనగామ

మన వి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# బాలికల పౌష్టికాహారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కామిడి సతీష్ రెడ్డి

ఆరోగ్యమే మహా భాగ్యం కస్తూర్బా విద్యాలయాల్లో (కేజీబీవీ) చదివే బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు కస్తూర్బా విద్యాలయాలను దేశవ్యాప్తంగా కేంద్రం నిర్వహిస్తున్నది. వీటి నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుంది. అయితే ఇటీవల కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో చదివే బాలికల ఆరోగ్యంపై ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో బాలికలు పౌష్టికాహారలోపంతో అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తేలింది. దీంతో ప్రభుత్వం బాలికలకు చదువుతోపాటు మంచి పోషకాహారం అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు గురుకుల విద్యాలయాల్లో మాదిరిగానే కేజీబీవీల్లో కూడా మెస్ చార్జీలను పెంచి విద్యార్థుల ఆహార మెనూలో మార్పులు చేసింది. గతంలో కస్తూర్బా బాలికల విద్యాలయాల్లో చదివే ఒక్కో విద్యార్థికి మెస్ చార్జీల కింద 1,225 రూపాయలు అందించగా, ఇప్పుడు దీన్ని 1,740రూపాయలకు పెంచారు. అంటే గతంలో కంటే 515 రూపాయలు మెస్ చార్జీలు పెంచారు. పాఠశాలలు ప్రారంభమైన నుంచే కొత్త మెనూ అమల్లోకి తీసుకువచ్చింది. దీని ప్రకారం కేజీబీవీ బాలికలు ఈ ఏడాది నుంచి కొత్త వంటలు రుచి చూస్తున్నారు. కొత్త మెనూ ప్రకారం నెలలో రెండుసార్లు మాంసాహారం, వారంలో ఐదుసార్లు గుడ్లు, ప్రతిరోజూ నెయ్యి వడ్డిస్తారు. కొత్త ఆహార మెనూ రూపొందించిన ప్రభుత్వం దీన్ని అమలుచేసే బాధ్యతను విద్యాశాఖకు అప్పగించింది. ప్రభుత్వ ఆదేశాలతో విద్యాశాఖ అధికారులు కొత్త మెనూ అమలు పరుస్తున్నారు. సమర్థవంతంగా అమలు చేయడానికి కొత్త వంటకాల తయారీపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన వారితో జిల్లాలోని మిగితా వారందరికీ ప్రాంతాల వారీగా వంటకాల తయారీపై శిక్షణ ఇచ్చారు. ఈ పథకాన్ని అమలు చేసేందుకు స్కూళ్ల ప్రారంభం నుంచే పర్యవేక్షించాలని ఉన్నతాధికారులకు ప్రభుత్వం ఆదేశించింది. మారిన మెనూ పాఠశాలల పునఃప్రారంభమైన రోజు నుంచే అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రతిరోజు మారే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఉదాహరణకు ఉదయం అల్పాహారం కింద సోమవారం ఉప్మా పెడితే మరుసటి రోజు



ఇతర వంటకాల్లో ఏదైనా ఒకదాన్ని వడ్డిస్తారు. ఇలా రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వివిధ రకాల రుచులతో వంటకాలు అందిస్తారు. కొత్తగా రూపొందించిన ఆహార పట్టిక విద్యాలయాల్లో నోటీసు బోర్డుపై పెట్టి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే బాలికల తల్లిదండ్రులకు కూడా దీనిపై శిక్షణ ఇచ్చారు. జిల్లాల విభజన తర్వాత కొత్తగా ఏర్పాటైన మండలాల్లోనూ కేజీబీవీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సుమారు లక్షలాదికి పైగా విద్యార్థులు వివిధ పాఠశాలల్లో చదువుతున్నారు. ప్రస్తుతం కొత్త విద్యార్థుల ప్రవేశాలు కొనసాగుతున్నందున ప్రవేశాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో ప్రతి ఏటా ప్రవేశాల సంఖ్య పెరుగుతూ వస్తుంది. మెనూలో ఉదయం ఉప్మా, జీరా రైస్, పులిహోరా, టమాట కిచిడీ, రాగి జావ, సాంబారు. బూస్టు, పూరి, బోండా, వడ, చపాతి, అరటిపండు. మధ్యాహ్నం టమాట పప్పుతో అన్నం, నెయ్యి, రసం, పెరుగు, ఉడకబెట్టిన గుడ్డు, చికెన్. సాయంత్రం పకోడి, ఉడకబెట్టిన శనగలు, ఎగ్‌బజ్జీ, బెల్లంపట్టీలు, అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు. రాత్రివేళ వివిధ రకాల కూరలతో అన్నం, మజ్జిగ, సాంబారు. రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా పాఠశాలల్లో కొత్త మెనూ అమలు చేయడం వరకు బాగానేఉన్నా ఆయా పాఠశాలల్లో వంట చేస్తున్న వారికి వేతనాల పెంపుపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదని వంట కార్మికులు వాపోతున్నారు. ఒక్కో పాఠశాలలో సుమారు నాలుగు, నుంచి ఐదుగురు వంట మనుషులు పనిచేస్తున్నారు. వారికి ఒక్కొక్కరికి నెలకు 9,500 రూపాయాలు చెల్లిస్తున్నారు. ఈ వేతనం తమ కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోవడం లేదని వాపోతున్నారు. దీనికితోడు కేజీబీవీల్లో కొత్త మెనూ అమలుతో తమకు మరింత భారం పెరిగిందని వాపోతున్నారు. ఇప్పటికే ఉదయం నుంచి రాత్రివరకు పాఠశాలల్లో పని చేస్తున్నామని కొత్తగా అమల్లోకి తెచ్చిన మెనూతో మరింత భారంగా మారనుందని వంట మనుషులు వాపోతున్నారు. పనికి తగ్గ వేతనం కింద తమకు నెలకు 20వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. రాష్ట్ర ప్రభుత్వం కస్తూర్బా విద్యాలయాల్లో కొత్త మెనూ అమలుకు చర్యలు తీసుకుంది. బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు రూపొందించిన మెనూ అన్ని పాఠశాలల్లో పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థుల చదువుతో పాటు మెరుగైన భోజనం అందించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఏ ఒక్కరూ పోషకాహార లోపం లేకుండా ఆరోగ్యంగా ఉండేందుకు చదువులో ముందు ఉండేందుకు ప్రభుత్వం కేజిబివిల బలోపేతానికి కృషి చేస్తుంది. ●

5_5.qxd 9/19/2025 12:31 AM Page 1



## ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపిన ఎంపి మాగుంట



**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా నూతన ఎస్పీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్‌రాజుని ఆయన కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎంపి మాగుంటను కలిసిన రవిశంకర్



**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలులోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో మాగుంట శ్రీనివాసులరెడ్డిని గురువారం రవిశంకర్ గ్రూప్ అధినేత, ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ నాయకులు కంది రవి శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేనపార్టీ ఉపాధ్యక్షులు పిల్లిరాజేష్, జనసేనపార్టీ సీనియర్ నాయకులు కాసాని వాసు, మొహమ్మద్ యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి వాగ్దానాలు నెరవేర్చదు

### - మాజీ కేంద్రమంత్రి చింతా మోహన్



**ఒంగోలు, ప్రభాతవార్త**

11 ఏళ్ల క్రితం ఎన్నికల్లో బిజెపి రెండు వాగ్దానాలు ఇచ్చింది.. ప్రతి ఇంటికీ 15 లక్షల రూపాయలు ఇస్తామన్నారు. ఇప్పటివరకు నయా పైసా రాలేదు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. 11 ఏళ్లలో 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలా అని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. గురువారం ఒంగోలులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నిరుద్యోగుల పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఎంటెక్ చదివిన నిరుద్యోగులు డ్రైవర్లుగా పనిచేస్తున్నారన్నారు. ఏపీలో కంటే, తమిళనాడులో పెట్రోల్, డీజిల్ ఎనిమిది రూపాయలు తక్కువ. 14.5 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులు రుణమాఫీ చేశారన్నారు. ఎన్‌పిఏలు100 కోట్ల రూపాయలు పైబడిన ఎన్‌పిఏలను రుణమాఫీ చేశారన్నారు. తిరుపతి, వైజాగ్ పర్యటనకు వచ్చిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించలేదన్నారు. 1991లో కాంగ్రెస్ పార్టీ మన్మోహన్ సింగ్ ఆర్థిక సంస్కరణలు వల్ల దేశాన్ని ముందుకు తీసుకెళుతున్నాయన్నారు. ఆయన తెచ్చిన ఆర్థిక సంస్కరణలు వల్ల, అమెరికా, చైనా తర్వాత భారతదేశాన్ని నిలబెట్టిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక న్యాయం గురించి, తరిమెల నాగిరెడ్డిలాగా ఉపన్యాసం ఇచ్చారన్నారు. మీరు నిజంగా సామాజిక న్యాయం కోరుకుంటే, 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసింది చాలు. ఇక మీరు దిగిపోండి. మాదిగను ఏపీకి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కారంచేడు వెళ్లి మాదిగలను చంద్రబాబు నాయుడు ఎప్పుడైనా పరామర్శించారా ప్రశ్నించారు. నన్ను జైల్లో పెట్టించిన జగన్ కాంగ్రెస్ పార్టీపై అలిగాడన్నారు. కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డిని జైల్లో పెట్టలేదని సిస్టమ్ అతన్ని జైల్లో పెట్టిందన్నారు. యుపిఏకి మద్దతు ఇచ్చిన కరుణానిధి కూతురు కనిమొళి కూడా జైలుకు వెళ్లారు. అయినా స్టాలిన్ కాంగ్రెస్ తోనే ఉన్నారన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసిపి మాజీ మంత్రి టిడిపి మాకు శత్రువు అన్నారు. బిజెపి మీకు శత్రువా? మిత్రువా?? సూటిగా చెప్పాలన్నారు. ఆర్ఎస్ఎస్ ఒక సైద్ధాంతిక ప్రమాణిక ప్రకారం నిన్ననే ప్రధాని మోడీ 75 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. మోడీని ఎందుకు తప్పించలేదో, ఆర్ఎస్ఎస్ మోహన్ భగవత్ సమాధానం చెప్పాలని చింతామోహన్ డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు విజేంద్ర బహుజన్, పీకా మధుసూదనరావు, మన్నం ప్రసన్న రాజు పాల్గొన్నారు.

## సరికొత్త టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన



**ఒంగోలు, ప్రభాతవార్త**

సరికొత్త టెక్నాలజీలపై సీఎస్ఈ, ఏఐఎమ్ ఎల్ విద్యార్థులకు వర్క్‌షాప్స్ యాప్ తయారీపై ఏఐఎమ్ ఎల్ విద్యార్థులకు ఒంగోలులోని క్విస్ ఇంజినీరంగ్ కళాశాలలో సరికొత్త టెక్నాలజీలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వివిధ వర్క్‌షాప్స్ నిర్వహించారు. సీఎస్ ఈ, ఏఐఎమ్ ఎల్ విద్యార్థులకు ఈ వర్క్ షాప్స్ ఏర్పాటు చేశారు. మెషిన్ లెర్నింగ్ ద్వారా యాప్‌ని ఎలా డెవలప్ చేయాలి అనే అంశంపై ఏఐఎమ్ ఎల్ విద్యార్థులకు శిక్షణ అందించారు. ఇండస్ట్రీ ఎక్స్ పర్ట్ అయినటువంటి ప్రియాన్షు శుక్లా దీనిపై ప్రత్యేక ప్రజంటేషన్ ఇచ్చి విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. సీఎస్ఈ రెండో ఏడాది విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. సాఫ్ట్ వేర్ డెవలపర్, ట్రైనర్ సుందర్, సి విద్యార్థులకు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. సరికొత్త టెక్నాలజీపై విద్యార్థులకు ఎప్పటికప్పుడు శిక్షణ అందించడంలో క్విస్ కళాశాల ఎప్పుడూ ముందు ఉంటుందని, విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి అనేక కార్యక్రమాలు నిత్యం నిర్వహిస్తూ ఉంటామని విద్యాసంస్థల అధినేత డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌ఛైర్మన్ డాక్టర్ నిడమానూరి శ్రీగాయత్రి తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ప్రవీణ, శివప్రసాద్, విజయలక్ష్మీ, డాక్టర్ రాయుడు తదితరులు పర్యవేక్షించారు.

## ఖాతాదారులకు ఎస్‌బిఐ మెరుగైన సేవలు




**ఒంగోలు, ప్రభాతవార్త**

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎన్నో వినూత్న పథకాలను అమలు చేస్తోందని ప్రకాశం జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా రీజనల్ శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ఒంగోలులో టౌన్ హాల్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌కు ఎస్బీఐగుంటూరు పరిపాలనా కార్యాలయ చీఫ్ మేనేజర్ సంజీవ్ కుమార్ బన్సల్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆర్.బి.ఓ చీఫ్‌మేనేజర్లు కె.రవికుమార్, వేదంరాజేష్‌బాబు, కె.హారతి, హెచ్.ఆర్.మేనేజర్ ఎ.ఎన్.వి.ఎస్.నళినీకాంత్, కె.జానకిరామయ్య, అసోసియేషన్‌నాయకులువి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు, అవార్డు యూనియన్ నాయకులు వి.ఎస్.ఆర్. సుధాకర్, పి.వెంకటరెడ్డి, పెద్దసంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాతాదారుల హక్కులు, బ్యాంక్ అందిస్తున్న సేవలు, సైబర్ మోసాల నుంచి ఎలా రక్షణ పొందాలి వంటి అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ఎస్బీఐ రీజనల్ మేనేజర్ వెల్లంకి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల హక్కుల పరిరక్షణకు ఎన్నో చర్యలు చేపట్టిందన్నారు. ఖాతాదారులు సులభంగా బ్యాంక్ సేవలు పొందేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామన్నారు. బ్యాంకింగ్ మోసాలపై బ్యాంక్‌చేసే సూచనలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అతిథిగా పాల్గొన్న సంజీవ్ కుమార్ బన్సల్ మాట్లాడుతూ ఖాతాదారులకు బ్యాంక్ అందజేస్తున్న సేవల గురించి పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే ఈ టౌన్ హాల్ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీనియర్ సిటిజన్లు, పింఛనర్లు, దివ్యాంగులకు బ్యాంక్ ప్రత్యేక సేవలు అందిస్తోందన్నారు.

## సొసైటీలో 19 నుంచి ఎరువుల విక్రయాలు

**చీమకుర్తి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**

చీమకుర్తి విశాల సహకార సంఘ కార్యాలయం లో ఈ నెల 19 తేది నుండి ఎరువులు యూరియా, డి.ఏ.పిఅందుబాటులో ఉంటాయని సొసైటీ చైర్ పర్సన్ పూనాటి వెంకటరావు చెప్పారు. మండల పరిదిలో గల రైతులు తమ ఆధార్ కార్డు మరియు పొలం పాస్ బుక్ జిరాక్స్ కాపీ వెంట తెచ్చుకోని అవసరమైన ఎరువులు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పంట రుణాలు గరిష్టంగా 300000 రూపాయలు, రైతు ప్రకాశం రుణాలు గరిష్టంగా 700000 రూపాయలు, మరియు కర్షక మిత్ర రుణాలు 15 లక్షల వరకు మంజూరు చేస్తామని తెలిపారు. కావాల్సిన రైతులు సొసైటీలో సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని ఈ సంధర్భంగా సంఘ ఛైర్పర్సన్ పూనాటి వెంకటరావు తెలియజేశారు.

# ప్రకాశం



తెలుగు వారి దినపత్రిక

# వార్త

## యువజన కాంగ్రెస్ [illegible]

[illegible]

## కనిగిరి అభివృద్ధే తన మొదటి లక్ష్యం

### - ఎమ్మెల్యే డా. ఉగ్రనరసింహారెడ్డి



**కనిగిరి, సెప్టెంబర్ 18,ప్రభాతవార్త**

కనిగిరి అభివృద్ధే తన మొదటి లక్ష్యం అని ఎమ్మెల్యే డా.ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. నియోజకవర్గం లో రహదారి సదుపాయాలు మెరుగుపర్చేందుకు నిధులు కేటాయించాలని ఆర్అండ్‌బి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిను గురువారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినతిపత్రం సమర్పించి, పలు ప్రధాన రహదారుల నిర్మాణం, పాడైపోయిన రహదారుల మరమ్మత్తుల కోసం తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రజలు రవాణా సౌకర్యాల లోపంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కనిగిరి అభివృద్ధి దిశగా సహకరించేందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి, అవసరమైన నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# వైసీపీలో ఉండలేరు.. టీడీపీకి వెళ్ళలేరు

## - ఏపీలో ఇంట్రస్టింగ్ పాలిటిక్స్

**ఒంగోలు, ప్రభాతవార్త**

ముందు నొయ్యి.. వెనుక గొయ్యి అన్న చందంగా వైసీపీలో కొందరు ఎమ్మెల్సీల పరిస్థితి తయారైందని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఆ పార్టీ అధికారంలో ఉండగా రకరకాల కారణాలతో ఎమ్మెల్సీ పదవులు పొందిన వారు గత ఎన్నికల్లో అధికారం కోల్పోయిన నాటి నుంచి అక్కడ ఉండలేక అధికార టీడీపీలో చేరలేక తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నట్లు చెప్తున్నారు. వైసీపీలో ఉండగ వ్యవహరించిన తీరు వల్ల టీడీపీలోకి రాకుండా రెడ్‌సిగ్నల్ వేస్తుండటం వైసీపీలో తమకు రాజకీయ భవిష్యత్తు లేదన్న ఆలోచనతో ప్రత్యామ్నాయాలు వెతుక్కుంటున్నారు. అయితే టీడీపీలో ఛాన్స్ వస్తుందన్న ఆత్మవిశ్వాసంతో ముందుగా రాజీనామాలు ప్రకటించిన వారు ఆ తరువాత కూడా తమకుఛాన్స్ లేదని తెలుసుకుని షాక్‌కు గురవుతున్నారు. ఇలాంటి వారు తప్పనిసరి పరిస్థితుల్లో బీజేపీలోకి చేరుతున్నట్లు ప్రచారం సాగుతుంది. వైసీపీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీ పోతుల సునీత తాజాగా బీజేపీలో చేరారు. దాదాపు ఏడాది క్రిందటే ఆమె తన పదవికి, పార్టీకి రాజీనామా చేసినా ఇప్పటి వరకు ఆమె ఏ పార్టీలో చేరకపోవడానికి కారణం టీడీపీలో చేరేందుకు అవకాశం వస్తుందన్న ఆశతో ఎదురు చూడడమే అంటున్నారు. చివరికి ఎంత ఓపికగా ఉన్నప్పటికి తన పట్ల టీడీపీ అధిష్టానం సానుకూలంగా లేకపోవడంతో చివరికి తనను తాను తప్పించుకునేందుకు ఆమె బీజేపీలో చేరినట్లు అభిప్రాయపడుతున్నారు. పోతుల సునీత ఒక్కరే కాదు.. వైసీపీకి రాజీనామా చేసిన పలువురు ఎమ్మెల్సీలు టీడీపీలోకి వెళ్ళకుండా ఆయా నియోజకవర్గ నేతలు అడ్డుకుంటున్నారని అంటున్నారు. దీంతో చేసేది లేక కమలం గూటికి వెళ్తున్నారని అంటున్నారు. వైసీపీ అధికారం కోల్పోయిన తరువాత నలుగురు రాజ్యసభ సభ్యులు, ఆరుగురు ఎమ్మెల్సీలు తమ పదవులను వదులుకున్నారు. వైసీపీకి రాజీనామా చేసి ఇతర పార్టీలోకి వెళ్లాలని ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే రాజ్యసభకు రాజీనామా చేసిన నలుగురిలో ఇద్దరు టీడీపీకి, ఒకరు బీజేపీలోకి వెళ్లారు. సీనియర్‌నేత విజయసాయిరెడ్డి ఏ పార్టీలో చేరలేదు. దీనికి కారణం తాను రాజకీయ సన్యాసం స్వీకరిస్తున్నట్లు ప్రకటించడమే. ఇక ఎమ్మెల్యేల విషయానికి వస్తే చిలకలూరిపేటకు చెందిన మర్రి రాజశేఖర్ ఒకరికే టీడీపీ నుంచి ఆహ్వానం అందిందని అంటున్నారు. టీడీపీలోకి వెళ్లాలని తెగ ప్రయత్నాలు చేసినా పోతుల సునీత, కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, జయమంగళ వెంకటరమణలకు అటు వైపు నుంచి సానుకూల సంకేతాలు అందలేదని అంటున్నారు. జెకియా ఖానం వైసీపీకి రాజీనామా చేసిన వెంటనే బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ఇన్నాళ్లు వేచి చూసిన పోతుల సునీత తాజాగా బీజేపీ గూటికి చేరింది. జయమంగళం వెంకటరమణ జనసేనలోకి చేరుతారని చెప్తున్నా ఆ పరిస్థితి ఎక్కడా కనిపించలేదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇక టీడీపీలోకి వెళ్తారనుకున్న బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కర్రిపద్మశ్రీ రాజకీయ అడకత్తెరలో కోకచెక్కల మారిందని అంటున్నారు. వారు వైసీపీకి రాజీనామా చేసిన తరువాత ఏ పార్టీలోకి వెళ్లకుండా రాజకీయంగా ఒంటరి అయ్యారని అంటున్నారు. అయితే ఎమ్మెల్సీలు టీడీపీలోకి వస్తామన్న వారిని చేర్చుకోవడానికి ఆ పార్టీ ఆసక్తి చూపకపోవడం చర్చనీయాంశమవుతుంది. దీనికి చాలా కారణాలు ఉన్నాయని అంటున్నారు. స్థానికంగా నియోజకవర్గాల్లో ఖాళీ లేకపోవడం ఒక కారణం అయితే వైసీపీలో ఉండగా వారు శృతిమించిన విమర్శలు చేశారన్న ఆగ్రహం టీడీపీ అధిష్టానంలో ఉందంటున్నారు. మొత్తానికి టీడీపీలో ఛాన్స్ లేక బీజేపీలోకి వెళ్తున్న నేతల భవిష్యత్తు ఎలా ఉండబోతుందన్నదనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు.

## క్లీన్ ఎనర్జీ పాలసీతో 78.50 గిగావాట్ల స్థాయికి సోలార్ విద్యుత్ ఉత్పత్తి

### - పీఎం సూర్యఘర్‌కు బ్యాంకర్లు సహకరించాలి

### - మోడల్ స్కూళ్లు ప్రభుత్వ భవనాలకు సోలార్ రూఫ్ టాప్ అర్హులైన ఎస్సీ, ఎస్టీల గృహాలకు ఉచితంగా సోలరైజేషన్

### - అసెంబ్లీలో ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అద్దంకి రూరల్ , సెప్టెంబరు 18,ప్రభాతవార్త**

రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థం ప్రస్తుతం 5006.35 మెగావాట్లుగా ఉందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సోలార్ విద్యుత్ ఉత్పత్తి, సామర్థంపై అడిగిన ప్రశ్నకు అసెంబ్లీలో బుధవారం నాడు మంత్రి సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ సోలార్ విద్యుత్ సామర్థ్యాన్ని విస్తృతంగా పెంచే దిశగా ప్రభుత్వం ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ పాలసీ ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 78.50 గిగావాట్లకు పెంచే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు. మోడల్ స్కూల్స్, కేజీబీవీ వసతి గృహాల్లో 2,138 కిలోవాట్ల సామర్థంతో రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అదే విధంగా పీఎం సిరి పథకం క్రింద 415 పాఠశాలల్లో 3,550 కిలోవాట్ల సామర్థంతో సోలార్ వ్యవస్థల ఏర్పాటుకు టెండర్లు పిలిపించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ భవనాలు, పంచాయతీ భవనాలపై రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ భవనాలు, పంచాయితీ భవనాలపై 130 మెగావాట్ల సామర్థంతో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు.

### పీఎం సూర్యఘర్ పథకం విజయవంతంగా అమలు

పీఎం సూర్యఘర్ పథకం విజయవంతంగా అమలు చేయడానికి బ్యాంకర్లు పూర్తి స్థాయిలో సహకరించాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ కోరారు. బ్యాంకుల మద్దతు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే బ్యాంకర్లతో సమావేశమయ్యారని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులపై విద్యుత్ భారం పడకుండా అర్హులైన వారికి ప్రభుత్వం ఉచితంగా సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేస్తోందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 9 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని రాష్ట్రం సాధించగా, వైసీపీ పాలనలో విద్యుత్‌రంగం సర్వ నాశనమైందని తెలిపారు. పునరుత్పాదక విద్యుత్ రంగంలో పెట్టుబడిపెట్టే పారిశ్రామికవేత్తలను, పెట్టుబడిదారులను వైసీపీ నేతలు బెదిరించి రాష్ట్రం నుంచి తరిమి వేశారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ఆంధ్రప్రదేశ్ మిగులు విద్యుత్ రాష్ట్రం నుంచి లోటు విద్యుత్ రాష్ట్రంగా మారిందని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తికి ఎన్నో అవకాశాలున్న వాటిని సద్వినియోగం చేసుకోకుండా... తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపిందని మంత్రి గొట్టిపాటి అసెంబ్లీ సాక్షిగా గౌరవ సభ్యులకు వివరించారు .

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే చర్యలు తప్పవు

### - ఎస్సై శివ నాంచారయ్య





**అర్ధవీడు, సెప్టెంబర్ 18 ,ప్రభాతవార్త**

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని అర్ధవీడు ఎస్సై శివ నాంచారయ్య పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు గురువారం అర్ధవీడు మండల పరిసర ప్రాంతాలలోని నిర్మానుషంగా ఉన్న ప్రదేశాలను పోలీసు సిబ్బందితో పరిశీలించారు. నిత్యం మందుబాబులు అడ్డాగా చేసుకొని మద్యం సేవిస్తున్న ప్రాంతాలను గుర్తించి అక్కడ పడవేసిన మందు సీసాలుగాజు ముక్కలను పారిశుద్ధ్యకార్మికులతో కలిసి శుభ్రం చేయించారు. అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లి గ్రౌండ్‌లో మందుబాబులు మద్యం సేవించి ప్లాస్టిక్ వ్యర్థ పదార్థాలు, గాజు సీసాలు పడవేయటం జరిగిందని వాటివల్ల వర్షాకాల సమయంలో అవి వ్యర్థపదార్థాలుగా మారి కలుషితమై త్రాగు నీరు, సాగు నీటిలో కలుషితం అవడం వల్ల రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. ఈ మేరకు మందుబాబులు మద్యం సేవించే ప్రాంతాలను గుర్తించడం తో పాటు నిర్మానుష ప్రదేశాలపై నిఘా ఉంటుందని బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శివ నాంచారయ్య హెచ్చరించారు .

## అక్రమ ఇసుక తవ్వకాలు ఆపాలని ఆందోళన

### - తహశీల్దార్‌కు వినతిపత్రం





**నాగులుప్పలపాడు, సెప్టెబర్ 18 ,ప్రభాతవార్త**

నాగులుప్పలపాడు మండలం చదలవాడ రెవెన్యూ పరిధిలోని 383 సర్వే నెంబరులో అక్రమ ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని మద్దిపాడు మండలం ఇనమనమెల్లూరు గ్రామానికి చెందిన యానాది కాలనీ వాసులు, గ్రామస్తులు, పండ్లతోటల యజమానులు గురువారం నాగులుప్పలపాడు మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దిపాడు మండలం ఇనమన మెల్లూరు రెవెన్యూ పరిధితో పాటు చదలవాడ రెవెన్యూ పరిధిలో 383 సర్వే నెంబరుకు సంబంధించిన సుమారు 150 ఎకరాలకు ప్రభుత్వం పేదలకు పట్టాలు ఇచ్చింది. ఆ భూముల్లో జేసీబీల ద్వారా అక్రమంగా ఇసుక తవ్వి సొమ్ము చేసుకొనేందుకు పెద్దలు కన్నుపడింది. ఈ పాటికే మనుషుల ద్వారా ఎత్తించి బయటకు తరలిస్తున్నారు. ఇక జేసీబీల ద్వారా అయితే 20 అడుగుల మేర లోతులో తవ్వి ఇసుకను తరలిస్తారని దాంతో పెద్ద పెద్ద గుంటలు పడి గుండ్లకమ్మ వరద వచ్చి ఆ ప్రాంతంలో ఉన్న మామిడి, సపోట, జామ, జామాయిల్ తదితర తోటలు దెబ్బతినే ప్రమాదం ఉందని దాంతో పాటు మద్దిపాడు మండలం యానాది కాలనీ వాసులు గ్రామస్తులు, పండ్ల తోటల యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రోజుల క్రితం ఇనమనమెల్లూరు రెవెన్యూ పరిధిలోని భూముల్లో ఇసుకను జేసీబీతో అక్రమంగా తరలిస్తుండగా, మేమంతా ఐక్యంగా అడ్డుకున్నామన్నారు. అయినప్పటికి తిరిగి చదలవాడ రెవెన్యూ పరిధిలోని భూముల్లో నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు గ్రామానికి చెందిన షేక్ ఖాజావలి తండ్రి మస్తాన్ వలి ఎంఎల్‌ఏ చెప్పాడని మీరు ఎవరు అడ్డుకోవడానికి అంటూ జేసీబీతో అక్రమంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకునేందుకు పూనుకున్నారని దానిని మేము అడ్డుకోవడంతో మాట మార్చి ఇసుక తవ్వకాలు కాదు రోడ్డు వేస్తున్నానని సాకుగా చూపారు కాని ఇసుక తవ్వేందుకు బాట కొరకు ర్యాంపు వేశారు. దాంతో మేము దానిని కూడా తొలగించడంతో మాపైనే అక్రమంగా కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా ఇసుకను తరలించడమే కాకుండా మాపై కేసులు బనాయించడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఇసుక అక్రమ తవ్వకాలను నిలుపుదల చేసి మా తోటలతో పాటు కాలనీ కాపాడాలని తహసీల్దార్‌ను కోరారు. అనంతరం తదితర అంశాలతో కూడిన వినతి పత్రం తహసీల్దార్ ప్రవీన్ కుమార్ కు అందజేశారు. ఈ నేపథ్యంలో ఇనమనమెల్లూరులోని యానాది కాలనీ వాసులు, గ్రామస్తులు, పండ్ల తోటల యజమానులు చేసే న్యాయమైన ఆందోళనకు సీపీఎం మద్దతు తెలిపి మాట్లాడుతూ అక్రమ ఇసుక తవ్వకాలను కావాలని వాసులకు, పండ్ల తోటల యజమానులకు, గ్రామస్తులకు తీవ్రమైన నష్టం వాటిల్లితుందని వెంటనే సంఘటనా స్థలాన్ని పరిశీలించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దాంతో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు జే.జయంతిబాబు, నాగులుప్పలపాడు మద్దిపాడు సీపీఎం మండల కార్యదర్శులు టి.శ్రీకాంత్, ఉబ్బా ఆదిలక్ష్మి, గిరిజన సంఘం నాయకులుమల్లవరపు శ్రీనివాసరావు, దొప్పలపూడి సుబ్బయ్య, శేషయ్య, గ్రామస్తులు, పండ్ల తోటల యజమానులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ కార్యక్రమం



**నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**

స్వస్త్ నారీ- సశక్త్ పరివారం ఫ్రోగ్రాంలో భాగంగా నాగులుప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలో హెల్త్ క్యాంపు నిర్వహించడంజరిగింది. హెల్త్ క్యాంపులో నాగులుప్పలపాడు అంగన్‌వాడీ కార్యకర్తలు సూపర్‌వైజర్ పర్యవేక్షణలో పోషణ స్టాల్ ఏర్పాటు చేయడమైంది. ఈ యొక్క స్టాల్‌లో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఏ విధంగా పొందాలి, గ్రామ స్థాయిలో దొరికేటువంటి ఆకు కూరలు కూరగాయాలు, చిరుధాన్యాలుతో ఏ విధంగా వంటలు తయారు చేసుకొని తినాలని వాటిపై ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.అన్నపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమ లేఅవుట్, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి



**చీమకుర్తి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**

అక్రమ లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని రీజనల్ డిప్యూటీ డైరెక్టరు టౌన్, కంట్రీ ప్లానింగ్ అధికారి పి మధు కుమార్ కోరారు. చీమకుర్తి పురపాలక సంఘపరిధిలోని లేఅవుట్ యజమానులు, డెవలపర్లు, ప్లాట్ల అమ్మకం, కొనుగోలుదారులతో ఎల్ఆర్ఎస్ 2020 స్కీముపై గురువారం జరిగిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడారు. అందులో భాగంగా చీమకుర్తి మునిసిపాలిటీ పరిధిలో 48 అక్రమ లేఅవుట్లు ఉన్నాయని, అందులో 21 లేఅవుట్లు క్రమబద్ధీకరించబడినవని, మిగిలిన 27 లే అవుట్లు వివిధ దశలలో ఉన్నవని తెలిపియున్నారు. అక్రమ లే అవుట్లలో ప్లాట్లకు భవన నిర్మాణ అనుమతులు ఇవ్వబడవని, రోడ్లు, కాలువలు, వీధి లైట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించబడవని వారు అన్నారు. కావున సదరు అక్రమ లే అవుట్లలో ప్లాట్లు కొన్న యజమానులు ఆన్ లైన్ పోర్టల్ నందు సిటిజెన్ లాగిన్ లేదా లైసెన్సు పొందిన ఎల్ టి పి ద్వారా గానీ ఈనెల 24 లోగా అప్లై చేసుకోనవలసినదిగా తెలియజేసారు. టి పి ఏ పవన్‌కుమార్, కమీషనరు రామకృష్ణయ్య, టిపిఓ శారద, సిబ్బంది, ఎల్టీపీలు మరియు లే అవుట్ యజమానులు, డెవలపర్లు పాల్గోనియున్నారు.

## అనాథ పిల్లల అవసరాలు గుర్తించాలి



**సింగరాయకొండ,సెప్టెంబర్18, (ప్రభాతవార్త)**
మండల స్థాయి లోని అనాథ పిల్లలను గుర్తించి వారి అవసరాలను నమోదు చేయాలని ఎంపీడీవో డి. జయమణి ఆదేశించారు.స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బంగారు బాల్యం కార్యక్రమంపై మండల స్థాయిలోని గ్రామ సచివాలయ మహిళా పోలీసులులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అనాథ పిల్లలకు కావలసిన అవసరాలను గుర్తించి, వారికి తగిన ప్రభుత్వ పథకాలు అప్లై చేయాలని మహిళా పోలీసులు ను ఎంపీడీఓ ఆదేశించారు.అలాగే సెమీ అనాథ పిల్లల విషయంలో వారి తల్లిదండ్రులకు అవసరమైన సహాయాలను గుర్తించి, సంబంధిత నివేదికను త్వరితగతిన అందజేయాలని సూచించారు.ఈ సమావేశంలో పరిపాలన అధికారి జీవి.కృష్ణారావు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి - మండల టీచర్స్ జేఏసీ వినతి



**సింగరాయకొండ,సెప్టెంబర్ 18,(ప్రభాతవార్త)**
ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోరుతూ టీచర్స్ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం మండల విద్యా వనరుల కేంద్రంలో విద్యాశాఖ అధికారి కత్తిశ్రీనివాసరావుకు మెమోరాండం సమర్పించారు .ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సంపాదిత సెలవులు, 30 ఏళ్ల ఎస్ఎస్, బదిలీ ఉపాధ్యాయుల సమస్యలతో పాటు పీఎఫ్ మెడ్యూల్ వివరాలను అప్డేట్ చేసి సేవా పుస్తకాల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు.వారి వినతిపై స్పందించిన ఎంఈఓ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని, దసరా సెలవుల్లో సేవా పుస్తకాలు అప్డేట్ చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపిటిఎఫ్ మండల అధ్యక్షులు కటకం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి శ్యామల సుధాకర్ రెడ్డి, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లాకార్యదర్శి కొల్లూరు వెంకయ్య,జలకం ప్రభాకర్, ఆర్జెయూపి రాంబాబు,బి.శ్రీనివాసులు, పి. శ్రీనివాసులు,కీర్తి శ్రీనివాసరావు, అంబటి బ్రహ్మయ్య, పూర్ణచంద్రరావు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధ్యం



**అద్దంకి, సెప్టెంబరు 18, (ప్రభాతవార్త)**
సమగ్ర ఎరువుల యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధ్యమని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జి.రమేష్ అన్నారు. గొరిగ గ్రామంలో నిర్వహించిన కిసాన్ గోష్టి కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల యాజమాన్యం గురించి వివరిస్తూ దుక్కిలో నత్రజని ఎరువులు వాడకం తగ్గించాలని,వివరి దుక్కిలో భాస్వరం ఎరువులు వాడుకోవాలని, భాస్వరం ఎరువులు వలన పంట వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెందుతాయని వేరు వ్యవస్థ వృద్ధి చెందిన తరువాత మాత్రమే మొక్క నత్రజని ఎరువులు తీసుకుంటుంది అని తెలిపారు. రెండు మరియు మూడో దఫా లో మాత్రమే నత్రజని ఎరువులు వాడుకోవాలని సూచించారు. భూసార పరీక్ష ఫలితాల ప్రకారం ఎరువుల వాడకం చేపట్టాలని సూచించారు.వరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులగురించి తెలియజేశారు, కార్యక్రమం లో సహాయ వ్యవసాయ సంచాలకులు బి ఎఫ్రాయిము మాట్లాడుతూ నానో యూరియా వాడకం వలన కలుగు ప్రయోజనాల గురించి తెలియజేశారు, మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ ప్రతి రైతు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు సేవా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు,గ్రామ వ్యవసాయ సహాయకురాలు శ్రీలక్ష్మి, గ్రామ నాయకులు పుట్టా సాంబశివరావు, మాకినేని ఏడుకొండలు, నరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల హర్షం



**అద్దంకి , సెప్టెంబరు 18, ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు 15 వేలరూపాయలు జమ చేయనున్నదని ప్రకటించడంతో గురువారం అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామంలోని గ్రామ తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో ఆటో యజమానులు సిఎం చంద్రబాబు,పవన్ కళ్యాణ్, లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపి ఆనందోత్సాహాలతో స్వీట్లు పంచుకున్నారు.ఈ సందర్భంగా ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమల్లోకి రావటంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు ఉన్న నేపధ్యంలో వీరి కష్టాలు దృష్టిలో ఉంచుకొని, కూటమి ప్రభుత్వం ఆదుకునేలా ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర కింద రూ.15 వేల చొప్పున సాయం అందించనుందన్నారు.ఈ కార్యక్రమంలో బడావలి,ఈను ,ఆదినారాయణ,రూబేను,రవీంద్ర,రవి,దాసు,ప్రసాద్,మహేష్, చినబాబు, పున్నయ్య,తదితరులు పాల్గొన్నారు.

## 21వ తేదీ జరిగే సి ఐ టి యు

### - అద్దంకి మండల మహాసభలను జయప్రదం చేయండి



**అద్దంకి, సెప్టెంబరు 18,(ప్రభాతవార్త)**
సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ సి ఐ టి యు అద్దంకి మండలం మహాసభ ఈనెల 21వ తేదీ ఆదివారం అద్దంకి సి ఐ టి యు ఆఫీస్ సుందరయ్య భవనంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ మహాసభల్లో అంగన్వాడీ, ఆశా మధ్యాహ్న భోజనం పి ఒ ఏ ఆర్పీలు, మున్సిపల్ వర్కర్స్ ఫ్రూట్ వెండర్స్, ఆటో వర్కర్స్, భవన నిర్మాణ రంగ కార్మికులు అన్ని రకాల కార్మిక వర్గాలు ఈ మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని గురువారం అద్దంకి సుందరయ్య భవనంలో నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో విజ్ఞప్తి చేశారు. సి ఐ టి యు నాయకులు పి తిరుపతిరెడ్డి, తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మిక వర్గ ప్రయోజనాల కోసం నిరంతరం సిఐటియు సంఘం చేస్తున్నదని గత మూడు సంవత్సరాల కాలంలో కార్మిక వర్గం నిర్వహించిన పోరాటాలను సమీక్షించుకొని భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకోవడం ఈ మహాసభల నిర్వహించడం జరుగుతుందని ఈ మహాసభలకు ఉద్యోగ, ఉపాధ్యాయ మధ్యతరగతి వర్గం ప్రజానీకం తమ సహాయ సహకారాలు అందించి తోడ్పాటు నివ్వాలని, ఈ సందర్భంగా తెలిపారు. అఖిలభారత సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు డిసెంబర్ 31 జనవరి 1 2 3 4 తేదీల్లో మొట్టమొదటిగా ఆంధ్ర రాష్ట్రంలో విశాఖపట్నంలో నిర్వహించడం జరుగుతుందని, ఈ మహాసభలు జయప్రదం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు పి ఆదాం, మున్సిపల్ వర్కర్ యూనియన్ కార్యదర్శి ఉసురుపాటి శామ్యూల్, మున్సిపాలిటీ వర్కర్ సీనియర్ నాయకులు దాసరి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాదుపు మహిళలకు అవగాహన



**బల్లికురవ, సెప్టెంబర్ 18, (ప్రభాతవార్త)**
ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ మాసోత్సవంలో భాగంగా గురువారం మండల కేంద్రమైన బల్లికురవలోని వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ద్వారా గ్రూపు మహిళా సభ్యులకు పిల్లల్లో ఎదుగుదల, చక్కెర, నూనె అధికంగా వాడితే వచ్చే నష్టాల గురించి, ఐసీడీఎస్ సూపర్వైజర్ మీరాబి వివరించడం జరిగింది. దీనిలో భాగంగా వన్స్టాప్ సెంటర్ సఖి కేంద్రం గురించి, చైల్డ్ హెల్ప్లైన్ నంబర్, ఉమెన్ హెల్ప్లైన్ నంబర్ గురించి, అదే విధంగా సఖి సెంటర్లో లభించే సేవల గురించి వివరించడం జరిగింది. ఆరోగ్య సేవలు, తాత్కాలిక వసతి, న్యాయపరమైన సలహాలు, కౌన్సిలింగ్ సేవలు ఇలాంటివి మహిళలకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బందితో పాటు పొదుపు మహిళలు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మికులకు 12వ పిఆర్సి అమలు చేయాలి - సి.ఐ.టి.యు






**అద్దంకి, సెప్టెంబరు 18, ప్రభాతవార్త**
ముస్సిపల్ కార్మికులకు 12వ పి ఆర్ సి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన కార్యక్రమంలో భాగంగా అద్దంకి మున్సిపల్ ఆఫీస్ వద్ద కార్మికులు ధర్నా చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి తిరుపతి రెడ్డి తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం ఆరు నెలలు అవుతున్న మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని గత ప్రభుత్వ కాలంలో 17 రోజులు సమ్మె సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు సమ్మె శిబిరం దగ్గరికి వచ్చి మేము అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులు న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీలు ఇవ్వడం జరిగిందని అదే కాకుండా గత ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చినా హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మున్సిపల్ కార్మికులు న్యాయమైన డిమాండ్స్ పి ఆర్ సి అమలు చేయాలని కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని డైలీ కార్మికులను ఆప్కాస్ లో చేర్చాలని ఇంజనీర్ విభాగం కార్మికులు గత జులై లో జరిగిన సమ్మె కాలానికి వేతనాన్ని ఇవ్వాలని తమ డిమాండ్ల పరిష్కారం కోసం కార్మికులు సంవత్సరం కాలం నుండి దశలవారీగా ఆందోళన పోరాటాలు చేస్తున్నారని అయినను ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా శోచనీయమైన చర్యగా భావిస్తూ విధానాన్ని ఖండిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికులు న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం చేయడంలో చిత్తశుద్ధి చూపాలని లేనిపక్షంలో మరొకసారి మున్సిపల్ కార్మికుల ఆందోళన పోరాటాలను సవి చూడాల్సి వస్తుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరుగుతుంది. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి ఆదాం, ఉసురుపాటి శామ్యూల్, కోశాధికారి జ్యోతి వెంకటరావు, కమిటీ సభ్యులు జాన్, దాసరి వీరయ్య, ప్రసన్న, ఎం కోటేశ్వరరావు, జ్యోతి రాఘవయ్య, సీనియర్ కార్మికులు కృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## నల్లగుంట్ల గూడెంలో పొలంబడి




**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
పెద్దదోర్నాల మండలం నల్లగుంట్ల గూడెంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం జీఏపీ- పొలం బడి - కందిపంటలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.జవహర్లాల్ నాయక్ పాల్గొని రైతులకు రైతుల డైరీలు రాసుకొనే విధానంను, అలాగే వారం వారీగా కందిపంట లో చేసే పనులను, ఎరువుల వాడకం, పురుగు మందుల వాడకం, కషాయాల వాడకం, అంతర సేద్యం వాడకం అన్ని కూడా ఈ రైతు డైరీ నందు నమోదు చేయాలని తెలిపారు. అలాగే కంది పంటను సందర్శించి కంది కల్లెకు వచ్చే దశలో ఉంది కాబట్టి పై పాటుగా వేప గింజల కషాయం పిచికారి చేయాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వీఏఏ సీహెచ్ మాధురి పాల్గొన్నారు.

### ఆరోగ్యవంతమైన మహిళలే శక్తివంతమైన కుటుంబానికి సారధులు



**రాచర్ల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
ఆరోగ్యవంతమైన మహిళలే శక్తివంతమైన కుటుంబానికి సారధుల వుతారని మండల టిడిపి యువ నాయకుడు అంబవరం శ్రీనివాసరెడ్డి అన్నారు.స్వస్థ్ నారీ సశక్త్ పరివార అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ వారు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను గురువారం ఆయన అనుమలవీడు ప్రాథమిక వైద్యశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాలు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహిస్తారని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్యులు డా॥ కె రమేష్, సిబ్బంది వై రంగనాయకులు, జి రమేష్, ఎం.ప్రసాద్, రవీంద్రారెడ్డి, వీరాకుమారి, షమీమ్, లక్ష్మి శ్రీ, శివరామకృష్ణ, క్రాంతి కుమార్, స్థానిక సర్పంచ్ పల్నాటి లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ



**రాచర్ల, సెప్టెంబరు 18 ,ప్రభాతవార్త**
మండలంలోని జేపిచెరువు గ్రామంలో మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్ మహబూబ్ బాషా "ఆత్మ" ప్రకాశం ఆధ్వర్యంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి రైతులు మొగ్గు చూపాలని, ఈ వ్యవసాయంపై ముగ్గు చూపిస్తే వ్యవసాయ శాఖ ద్వారా శిక్షణ ఇస్తామని తెలిపారు. విత్తనశుద్ధి బీజామృతం చేసుకోవడం పురుగు ఉధృతి గమనించినప్పుడు ద్రవ బీజామృతం, ఘనజీవామృతం లాంటి కాషాయాలు రైతులు వాడి పురుగుమందు యొక్క పెట్టుబడి తగ్గించుకోవచ్చు అన్నారు. ఉద్యానవన శాఖ ద్వారా డ్రిప్పు స్లింకర్ ఇరిగేషన్ సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నేడు ఛలో మెడికల్ కాలేజీ కార్యక్రమం

**కొనకనమిట్ల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తున్నందుకు నిరసనగా ఈనెల 19న ఛలో మార్కాపురం మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వైఎస్సార్సీపీ కన్వీనర్ మోరా శంకర్రెడ్డి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు గిద్దలూరు,మాజీ ఎమ్మెల్యే, మార్కాపురంనియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇన్ఛార్జి అన్నా రాంబాబు పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో ఛలో మెడికల్ కాలేజీ పేరుతో మార్కాపురం మెడికల్ కాలేజీ దగ్గరకు శాంతియుతంగా పెద్ద ఎత్తున వెళ్ళి, వాస్తవ పరిస్థితులను మీడియా ద్వారా ప్రజలకు వివరించే కార్యక్రమం జరుగుతుందన్నారు. వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉదయం 9గంటలకు మార్కాపురం మెడికల్ కాలేజీ దగ్గరికి చేరుకోవాలని కోరారు.

## మండల స్థాయి ఎస్జీఎఫ్ ఎంపిక పోటీలు ప్రారంభం



**కొనకనమిట్ల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారుల ఎంపిక పోటీలు గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ-2 బరిగే నరసింహారావు నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. మండల స్థాయి బాలికా క్రీడాకారిణిల ఎంపిక పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. పోటీలో పాల్గొనే బాలికలను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గొట్లగట్టు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.ఆదినారాయణ, గ్రామ పెద్దలు పరిటాల సుబ్బయ్య, పొదిలి తిరుపతయ్య, మండల కోఆర్డినేటర్ ఉప్పుటూరి శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్గా కొల్లా నరేంద్ర

### - అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి



**మార్టూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
పర్చూరు కోర్టు భవనాల సముదాయ సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్(ఏజీపీ)గా కొల్లా నరేంద్ర కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పర్చూరు కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఏజీపీగా నియమితులైన కొల్లా నరేంద్రకుమార్ను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అభినందించారు.అలాగే పలువురు న్యాయవాదులు, ప్రముఖులు నరేంద్ర కుమార్కు శుభాకాంక్షలు తెలిపారు.

## ఎమ్మెల్యే విజయ్కుమార్కు అడ్వాన్స్గా శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ, జనసేన నేతలు



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
ఒంగోలులోని సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్కుమార్ కార్యాలయంలో గురువారం ఉదయం సంతనూతలపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు అలియాస్(బాబు) ఆధ్వర్యంలో జనసేన, టీడీపీ నేతలు అడ్వాన్స్గా ఎమ్మెల్యే విజయ్కుమార్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వీట్స్ పంపిణీ చేశారు.ఈ నెల 21వ తేదీన సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ పుట్టిన రోజులో భాగంగా ఎమ్మెల్యే విజయ్ కుమార్ అమరావతి అసెంబ్లీకి వెళ్తున్న సందర్భంగా ముందస్తుగా బాబు తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు 42వ డివిజన్ కార్పొరేటర్ నూకతోటి మస్తానమ్మ, ఈశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు కందుకూరు వాసు, మధు, చల్లా కృష్ణ, టీడీపీ నాయకులు పెసల శ్రీనివాసరావు, పి.బ్రహ్మయ్య, కైలా శ్రీనివాసరావు తదితరులు ఎమ్మెల్యే విజయ్ కుమార్కు అడ్వాన్స్గా ఈ సందర్భంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## ఎంపీడీఓ పదోన్నతిపై రమణమ్మకు ఘన సత్కారం



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
సంతనూతలపాడు డిప్యూటీ ఎంపీడీవో ఎంవీ రమణమ్మ నెల్లూరు రూరల్ ఎంపీడీవోగా పదోన్నతి పట్ల గురువారం నాడు సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డీఎస్వీ ప్రసాద్ తదితరులు ఆధ్వర్యంలో రమణమ్మను ఘనంగా సత్కరించారు.సంవత్సర కాలంపాటు సంతనూతలపాడు డిప్యూటీ ఎంపీడీవోగా రమణమ్మ పని చేశారు. నెల్లూరు సీఈవో మోహన్, రమణమ్మను నెల్లూరురూరల్ ఎంపీడీవోగా నియమిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ, మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, జడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, మండలపరిషత్ ఏవో శారద,సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి,మండల పంచాయతీ కార్యదర్శుల సంఘంఅధ్యక్షులు ఎన్.ప్రతాప్కుమార్,గుమ్మలం పాడు టీడీపీ అధ్యక్షులు బొడ్డపాటి చంద్రశేఖర్, మండల పరిషత్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

### కిషోర బాలికలకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో టూత్బ్రెష్లు, పేస్టులు పంపిణీ



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
సంతనూతలపాడు ప్రభుత్వ హాస్పిటల్లో గురువారం నాడు కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నిర్వహించిన మెగా మెడికల్ వైద్య శిబిరంలో సంతనూతలపాడు వాసవిక్లబ్, మహిళా క్లబ్ ఆధ్వర్యంలో దాత ఒంగోలుకు చెందిన పబ్బిశెట్టి ఆంజనేయులు అందించిన వందమంది కిషోర బాలికలకు టూత్బ్రెష్లు, పేస్టులు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు, వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాది చంద్రావతిలు ఈ సందర్భంగా కిషోర బాలికలకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ బి.సుధామణి, ఎంపీడీవో డీఎస్వీ ప్రసాద్, ఎంపీపీ బుడంగుంట విజయ, జడ్పీటీసీ దుంపా రమణమ్మ, సంతనూతలపాడు సర్పచర్ దర్శి నాగమణి, వైద్యులు నాగరాజు, శ్రీధర్, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ కరుణాకరరావు, సీహెచ్ఓ మాధవరావు, వాసవి క్లబ్ సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, కోశాధికారి పామిడి సుధాకర్, వాసవి మహిళా క్లబ్ సెక్రటరీ శిఖాకొల్లి జయశ్రీ, కోశాధికారి జి.శ్రీలక్ష్మి, కిషోర బాలికలు, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

### బ్యాంకు ఖాతాదారులందరూ తప్పనిసరిగా కేవైసీ రెన్యువల్ చేయించుకోవాలి

#### - కెనరా బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్





**సంతనూతలపాడు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
కెనరా బ్యాంకు ఖాతాలు ఉన్న ప్రతి ఒక్కరూ కేవైసీ తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని కెనరా బ్యాంకు బెంగుళూరు హెడ్ ఆఫీసర్ చీఫ్ జనరల్ మేనేజర్ బి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం నాడు జరిగిన స్థానిక కెనరా బ్యాంకు పర్యవేక్షణలో డ్వాక్రా మహిళలకు ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేసి అనంతరం ప్రసంగించారు.ఈ కార్యక్రమానికి సంతనూతలపాడు కెనరా బ్యాంకు సీనియర్ బ్రాంచ్ మేనేజర్ జే.ఆనంద్కుమార్ అధ్యక్షత వహించగా కార్యక్రమాన్ని మండల వెలుగు ఏపీఎం టి.బాబురావు పర్యవేక్షించారు. భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీవన జ్యోతి భీమాయోజన,జీవన సురక్షభీమా యోజన ఇన్సూరెన్స్ పథకాలను ఖాతాదారులు సద్వినియోగపరుచుకోవాలని చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ కోరారు. డ్వాక్రా మహిళలందరూ బ్యాంకుల్లో తప్పనిసరిగా ఖాతాలు కలిగి ఉండాలన్నారు. ఖాతాలు లేని వారు బ్యాంకులో అకౌంట్ ఓపెన్ చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు పురోభివృద్ధికి ఎస్హెచ్జీ సభ్యులు పాటుపడాలన్నారు. సంతనూతలపాడు కెనరా బ్యాంకు పర్యవేక్షణలో 250 కోట్ల రూపాయలు మేరకు లావాదేవీలు జరుగుతున్నట్లు చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ వెల్లడించారు. వీటిలో 189 కోట్ల రూపాయల మేరకు వివిధ రుణాలు, 70 కోట్ల రూపాయలు మేరకు డిపాజిట్లు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.ప్రతి ఒక్క ఎస్హెచ్జీ గ్రూపు సభ్యురాలు బ్యాంకు నందు తీసుకున్న రుణాలను సద్వినియోగపరుచుకొని మీ జీవనోపాధిని పెంపొందించుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ఖాతాదారులు సద్వినియోగపరుచుకోవాలని ఆయన కోరారు. డ్వాక్రా మహిళలు రుణాలకు సంబంధించి చెల్లింపులకు రద్దీని పురస్కరించుకుని ఎస్హెచ్జీ సభ్యులు కోరిక మేరకు బ్యాంకు నందు రెండవ క్యాష్ కౌంటర్ ఏర్పాటుకు చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ కెనరా బ్యాంకు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మొదట కెనరాబ్యాంకు ఫౌండర్, ఏ.సుబ్బరాయి చిత్రపటానికి చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ పూలమాలలు వేసి జ్యోతిప్రజ్వలన గావించారు.ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎంపీడీవో డీఎస్వీ ప్రసాద్, కెనరా బ్యాంకు జిల్లా ఏజీఎం భీమా రాఘవేంద్ర, జిల్లా లీడ్ డిస్టిక్ మేనేజర్ రమేష్, జిల్లా రూడ్సెట్ డైరక్టర్ శ్రీనివాస్రెడ్డి, డివిజనల్ మేనేజర్లు లీలా ప్రతాప్, రమేష్, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు పి.మేరిమ్మ, ఆర్థిక అక్షరాస్యత జిల్లా కోఆర్డినేటర్ బి.శ్రీను, చీమకుర్తి కౌన్సిలర్ ఏ.చిన్న రాజు,సీసీలు, సీహెచ్ శ్రీనివాసులు, చెంచులక్ష్మి, వి.శ్రీనివాసులు, వీవోఏలు మాధవి, పద్మ, కృష్ణవేణి, అనూష,రమ్యశ్రీ, అపర్ణ,సుభాషిణి, సంగీత లక్ష్మి, ఎస్హెచ్జీ సభ్యులు పాల్గొన్నారు. జిల్లా రూడ్సెట్ ద్వారా నిరుద్యోగ మహిళలు తయారు చేసిన వివిధ వస్తువుల స్టాల్ను ఈ సందర్భంగా ప్రదర్శించారు.

## మెగా వైద్య శిబిరంలో 250 మందికి చికిత్సలు

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
స్వస్తవారి సశక్తి పరివార్ అభియాన్ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంతనూతలపాడు ప్రభుత్వ హాస్పిటల్ నందు గురువారం నానడు నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 250 మంది రోగులకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ మెగా వైద్య శిబిరాన్ని మొదట సంతనూతలపాడు ఎంపీపీ బుడంగుంట విజయ ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేశారు. సంతనూతలపాడు ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ ఏ.కరుణాకర్ రావు ఆధ్వర్యంలో ఈ ప్రాంగణంలో మరొక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రోగులకు మెడికల్ ఆఫీసర్ బి.సుధామణి, వైద్యులు నాగరాజు, శ్రీధర్, కరుణాకర్రావు ఆధ్వర్యంలో చికిత్సలు అందించారు. జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథ ఈ మెగా వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్ను జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథ ఆవిష్కరించారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే వారి కుటుంబాలు కూడా మరింత ఆరోగ్యంగా ఉండనున్నట్లు నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథ పేర్కొన్నారు.వైద్య సిబ్బంది ఇందుకు సంబంధించి అనారోగ్య మహిళలను గుర్తించి వారికి వైద్య సేవలు అందించాలన్నారు. క్యాన్సర్ నివారణ చర్యలకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. ఐసీడీఎస్ సంతనూతలపాడు సూపర్వైజర్ సావిత్రి ఆధ్వర్యంలో అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్ను జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ భగీరథ పరిశీలించారు. సంతనూతలపాడు వాసవి క్లబ్, వాసవి మహిళా క్లబ్ ఆధ్వర్యంలో కిషోర్ బాలికలకు పేస్టులు, బ్రషలు, బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డీఎస్వీ ప్రసాద్, జడ్పీటీసీ దుంపా రమణమ్మ, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, సీహెచ్ఓ మాధవరావు, పీహెచ్ఎన్ వీరమ్మ, వైద్యశాఖ ప్రతినిధులు ప్రభావతి, కృష్ణ, వెంకటేశ్వరరావు,వినోద్,మేరీ కుమారి, సంతనూతలపాడు వాసవి మహిళా క్లబ్ అధ్యక్షురాలు చలువాదిచంద్రావతి,అంగన్వాడీ కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

7_7.qxd 9/19/2025 12:33 AM Page 1



## ఏజీపి రామకోటయ్యకు అభినందనలు తెలిపిన ఉపాధ్యాయులు




**అద్దంకి రూరల్ , సెప్టెంబరు 18,(ప్రభాతవార్త)**
ఏజీపి రామకోటయ్యకు ధర్మవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొమ్మనాబోయిన నాగరాజు రాంపురం ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు బి.వి సుబ్బురాజు అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బత్తుల రామకోటయ్య సీనియర్ లాయర్‌గా బాపట్ల జిల్లా టిడిపి లీగల్‌సెల్ అధ్యక్షుడిగా పనిచేసి న్యాయవాది వృత్తిలో ఎంతోమంది పేదలకులకు ఫీజు లేకుండా అలాగే తక్కువ ఫీజులతో ఎన్నో కేసులూ వాదించి అందరి చేత మంచిలాయర్‌గా పేరు తెచ్చుకున్న ప్రజా న్యాయవాది అన్నారు. బహుజనుల పట్ల సామాజిక బాధ్యత తెలిసిన సీనియర్ న్యాయవాది మన బత్తుల.రామ కోటయ్య గారు అద్దంకి ఏజీపీ గా నియమితులైన సందర్భంగా బల్లికురవ మండలం ఎస్ఎల్ గుడిపాడు సర్పంచ్ వసాల నాగేశ్వరరావు మరియు వాడు నెంబర్ జ్యోతి ప్రభుదాసు, బోరుబోయిన వీర రాఘవులు దూళిపాళ్ల బ్రహ్మయ్య పలువురు వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు వారు వ్యక్తిగతంగా మరియు స్నేహపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.రామకోటయ్యకు ఏజీపీ పదవి ఇవ్వడం ఆ పదవికే వన్నెతెచ్చినట్లు అయిందని ఇలాంటి వారిని ప్రోత్సహించడం మంచి పరిణామం అని రామకోటయ్య భవిష్యత్తులో ఇంకా ఉన్నత పదవులను అలంకరించాలనికోరుకుంటున్నామని అన్నారు.ఉపాధ్యాయులు బొమ్మనాబోయిన నాగరాజు,సుబ్బరాజు ఎం.సూర్యప్రకాశ్ అద్దంకిలోని ఏజీపిబత్తుల రామకోటయ్య నివాసంలో కలిసి దుశ్శాలువ పూలమాల బోకేతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.ఇందుకు సహకరించిన అద్దంకి నియోజకవర్గ శాసనసభ్యులు రాష్ట్రవిద్యుత్‌శాఖామాత్యులుగొట్టిపాటి రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు .

## బాల్యవివాహాల నిరోధక చట్ట విరుద్ధం

### - సంతమాగులూరు సీడీపీఓ సుధ



**సంతమాగులూరు, సెప్టెంబరు 18,(ప్రభాతవార్త)**
సాంకేతికపరిజ్ఞానం శరవేగంగా దూసుకుపోతున్న నేటి పరిస్థితుల్లో కూడా బాల్యవివాహాలు జరగడం చట్ట విరుద్ధమని సంతమాగులూరు ఐసీడీఎస్ సీడీపీఓ డి.సుధ పేర్కొన్నారు.సంతమాగులూరు వెలుగు కార్యాలయంలో బుధవారం వీఓల సమావేశంలో 'బేటీ బచావో బేటీ పడావో' అనే కార్యక్రమం గురించి సిడిపిఓ డి.సుధా అవగాహన కల్పించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణచట్టం, సుకన్య సమృద్ధి యోజన పథకం, బాలిక విద్య ప్రాముఖ్యత పోషణకు సంబంధించిన అంశాల గురించి అవగాహన కల్పించడం జరిగినది.సమావేశ అనంతరం బాల్యవివాహాల నిరోధకచట్టం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం హనుమంతరావు,జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు నాగబోతు సుజాత, ఐసీడీఎస్ సూపర్వైజర్స్ ఎం.సుప్రజారాణి, జె.ప్రమీల, బ్లాక్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బి.ఉమా పాల్గొన్నారు.

## ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేటు పరం చేయడం దుర్మార్గం

### - అద్దంకి వైసీపీ ఇన్‌చార్జి అశోక్‌కుమార్

### - నేడు బాపట్లలో జరుగు ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు



**అద్దంకి రూరల్ ,సెప్టెంబరు 18,(ప్రభాతవార్త)**
ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రవేటు పరం చేయడం కూటమి ప్రభుత్వ దుర్మార్గమైన చర్యలని అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చింతలపూడి అశోక్ కుమార్ అన్నారు. వైసీపీ పాలనలో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమాజ సమగ్రాభివృద్ధికి విద్య, వైద్యం కీలకమని పేదలు ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలంటే సంక్షేమపథకాలు ఒక వైపు, విద్య,వైద్యానికి అధిక ప్రాధాన్యత నిచ్చారన్నారు. అందులో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగారాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేయించడంతో పాటు 7 మెడికల్ కళాశాలలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చారన్నారు.మరో పది మెడికల్ కళాశాలల నిర్మాణంలో వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలన్నా , పేద విద్యార్ధులు డాక్టర్ కావాలన్నా మెడికల్ కళాశాలలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలన్నారు. అటువంటిది కూటమి ప్రభుత్వం దుర్మార్గమైన ఆలోచనతో ప్రవేటు పరం చేసేందుకు రావడం దుర్మార్గమైన చర్య అన్నారు.అటువంటి ప్రజా వ్యతిరేక చర్యలను రాష్ట్ర వ్యాప్తంగా ఐక్యంగా పోరాడి ఎదుర్కోవాలన్నారు.

**ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజవంతం చేయాలి**
రాష్ట్రంలో కాలేజీల ప్రైవేటీకరణకు ప్రభుత్వ చర్యలకు నిరసనగా వైఎస్‌ఆర్‌సీపీ గురువారంబాపట్ల జిల్లా కేంద్రంలో బాపట్ల మెడికల్ కళాశాల వద్ద ఉదయం 9 గంటలకు చేపట్టిన ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గం నుండి సమాజ హితం కోరే వారందరూ పాల్గొని ప్రభుత్వ చర్యలను ప్రజలలో ఉన్న వ్యతిరేకతను చాటాలన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసీపీ పార్టీ శ్రేణులు ,యువకులు విద్యార్ధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అద్దంకి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చింతలపూడి అశోక్ కుమార్ పిలుపునిచ్చారు.

## శబరిమల యాత్ర తిరుగు ప్రయాణంలో గుండెపోటుతో పత్తేపురం వాసి వినాల సాంబయ్య కన్నుమూత



**సంతమాగులూరు , సెప్టెంబరు 18,(ప్రభాతవార్త)**
శబరిమల యాత్ర తిరుగు ప్రయాణంలో గుండెపోటుతో పత్తేపురం వాసి వినాల సాంబయ్య (63) కన్నుమూశారు. సంతమాగులూరు మండలం పత్తేపురం గ్రామానికి చెందిన వినాల సాంబయ్య తన స్నేహితుడు కొప్పరం గ్రామానికి చెందిన పోలిరెడ్డి ఇరువురు అయ్యప్ప మాల ధరించి దీక్ష పూర్తి చేసుకుని ఈనెల 14న శబరిమల వెళ్లారు. మరుసటి రోజు అయ్యప్ప స్వామి దర్శనం పూర్తి చేసుకుని రైలులో తిరుగు ప్రయాణం ప్రారంభించారు. రైలులో తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి చేరుకునే సరికి సాంబయ్యకు అకస్మాత్తుగా గుండె పోటు రావడంతో రైల్వే సిబ్బంది సహకారంతో తిరుచ్చి వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందే సమయంలో మరోమారు గుండె పోటు తీవ్రంగా రావడంతో సాంబయ్య తుదిశ్వాసవిడిచారు.మృతుడు సాంబయ్య నలుగురు సోదరులలో పెద్దవాడు. సాంబయ్య కు ఇద్దరు కుమార్తెలు భార్య ఉన్నారు. అందరితో మంచి వ్యక్తిగా ఉండే సాంబయ్య మృతితో పత్తేపురం లో విషాదం నెలకొంది. సాంబయ్య మృతదేహానికి స్వగ్రామానికి శుక్రవారానికి తీసుకు వచ్చి అంతిమ సంస్కారాలు పూర్తి చేయనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## బోయలపల్లిలో ప్రారంభమైన మండలస్థాయి క్రీడలు



**యర్రగొండపాలెం,సెప్టెంబర్18,(ప్రభాతవార్త)**
యర్రగొండపాలెం మండలంలోని బోయలపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం క్రీడాపోటీలు నిర్వహించారు.ప్రధానోపాధ్యాయులు హేమ్లానాయక్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిధిగా గ్రామ సర్పంచ్,కోయయ్య,మండల విద్యాశాఖాధికారి పి.ఆంజనేయులు,హాజరైనారు.ఈ సందర్భంగా యంఇవో మాట్లాడుతూ క్రీడలు శారీరక వికాసానికి, మానసికోల్లాసానికి ఎంతో దోహదం చేస్తాయన్నారు. పాఠశాల ప్రతి విద్యార్ధి క్రీడాపోటీల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.విద్యార్థులు మండలస్థాయి నుంచి జిల్లాస్థాయిలో రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలని మండలానికి మంచి పేరు ప్రతిష్టలు రావాలని ఆయన ఆకాంక్షించారు.సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆటలపోటీల్లో గెలుపు ఓటమి రెండు సమానంగా స్వీకరించాలని,ఎటువంటి గొడవలు జరుగకుండ స్నేహపూర్వకంగా ఆటలు ఆడాలని ఆయన విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో యంఇవో2 మల్లునాయక్,పి.ఈటీలు మత్తయ్య, రాజు,వెంకటేశ్వర్లు,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ గురుదత్త విద్యార్థులు నృత్య పోటీల్లో రాణింపు



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 18, (ప్రభాతవార్త)**
సంతనూతలపాడు మండలం పేర్నమిట్ట పరిధిలోని శ్రీ ప్రతిభ విద్యాసంస్థల ప్రాంగణంలో గల శ్రీ గురుదత్త హైస్కూల్ 9వ తరగతి విద్యార్థినులు భాను బృందం జేసీఐ ఒంగోలు వారు నిర్వహించిన అంతర్ పాఠశాలల పోటాత్మక నృత్య పోటీలలో ద్వితీయ బహుమతి సాధించి విశేష ప్రతిభనుచాటారు.ఈ సందర్భంగా గురుదత్త హైస్కూల్లో గురువారం నాడు జరిగిన అభినందన కార్యక్రమంలో వారి కృషి,ప్రతిభకు శ్రీ ప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు,వైస్‌చైర్మన్ శ్రీ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ శ్రీ నల్లూరి జయప్రకాశ్ నారాయణ్ ప్రిన్సిపాల్ జి. శ్రీదేవి తదితరులు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ లు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుని కలిసిన కూరాకు వెంకట్



**హనుమంతునిపాడు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండల టీడీపీ నాయకులు కూరాకు ఫైనాన్స్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరక్టర్ కూరాకు వెంకట్ ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు యాదవ్‌ని గురువారం తాడేపల్లిలోని వారి గృహం నందు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కూరాకు వెంకట్‌ని ఆయన అభినందించారు.

## గూడూరు జయన్న మృతికి సీపీఎం సంతాపం



**హనుమంతునిపాడు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
హనుమంతునిపాడు మండలం దాసల్లపల్లి గ్రామ సీపీఎం పార్టీ శాఖ సభ్యులు గూడూరు జయన్న అనారోగ్య కారణంగా మృతి చెందడంతో ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లు నివాళులర్పించారు. మృతదేహంపై పార్టీ పతాకాన్ని ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కామ్రేడ్ జయన్న 2005 నుండి పార్టీ ప్రజా సంఘాలతో సంబంధాలు కలిగి ఉన్నాడని తెలిపారు. మండల కేంద్రంలో జరిగే అనేక ఉద్యమాలు పోరాటాల్లో పార్టీ పిలుపుల్లో ప్రజా సంఘాల కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారు అని స్థానిక శాఖ ఏర్పాటుకు నిర్మాణానికి సహకరించారని తెలిపారు. గత కొంత కాలంగా సోయాసిస్ లాంటి చర్మానికి సంబంధించిన వ్యాధితో బాధపడుతూ ఉన్నాడని అలాంటి బాధల్లో కూడా తన ఆరోగ్యం భాగా లేకపోయినా పార్టీ కార్యక్రమాలను అడిగి తెలుసుకునే వాడని నేను మరణించేంతవరకు పార్టీ సభ్యుడుగానే కొనసాగుతానని అనారోగ్యం పేరుతో తన సభ్యత్వాన్ని రద్దు చేయొద్దని పార్టీపై తనకున్న ప్రేమను వ్యక్తపరిచిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వీరి మరణం స్థానిక ఉద్యమానికి లోటుగా వర్ణించారు. జయన్నకు నలుగురు అమ్మాయిలు నలుగురు అబ్బాయిలు మొత్తం 8 మంది సంతానం కలిగి ఉన్నారు. అందరికి వివాహాలై వారి కుటుంబాలతో స్థిరపడి ఉన్నారు. వీరి సతీమణి మరియమ్మకు కుటుంబ సభ్యులకు పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో గూడూరు కొండయ్య, చిన్న దానియేలు, వెంకటేశ్వర్లు, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక విప్లవానికి జీఎస్టీ సంస్కరణలు దోహదం

### - ప్రజలకు ఆర్థిక ప్రగతికి లాభదాయకం

### - వైద్య, వ్యవసాయ విద్యా రంగాలకు ఊతం

### - పరిశ్రమల అభివృద్దే ప్రభుత్వాల లక్ష్యం

### - సీఎం బాబు సుస్థిర నాయకత్వంతో పరిశ్రమల వరద

### - అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే ఏలూరి




**మార్టూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
భారతదేశ ఆర్థిక విప్లవానికి నూతన జీఎస్టీ సంస్కరణలు అద్భుతంగా దోహద పడతాయని, ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక సంస్కరణలకు ప్రజలకు, ఆర్థిక ప్రగతికి నాంది పలుకుతుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశం సందర్భంగా ఆయన జీఎస్టీ నూతన సంస్కరణలపై సుధీర్ఘంగా ప్రసంగించారు. నూతన సంస్కరణలతో ప్రజలు, పరిశ్రమలకు, ఆర్థిక వ్యవస్థ పురోగతికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నూతన సంస్కరణలతో పేద మధ్య తరగతి ప్రజలకు పన్నుల భారంలో వెసులుబాటు కలుగుతుందన్నారు. వైద్యం, విద్య, వ్యవసాయ, పరిశ్రమలు రంగాలకు ప్రభుత్వాలు ఊతం ఇచ్చాయన్నారు. నూతన సంస్కరణలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రస్తుతం కొంత భారమైనప్పటికి భవిష్యత్తులో మేలు జరుగుతుందన్నారు. 2017లో మొదలైన జీఎస్టీ విప్లవం ఒక దేశం ఒకే పన్ను విదానం ద్వారా గతంలో అస్తవ్యస్తంగా ఉన్న పన్నులు విధానాన్ని సరి చేసి దాదాపు 17 రకాల టాక్స్ మరో ఆరు రకాల సెజ్‌లు ఎత్తివేసి ఒకే పన్ను విధానాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. గతంలో ఉన్న ఐదు స్లాబ్ లను రెండు స్లాబుల్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. 2018లో భారతదేశ జీఎస్టీ ఆదాయం 7 లక్షల కోట్లు ఉంటే 2020 నాటికి 12 లక్షలు కోట్లు అయిందన్నారు. తర్వాత ఎట్లా 2024 -25 సంవత్సరానికి డబుల్ 24 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. గతంలో 65 లక్షల మంది మాత్రమే జీఎస్టీ పరిధిలో ఉన్నారని విస్తృతమైన సరళీకృత విధానం వల్ల జెస్టీ పరిధిలోకి కోటిన్నర లక్షల మంది గత ఏడాది వచ్చారన్నారు. ప్రభుత్వాలు సాధారణంగా ఎన్నికల ముందు కానీ, ప్రభుత్వాలు పన్నులు తగ్గిస్తాయని హామీలుస్తుంటాయని, అధికారంలోకి వచ్చిన ఏడాది తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధానాలను పటిష్టంగా అమలు చేసేందుకు నూతన జీఎస్టీ పాలసీకి రూపకల్పన చేశాయన్నారు. ఇది ఒక గొప్ప చారిత్రాత్మక సంస్కరణలకు నాంది అన్నారు. పేద, మధ్య తరగతి వర్గాలకు ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించేందుకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హెల్త్ ఇన్సూరెన్స్, రైతాంగానికి వ్యవసాయ ఉపకరణాలు పనిముట్లు తక్కువ ధరకు లభ్యం కానున్నాయన్నారు. నాచురల్ ఫార్మింగ్ దిశగా బయో పెస్టిసైడ్స్ వినియోగం ఆర్గానిక్ వినియోగం పెరిగేలా, ప్రతి ఒక్కరికి విద్య అందుబాటులోకి వచ్చేలా విద్యా వనరులను సమకూరుస్తూ తక్కువ ధరకు వస్తువులు అందేలా ఒక నిర్దిష్ట లక్ష్యంతో ముందుకు వెళ్తూ జీఎస్టీలో సడలింపులు చేశారని పేర్కొన్నారు. దీనిలో భాగంగా పన్నెండు శాంతం స్లాబ్‌లో ఉన్న 99 శాతం వస్తువులు ఐదు శాతం స్లాబ్‌లోకి వచ్చాయన్నారు. అలాగే గతంలో 28 శాతం స్లాబ్‌లో ఉన్న 90 రకాల వస్తువులు ఈ రోజు 18 శాతం స్లాబ్‌లోకి వచ్చాయని ఎమ్మెల్యే ఏలూరి వివరించారు. ఉదాహరణకు వైద్య రంగంలో 12 శాతం స్లాబ్‌లో ఉన్న అన్ని రకాల డ్రగ్స్ ఐదు శాతం స్లాబ్‌లోకి తీసుకువచ్చారని ఇందులో 33 లైఫ్ సేవింగ్ డ్రగ్స్ 12 శాతం స్లాబ్‌లో ఉంటే ఈ రోజు వాటిని జీరో టాక్స్ పరిధిలోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఐదు శాతం టాక్సు విధించే మూడు రకాల లైఫ్ సేవింగ్ డ్రగ్స్ ఉదాహరణకు క్యాన్సర్ జబ్బులకు వాడే మందులను జీరో టాక్స్‌లోకి తీసుకువచ్చారని ఇది చారిత్రాత్మక నిర్ణయం అని ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. 18 శాతం స్లాబులో ఉన్న మెడికల్ సర్జికల్ ఎక్విప్మెంట్, వెటర్నరీ మందులు హ్యూమన్ ఎనాలసిస్ పరకిరాలు ఐదు శాతం స్లాబ్‌లోకి వచ్చాయన్నారు. దీర్ఘకాలిక లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని అన్ని రంగాలకు ఊతమిచ్చేలా గ్రోత్ పెంచాలనే తపనతో ప్రభుత్వాలకు భారమైన సంస్కరణలు అమలు చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థ సుస్థిర నాయకత్వంతో రాష్ట్రానికి పెట్టుబడుల వరద వస్తుందని పేర్కొన్నారు. అలాగే యువనేత మంత్రి నారా లోకేష్ ఏడాది కాలంలోనే 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆకర్షించేలా కృషి చేశారన్నారు. 25 లక్షల ఉద్యోగ కల్పన ధ్యేయంగా ముందుకు వెళ్తున్నారన్నారు. ఈ నూతన జీఎస్టీ రిఫార్మ్స్‌ను సక్రమంగా వినియోగిస్తే రాష్ట్రానికి అద్భుతమైన వనరులు సృష్టించే అవకాశం ఉందన్నారు. ప్రాధాన్యత క్రమంలో రెన్యువబుల్ ఎనర్జీ 18 12 శాతాన్ని ఐదు శాతంలోకి తీసుకురావడం ద్వారా వినియోగంలోకి తీసుకురావడం విస్తృత పరచడం ద్వారా పరిశ్రమలు పెద్ద ఎత్తునఅభివృద్ధి చెందడానికి ప్రభుత్వ లక్ష్యంజీరో ఎనర్జీ దిశగా నడిపేందుకు ఉపయోగపడుతుందన్నారు.

## ఏపీ రైతు సంఘం మహాసభలను జయప్రదం చేయండి

### - రైతు సంఘం నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి




**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మూడవ మండల మహాసభలు 20వ తేదీ శనివారం దోర్నాల పట్టణంలోని శ్రీశైలం రోడ్డులో గల శివసదనం ఆవరణలో జరుగుతున్నట్లు రైతు సంఘం జిల్లా నాయకులు దగ్గుపాటి సోమయ్య తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుండి రైతులు అధిక సంఖ్య లో పాల్గొని మండల మహా సభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. వెలుగొండ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి మొదటి సొరంగం ద్వారా నీరు విడుదల చేయాలని, రైతుల ఆన్‌లైన్ సమస్యలు ప్రభుత్వ అధికారులు స్పందించి పరిష్కారం చేయాలని, యూరియా రైతులకు అందుబాటులో ఉంచాలని, తదితర సమస్యలపై మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. దోర్నాల పట్టణంలోని సీఐటీయు కార్యాలయంలో గురువారం రైతు సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహాసభల జయప్రదానికి కార్యకర్తల కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో రైతు సంఘం డివిజన్ నాయకులు దుగ్గెంపూడి తిరుపతిరెడ్డి, రైతు సంఘం మార్కాపురం మండల కార్యదర్శి గంగిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, సీఐటీయు మండల నాయకులు పిచ్చయ్యలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం బాగుంటుంది



**తాళ్లూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని ఎంపీడీఓ సానికొమ్ము సత్యం,పీహెచ్‌సీ వైద్యాధికారిణి కావలి మౌనికలు పేర్కొన్నారు. తూర్పు గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాన్ని ఎంపీడీఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళ ఆరోగ్య పరిరక్షణ, బాల్య వివాహాలు అరికట్టుట, చిన్న వయసులో గర్భధారణ వలన అనార్థలు, మహిళలు వయస్సును బట్టి చేయించుకోవాల్సిన పరీక్షలు, వయోవృద్దుల సంరక్షణ వంటి వివరాలను తెలియజేశారు. వైద్యాధికారిణి మౌనిక మాట్లాడుతూ బాలికలు, మహిళలకు వచ్చే ఆరోగ్య సమస్యలను సకాలంలో గుర్తించి నయం చేసేందుకుఈ వైద్య శిబిరాలు దోహదపడతాయని చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలందరూ తప్పనిసరిగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు మహిళలు అశ్రద్ద వీడి సకాలంలో వైద్య సేవలు పొందాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని చెప్పారు. అనంతరం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ సీహెచ్ శ్రీకాంత్‌రెడ్డి, చీమకుర్తి సీహెచ్‌సీ వైద్యులు వేణుగోపాల్‌రెడ్డి, శ్వేత, సొసైటీ చైర్మన్ వల్లభనేని సుబ్బయ్య, డిప్యూటీ ఎంపీడీఓ దేవరకొండ మల్లేశ్వరి, హెచ్ఈఓ చంద్రశేఖర్‌బాబు, గ్రామస్తులు మీరా మొహిద్దిన్, గూడా పుల్లారెడ్డి, సోము సుబ్బారావు, బొద్దుల శ్రీను, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్వస్త్ నారీ సడక్ యోజన అభియాన్ కార్యక్రమం




**బేస్తవారిపేట, సెప్టెంబరు 18 ప్రభాతవార్త**
బెస్తవారిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీల ఆధ్వర్యంలో స్థానిక ఇస్లాంపేట లోని అంగన్ వాడీ కేంద్రంలో గురువారం (స్వస్తనారిసడక్‌యోజన పరివార్) ఆరోగ్యవంత మైన మహిళ శక్తివంతమైన కుటుంబం అనే ఈ కార్యక్రమాన్ని స్థానిక వైద్యాధికారి టీ కావ్య,స్థానిక సిడిపిఓ కె కుమారిఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 2వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా బెస్తవారిపేట ప్రాంతంలోని అనేక మహిళలు వచ్చి వారి ఆరోగ్యసమస్యల నిమిత్తమైవైద్యుల దగ్గర పరీక్షించుకోవడం జరుగుతుందన్నారు. ప్రత్యేకంగా మహిళల్లో బిపి, షుగర్, హెచ్ బి పరీక్షలు నిర్వహించడం జరిగిందని, అనంతరం మహిళలలో వస్తున్న బ్రెస్ట్ సర్వేకల్ క్యాన్సర్‌లపై ప్రత్యేక అవగాహన కలిగించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారి టి కావ్య, సిడిపిఓ కె కుమారి, సిహెచ్ఓ జే తులసి ప్రసాద్‌రావు, హెల్త్ సూపర్వైజర్ కే కళావతి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొనారు.

## క్రీడలు శారీరక దారుడ్యానికి దోహదపడతాయి

### - ఎంఈఓలు ఎన్ మధుసూధన్ రెడ్డి, సివి రమణారెడ్డి




**బేస్తవారిపేట, సెప్టెంబరు 18, ప్రభాతవార్త**
క్రీడలు మానసిక వికాసంతోపాటు శారీరక దారుడ్యానికి దోహదపడతాయని విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలని ఎంఈఓలు ఎన్ మధుసూదనరెడ్డి, సీవీ రమణారెడ్డిలు పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపొటములను సమానంగా స్వీకరించాలన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులను డివిజన్ స్థాయికి, డివిజన్‌స్థాయిలో ప్రతిభ కనపరిచిన విద్యార్థుల ను జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు మండల పరిధిలోని వివిధ పాఠశాలల నుండి 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారని తెలిపారు. బాలికల కబడ్డీ పోటీలోకొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినిలు సత్తా చాటగా, బాలుర విభాగంలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, వాలీబాల్ పోటీలో పిటికాయగుల్ల విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. శ్రీదేవి, పలు పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో లేఅవుట్లను సందర్శించిన పిడి శ్రీనివాస ప్రసాద్



**కంభం, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
గిద్దలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలలో గల లేఅవుట్లను గురువారం గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీనివాసప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా గృహనిర్మాణ లబ్ధిదారులతో కలిసి వివిధ నిర్మాణ దశలలో ఉన్న గృహాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.కంభం మండలంలోని చిన్న కంభం లేఅవుట్, కొమరోలు మండలంలోని రాజుపాలెం లేఅవుట్, గిద్దలూరు లోని నరవ లేఅవుట్‌లను పరిశీలించారు. ముందుగా పలు గ్రామాల్లో నిర్మాణ దశలో ఉన్న వివిధ గృహాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆరు మండలాల అసిస్టెంట్ ఇంజనీర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశపు హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. సకాలంలో లబ్దారులకు సిమెంట్ ఇనుము ఇసుక పంపిణీ చేయాలని తెలిపారు. డిసెంబర్‌లోగా అన్ని ఇళ్లను పూర్తిచేసేలా ప్రాణాలికల సిద్ధం చేసుకోవాలని తెలిపారు. మార్చి తర్వాత నిధులు ఆగిపోతాయని కావున గృహాలను త్వరగా పూర్తి చేసుకునేలా చూడాలన్నారు. పిడి శ్రీనివాస ప్రసాద్ వెంట మార్కాపురం ఈఈ పవన్ కుమార్, గిద్దలూరు గృహనిర్మాణశాఖ డిఈ ఖాదీర్ బాషా, కంభం ఎంపీడీవో వీరభద్రాచారి, 6 మండలాల ఏఈలు, వర్క్ ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

## క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చు

### - ఆదర్శ పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ బి.సతీష్



**రాచర్ల, సెప్టెంబరు 18, ప్రభాతవార్త**
క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని, శారీరక దారుడ్యాన్ని పొందవచ్చని ఆదర్శ పాఠశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ బి సతీష్ అన్నారు. మండల కేంద్రమైన రాచర్లలోని ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్, సెలక్షన్ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం రాచర్ల జడ్పీహెచ్ఎస్‌లో ప్రారంభమైన స్కూల్ గేమ్స్ రాచర్ల ఆదర్శ పాఠశాల ఆవరణలో రెండో రోజు కొనసాగాయని తెలిపారు. రెండో రోజు ఖోఖో, కబడ్డీ, రన్నింగ్, షాట్ పుట్ గేమ్స్ అండర్ 14, అండర్17 బాల బాలికలకు జరిగాయని తెలిపారు. ఖోఖో,కబడ్డీ జట్లను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు ఈ గేమ్స్‌లో భాగస్వాములయ్యారన్నారు.గేమ్స్‌లో పాల్గొనే విద్యార్థులకు భోజనంతో పాటు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ మండల కోఆర్డినేటర్ కె రాము, పిఈటిలు కె విజయ, పి శ్రీనివాసులు, ఎన్‌సిసి కెవి రమణారెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి



**పొన్నలూరు,సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లాలోని అన్ని మండలాలలో పనిచేయుచున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు వెంటనే జీతాలు ఇవ్వాలని,కనీస వేతనం అమలు చేయాలని,బదిలీ సౌకర్యం కల్పించాలని, ప్రమోషన్లు,ఎఫ్ టిఎ అమలు పరచాలని అదేవిధంగా ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం ప్రాజెక్టు డైరెక్టరు జోసెఫ్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పలువురు ఫీల్డ్ అసిస్టెంట్ లు మాట్లాడుతూ పని దినాలను బట్టి ఫీల్డ్ అసిస్టెంట్స్ కు జీతాలు రావటంలేదని ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు.పిల్లల చదువులుకు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణకు ఇబ్బంది పడుతున్నామన్నారు.అదే విధంగా సంవత్సర కాలం నుండి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి కొత్త సిమ్ కార్డులు ఇప్పించాలని,గతంలో ఫీల్డ్ అసిస్టెంట్స్ కు ఇచ్చిన సిమ్ కార్డులు కూడా పనిచేయడం లేదని వారికి కూడా కొత్త సిమ్ కార్డులు ఇప్పించాలని కోరారు. కాంట్రాక్ట్ సమయం పూర్తి అయిన వారికి రెన్యూవల్ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నేటి నుండి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు



**పొన్నలూరు,సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఆటల పోటీలు నేటి నుండి పొన్నలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ప్రారంభమవుతున్నట్లు ప్రధానోపాధ్యాయులు వై.వెంకటేశ్వరరావు మరియు మండల ఎస్ జి ఎఫ్ కోఆర్డినేటర్ టి.కోటేశ్వరరావు తెలిపారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో జరిగే ఈ పోటీలలో మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థల పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు.మండలంలోని అన్ని పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహిస్తామన్నారు. మొదటిరోజు ఆటల పోటీలలో కబడ్డీ,ఖోఖో,వాలీబాల్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్ మరియు యోగా తదితర పోటీలు నిర్వహించబడతాయన్నారు. రెండవ రోజు అథ్లెటిక్స్ నిర్వహించబడునని తెలియజేశారు.

# మెగా వైద్య శిబిరం ఏర్పాటు



**ముండ్లమూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థనారి ససక్త పరివార్ అభియాన్ కార్యక్రమం కింద మెగా వైద్యశిబిరాన్ని వైద్యాధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు ఎస్.రాఘవరెడ్డి, గ్రామ సీనియర్ నాయకులు మట్ట సుబ్బారెడ్డి, పార్టీ అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు పి.సుబ్బారావు, పూరిమెట్ల ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు, పార్టీ అధ్యక్షులు గాలం శ్రీను, వాకా బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం గురించి వైద్యాధికారి డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ స్త్రీలకు ఎన్నో ఆరోగ్య కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా మహిళల ఆరోగ్యం కోసం అదే విధంగా కౌమార బాలికల ఆరోగ్యం కోసం ఈ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని ఈ శిబిరాలలో మరి స్త్రీ వ్యాధులు క్యాన్సర్, బీపీ, షుగర్, టీబీ వంటి వ్యాధులపై ప్రత్యేక శ్రద్ధ కనపరిచి వాటిని కనిపెట్టడం చికిత్సలు చేయటం వంటివి చేస్తున్నామని తెలియజేశారు. అవసరమైన వారికి ప్రత్యేక వైద్యం ఇప్పుడు నుంచే చికిత్సలు అందజేస్తామని వైద్యాధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 312 మంది చికిత్సలు వివిధ పరీక్షలు చేయించుకున్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కేప రాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సీహెచ్ వెంకట్రావు, హెల్త్ సూపర్‌వైజర్ ఏ.అంజమ్మ, ఏఎన్ఎంలు ఆశాలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి - దద్దాల



**కనిగిరి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ రేపు శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఛలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కనిగిరి నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఛలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీ జిల్లా పార్టీ నాయకులు, విద్యార్థి, యువజన విభాగాలతో కలిసి మార్కాపురం మెడికల్ కాలేజీ వద్దకు శాంతియుతంగా పెద్ద ఎత్తున తరలివెళ్లి వాస్తవ పరిస్థితులను మీడియా ద్వారా ప్రజలకు వివరించనున్నట్లు ఆయన తెలిపారు. కావున కనిగిరి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# గ్రంధాలయం వార్షిక తనిఖీ



**తాళ్లూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
తాళ్లూరు గ్రంధాలయంలో వార్షిక తనిఖీలోభాగంగా జిల్లా గ్రంధాలయ శాఖ ఇన్‌చార్జ్ అధికారి జీవీ శివారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం నూతనంగా నిర్మించ నున్న గ్రంధాలయ భవన స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆ శాఖ సిబ్బంది విజయకుమారి, పద్మావతి, విశ్రాంతి ఉపాధ్యాయులు ఎస్.అంజిరెడ్డి,గ్రామస్తులు ఉన్నారు.

# ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట

**- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**

**- పేద ప్రజలకు చేదోడుగా సీఎం రిలీఫ్ నిధులు విడుదల**



**దర్శి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
దర్శి నియోజకవర్గానికి చెందిన 91 కుటుంబాలకు గురువారం దర్శి లోని డాక్టర్‌లక్ష్మీ నివాసం వద్ద రూ.48,32,000 రూపాయల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేసిన దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటిలక్ష్మీ. ఈ కార్యక్రమంలో దర్శి మున్సిపల్ చైర్మన్‌నారపుశెట్టి పిచ్చయ్య, నియోజకవర్గంలోని మండల పార్టీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, పిడతల నెమిలయ్య,మోడీ ఆంజనేయులు, కూరపాటి శ్రీను, మేడగం వెంకటేశ్వరరెడ్డి, వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ సీనియర్ నాయకులు, కూటమి శ్రేణులు ఉన్నారు.

## స్వచ్ఛతహీ సేవలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం




**కనిగిరి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపల్ కమీషనర్ పి.కృష్ణ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కనిగిరి పట్టణంలోని పొదిలి రోడ్డులో గురువారం స్వచ్ఛతహీ సేవ కార్యక్రమం కింద ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది శ్రద్ధగా పాల్గొని రహదారి పరిసరాలను శుభ్రపరిచారు. స్వచ్ఛమైన వాతావరణం కల్పించడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనాన్ని అందించాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమని శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ శానిటరీ ఉద్యోగులు పాల్గొని పట్టణ ప్రజలు కూడా పారిశుద్యానికి సహకరించాలని కోరారు.

# చక్కెర ఉన్న పదార్థాల వాడకాన్ని తగ్గించి ఆరోగ్యకరంగా ఉండాలి

**- ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, అసిస్టెంట్ సీడీపీఓ పి.లావణ్య, డాక్టర్ రవళి ప్రియాంక**



**పామూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణంలో చక్కెర ఉన్న పదార్థాల వాడకాన్ని తగ్గించి ఆరోగ్యంగా ఉండాలని అసిస్టెంట్ సీడీపీఓ పి.లావణ్య పేర్కొన్నారు. గురువారం 8వ రాష్ట్రీయ పోషణ్ మాసం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నందు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శిశు, చిన్న పిల్లలు ఎలాంటి ఆహారం తీసుకోవాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య, అసిస్టెంట్ సీడీపీఓ పి.లావణ్య, డాక్టర్ రవళి ప్రియాంకలు మాట్లాడుతూ శిశువు పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం, ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలనే అందించడం, ఆ తరువాత పోషకాహారంతో కూడిన ఆహారం ఇవ్వడం చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి ఎంతగానో దోహదం చేస్తుందని వారు సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో తల్లిదండ్రులకు, 0 నుండి 2 సంవత్సరాల పిల్లలకు ఎలాంటి ఆహారం ఇవ్వాలో తెలియజేశారు. అంగన్‌వాడీ సెంటర్లో ఇచ్చే ఆహారం గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గోళ్ల పద్మజలు మాట్లాడుతూ అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు వచ్చే వరకు బాల్య వివాహాలు నిర్వహించడం నేరమన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తే 1 లక్ష రూపాయలు జరిమానా 2 సంవత్సరాలు జైలు శిక్ష విధించబడుతుందని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్లు మీదృష్టికి వస్తే 1098 లేదా 100 లేదా ఐసీడీఎస్ వారికికానీ,స్వచ్ఛంద సంస్థలకుగాని సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ రామ సుబ్బులు, షేక్ రమిజ, మెహరాజ్, రూహి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం కుటుంబ బలోపేతం మన కూటమి ప్రభుత్వ లక్ష్యం

**- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ**





**దర్శి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
దర్శి నియోజకవర్గంలో స్వస్త్ నారీ - సశక్త్ పరివార్‌అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ. దర్శి మండలంలోని చందలూరు గ్రామంలో ప్రభుత్వ వైద్యశాల నందు స్వస్త్ నారీ- సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని గురువారం దర్శి టీడీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పుట్టిన రోజు సందర్భంగా దేశమంతటా మహిళల కోసం ఈ ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు ప్రారంభించారని, ఈ అభియాన్‌లో గుండె జబ్బులు, మధుమేహం,నోటి/ గర్భాశయ క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణులు కౌన్సిలింగ్, పోషకాహార అవగాహన, బాలికల్లో హిమోగ్లోబిన్ పరీక్షలు, రక్తహీనత నివారణ, పిల్లల సికిల్ సెల్ అనీమియా పరీక్షలు,టీకాలు, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ, రక్తదాన శిబిరాలు, బహిష్టు పరిశుభ్రత అవగాహన వంటి విస్తృత సేవలు అందించబడ తాయన్నారు. మహిళలు ఆరోగ్యవంతంగా ఉంటేనే కుటుంబం, సమాజం బలోపేతం అవుతుందని, ప్రతి ఒక్కరూ ఈ శిబిరాలను వినియోగించుకోవాలని డాక్టర్ గొట్టిపాటిలక్ష్మీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చందలూరు గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాల డాక్టర్స్ శ్రీవాణి, లక్ష్మీపూజిత, కేవీ శ్రీనివాసులు,డాక్టర్ బి.బ్లెస్సీ,వై.సురేఖ, సిబ్బంది,దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య,దర్శి మండల టీడీపీ అధ్యక్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు పుప్పాల పాపారావు, చందలూరు గ్రామంలోని కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన బైరెడ్డి జయరామిరెడ్డి



**పామూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం వగ్గంపల్లి గ్రామంలో గురువారం జిల్లాఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు నరసరాజు, ఎంఈఓ కోటిరెడ్డి, కరుణ కుమారి అధ్యక్షతన క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కనిగిరి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు విద్యార్థులకు ముందుగా అభినందనలు తెలియజేస్తూ మిమ్మల్ని చూసిన తర్వాత చిన్న నాటి జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయి అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కనిగిరి నియోజకవర్గ యువత అధ్యక్షులు తడికమల్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా ప్రతిభ చాటాలన్నారు. క్రీడలతో ఫిజికల్ స్ట్రెంత్ పాటు మెంటల్ రేవలేషన్ జీవితంలో ఎటువంటి సమస్యలు వచ్చినా గాని అధిరోహించడానికి ఉపయోగపడతాయన్నారు. పాఠశాల అధ్యాపక బృందం తడికమళ్ళ సుబ్బారావుని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యారవ రమా శ్రీనివాసులు, వైస్ చైర్మన్ పాలపర్తి వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, మండల అధ్యక్షులు బొల్లా నరసింహారావు, టౌన్ అధ్యక్షులు అమీర్జాన్, ఉపాధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# స్వచ్ఛతాహి సేవలో భాగస్వాములు కావాలి

**- మద్దులూరి అమర్నాథ్**



**చీరాల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
స్వచ్ఛ భారత్‌మిషన్ ద్వారా బుధవారం నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు చేపట్టే స్వచ్ఛతహి సేవలు కార్యక్రమాలలో అందరూ భాగస్వాములు కావాలని చీరాల నియోజకవర్గ యువ నాయకులు మద్దులూరి అమర్నాథ్ కోరారు. స్వచ్ఛత హి సేవతో ఆరకోగ్యకర దేశ నిర్మాణం దేశభక్తి పౌర బాధ్యతను శుభ్రతతో అనుసంధానిస్తుందని తెలిపారు. ప్రజలను ఆరోగ్యకరమైన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములుగా మార్చేందుకు ప్రేరేపిస్తుందని చెప్పారు. చీరాలలో ఆరోగ్యశిబిరాలు మొక్కలు నాటడం ఇంటింటికి ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. చీరాల రైల్వే స్టేషన్ దగ్గర స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను శుభ్రత కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం శానిటైజింగ్ సిబ్బందితో మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా రైల్వే స్టేషన్‌లో మరుగుదొడ్లు, క్యాటరింగ్ ప్రదేశాలలో శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రోజుకి 10 గంటల పని దినం అమలు ప్రయత్నాన్ని ఖండించిన సీఐటీయు




**వేటపాలెం, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
గురువారం మండలంలోని స్థానిక రావూరుపేట పరిధిలో కొత్త కాలువ వద్ద గల ఆక్వా అసోసియేషన్ భవనంలో గురువారం జరిగిన సీఐటీయు నాల్గువ మహాసభలో కార్మికుల ఆవేదన, ఆందోళనలు పోరాట పిలుపులు ఒకే వేదికపై ప్రతిధ్వనించాయి. ఇండ్ల బ్రహ్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముందుగా అమరుల స్మృతికి నివాళులర్పించారు. అనంతరం సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వసంతరావు కీలక ప్రసంగం చేశారు. ఎనిమిది గంటల పని దినాన్ని సాధించడానికి కార్మికులు చేసిన చారిత్రక పోరాటాలను గుర్తు చేశారు. కానీ నేటి పాలనలో మళ్లీ అదే హక్కును కొట్టేసి, పది గంటల పని దినం అమలు చేసే ప్రయత్నం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థిర ఉద్యోగాలపై ఆధారం తగ్గి, వేతనాల పెంపు డిమాండ్ చేయడం కష్టతరం అవుతుందన్నారు. మండల కన్వీనింగ్ కమిటీ ఎన్నిక నిర్వహించారు. కమిటీకి కన్వీనర్‌గా మచ్చ అయ్యప్పరెడ్డి, కో కన్వీనర్లుగా తన్నీరు శ్రీనవాసరావు, ఇండ్ల బ్రహ్మయ్య, కర్రీ ఆంజనేయులు తోపాటు మరో 15 మంది కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ పంచాయతీ, మిడ్డే మిల్స్, ఆశా రంగాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుడి ప్రవర్తనపై విచారణ

**సింగరాయకొండ, సెప్టెంబర్ 18 ,ప్రభాతవార్త**
మండలంలోని పాకల జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సిద్దు వెంకట నాగ ప్రసాద్‌పై జిల్లా కలెక్టర్‌కి వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ఒంగోలు డిప్యూటీ డీఈఓ చంద్రమోలేశ్వరరావు జిల్లా అధికారుల ఆదేశాలతో తిరిగి గురువారం విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థినీ, విద్యార్థులతో విడి విడిగా మాట్లాడి, ఉపాధ్యాయుడు అశ్లీల చిత్రాలు చూపిస్తూ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడనే అంశంపై నేరుగా వివరాలు విద్యార్థుల ను విచారించారు. పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు నమోదు చేశారు. విద్యార్థుల నుండి తీసుకున్న అభిప్రాయాలను స్వయంగా నమోదు చేసి వాటిని జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిక సమర్పించనున్నట్లు డిప్యూటీ డీఈఓ తెలిపారు.ఈ విచారణలో సింగరాయకొండ ఎంఈఓ కత్తి శ్రీనివాసరావుతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కనిగిరి నియోజకవర్గంలోని 217 రేషన్ షాపులకు కొత్త ఈ పాస్ మిషన్‌లు పంపిణీ



**కనిగిరి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
ప్రభుత్వ రేషన్ సరఫరా వ్యవస్థలో ఆధునికతకు ప్రాధాన్యం ఇస్తూ పాత ఈ పాస్ మిషన్‌ల స్థానంలో కొత్త 5జీ వెర్షన్ ఈ పాస్ మిషన్‌లు కనిగిరి నియోజక వర్గంలోని అన్ని రేషన్ షాపులకు పంపిణీ చేశారు. గురువారం కనిగిరి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈపాస్ విజన్ టెక్ జిల్లా కోఆర్డినేటర్ దానయ్య, సాయి, ఎన్‌ఫోర్స్ మెంట్ డిప్యూటీ తహశీల్దార్ కేఆర్ భూపతి, ఆర్‌డీఓ కార్యాలయ సిబ్బంది సమక్షంలో డీలర్లకు కొత్తమిషన్‌లు అందజేశారు. కనిగిరి నియోజకవర్గ పరిధిలోని 6 మండలాల రేషన్ షాపులకు మిషన్‌లను పంపిణీ చేశారు. అందులో కనిగిరి మండలంలో 54 షాపులు, హనుమంతునిపాడు మండలంలో 29 షాపులు, పెద్దచెర్లోపల్లి మండలంలో 27 షాపులు, పామూరు మండలంలో 44 షాపులు, వెలిగండ్ల మండలంలో 28 షాపులు, చంద్రశేఖరపురం మండలంలో 45 షాపులు మొత్తం 217 రేషన్ షాపులకు కొత్త 5జీ ఈ పాస్ మిషన్‌లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.ఈ కొత్త మిషన్‌లతో రేషన్ సరఫరా మరింత పారదర్శకంగా వేగవంతంగా సాగుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

## యువనాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ చేతుల మీదుగా స్మార్ట్ కార్డులు పంపిణీ



**చీరాల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
చీరాల మండలం దేవాంగపురి గ్రామంలో చీరాల నియోజకవర్గ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ చేతుల మీదుగా స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ గురువారం జరిగింది. ఈ సందర్భంగా గౌరీ అమర్నాథ్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం కూటమి ప్రభుత్వం ఈ కార్డులను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఇకపై బియ్యం, పిండి, పప్పులు, నూనె వంటి సరుకులు నేరుగా లబ్ధిదారులకు చేరుతాయని, అవినీతి లేదా, మధ్య వర్తుల దోపిడికి అవకాశం ఉండదని తెలియజేశారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులకు నూతన చెత్త సేకరణ వాహనాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆరోగ్యవంతమైన మహిళ

**- శక్తి వంతమైన, ఆరోగ్యవంతమైన కుటుంబానికి నిలయం**



**చీరాల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
చీరాల ఏరియా వైద్యశాలలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్నిచీరాల నియోజకవర్గ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్, చీరాల మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు ప్రారంభించారు. ఈ సమావేశంలో యువ నాయకులు మాట్లాడుతూ మహిళ ఆరోగ్యం - జాతీయ ఆరోగ్యం అని ఆలోచించిస్వస్త్ నారి సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభించడం సంతోషదాయకం అన్నారు. ఆరోగ్యవంతమైన మహిళ- శక్తి వంతమైన, ఆరోగ్యవంతమైన కుటుంబానికి నిలయంగా ఉంటుందని అన్నారు. ఆరోగ్యకరమైన మహిళల కోసం అన్ని స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉండాలంటే ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం మహిళలు వారి కుటుంబాలు ఆరోగ్యంగా ఉండాలని అన్నారు. మహిళలు క్యాన్సర్ వైద్యపరీక్షలు చేయించుకుని మొదట దశలోనే మందులు వాడుకొని తగ్గించుకోవచ్చని అన్నారు. వైద్యరంగంలో క్యాన్సర్ వ్యాధికి అనేక రకాల మందులు వచ్చాయని మహిళలు భయపడనవసరం లేదని అన్నారు.అనంతరం ఏరియా హాస్పిటల్‌లో వార్డులను ఓపీ విభాగాన్ని పరిశీలించారు. ఏరియా హాస్పిటల్‌లో రోగులతో మాట్లాడి వాళ్ళ సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి తల్లి కోసం ఒక చెట్టు



**వేటపాలెం, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
ప్రతి ఒక్కరూ తల్లి పేరు మీద ఒక చెట్టు నాటాలని వేటపాలెం ఐసీడీఎస్ సీడీపీఓ టి.ఝాన్సీ పిలుపునిచ్చారు. దేశాయిపేట సెక్టార్‌లోని నీలకంఠాపురంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యక్తిగతంగా, సమాజ స్థాయిలో ప్రవర్తనలో మార్పు తీసుకురావడం ఎంతైనా అవసరం అన్నారు. ఊబకాయం తగ్గించటం కోసం చక్కెర, ఉప్పు, నూనెలు తగ్గించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని అన్నారు. ఐటీసీ, ఫినిస్ సొసైటీ వారు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ నవీన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పవల్లి, ఏఎన్ఎం సునీత, సీహెచ్ఓ ఏంజిల్, మహిళా పోలీసు కరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు బ్యూలా కుమారి, అంజనాదేవి, మౌనిక, పద్మ, స్రవంతి, లక్ష్మీ, లలిత, గ్రామ పెద్దలు పిచ్చుక బుల్లయ్య, సుబ్బారావు, కొలుకుల వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

**- ఏవో ప్రకాష్‌రావు**



**కొనకనమిట్ల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**
పత్తిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కె.ప్రకాష్‌రావు అన్నారు. గార్లదిన్నె, నాగంపల్లి రైతు సేవా కేంద్రాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. పంట వేసిన ప్రతి ఒక్కరు పంట నమోదు చేయించుకుని ధృవీకరణ పత్రం పొందాలన్నారు. పత్తి పొలంను పరిశీలించి గులాబి రంగు పురుగు ఉదృతి ఎక్కువ ఉందని నివారణకు ప్రొఫెనోపాస్ లేదా క్లోరిపైరిపాస్ లేదా కినాల్ పాస్ 500 ఎంఎల్‌ఏలు, 500 ఎంఎల్ వేప నూనెతో కలిపి పిచికారి చేసినట్లయితే కొంత మేర ఈ గులాబి రంగు పురుగును నివారించవచ్చని తెలియజేశారు. మండలంలో యూరియా కొరత ఎక్కడ లేదని,కావాల్సినంత ఎరువులు రైతు సేవా కేంద్రంలోనూ, ప్రైవేటు డీలర్ దగ్గర అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలియజేశారు.రైతులకు పంటమీద ఎటువంటి సమస్యలున్న వెంటనే వ్యవసాయాధికారికి తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి విక్రం, గ్రామ సహాయకులు శివ నాయక్, రమేష్, రైతులు పాల్గొన్నారు.

MN 9_19-9Pg5.qxd 9/18/2025 10:52 PM Page 1



# కుంభవృష్టితో ఉత్తరాఖండ్ అతలాకుతలం



## నాలుగు గ్రామాల్లో 30 ఇళ్లు పైగా ధ్వంసం
## 20 మందికి గాయాలు, 14 మంది గల్లంతు
## తృటిలో తప్పించుకున్న ఎంపి అనిల్ బలూనీ

**డెహ్రాడూన్, సెప్టెంబరు 18:** ప్రకృతి విలయంతో ఉత్తరాఖండ్ అల్లాడుతున్నది. చమోలి జిల్లాలో కొండచరియలు విరిగిపడ్డాయి.నాలుగు గ్రామాల్లో 30కు పైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. 20 మంది గాయపడగా 14 మంది గల్లంతయ్యారు. శిథిలాల కింద వారు చిక్కుకుని ఉంటారని అనుమానిస్తున్నారు. గురువారం భారీ వర్షం కారణంగా వరదలు సంభవించాయి. దీంతో చమోలి జిల్లాలోని నాలుగు గ్రామాల్లో కొండ చరియలు విరిగిపడ్డాయి. 30కుపైగా ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఈ నేపథ్యంలో సుమారు 20 మంది గాయపడ్డారు. 14 మంది జాడ కనిపించడం లేదు. దీంతో అదృశ్యమైన వ్యక్తులు శిథిలాల కింద చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు.

కాగా, జాతీయ, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాలు ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్నాయని ఉత్తరాఖండ్ సిఎం పుష్కర్ సింగ్ ధామి తెలిపారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. తలకు గాయమైన చిన్నారితో సహా తీవ్రంగా గాయపడిన వారిని హెలికాప్టర్ ద్వారా రిషికేశ్‌లోని ఎయిమ్స్‌కు తరలించినట్లు వివరించారు. ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు వెల్లడించారు.

**తృటిలో తప్పించుకున్న బిజెపి ఎంపీ**

డెహ్రాడూన్ రోడ్డుపైనా కొండచరియలు విరిగిపడ్డాయి. అదే రహదారిపై కాన్వాయ్‌లో వెళ్తున్న బిజెపి ఎంపీ తృటిలో తప్పించుకున్నారు. ఆ రోడ్డుపై కొండచరియలు విరిగిపడిన వీడియో క్లిప్‌ను ఆయన షేర్ చేశారు. ఉత్తరాఖండ్‌లో ఈ సంఘటన జరిగింది. గర్వాల్ బిజెపి ఎంపీ అనిల్ బలూనీ చమోలి, రుద్రప్రయాగ్‌లోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. ఆ తర్వాత రిషికేశ్‌కు వెళ్లిన ఆయన తన కాన్వాయ్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. దేవ్ ప్రయాగ్ సమీపంలోని బద్రీనాథ్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడటాన్ని బిజెపి ఎంపీ అనిల్ గమనించారు. వెంటనే తన కాన్వాయ్‌ను నిలిపివేశారు. వాహనం నుంచి దిగిన ఆయన మిగతావాహనదారులను అప్రమత్తం చేశారు. ఇంతలో భారీగా కొండచరియలు ఆ రహదారిపై విరిగిపడ్డాయి. ఇది చూసి బిజెపి ఎంపీ అనిల్ కూడా భయాందోళన చెందారు. అక్కడి నుంచి దూరంగా వెళ్లారు. తన వాహనాలను వెనక్కి మళ్లించారు. మరోవైపు బిజెపి ఎంపి ఈ భయానక అనుభవాన్ని సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఈ వీడియో క్లిప్‌ను ఎక్స్‌లో షేర్ చేశారు. 'ఈ సంవత్సరం ఉత్తరాఖండ్‌లో సంభవించిన తీవ్రమైన వర్షాలు, కొండచరియలు విరిగిపడటం చాలా మందికి లోతైన గాయాలను మిగిల్చాయి. వాటిని నయం చేయడానికి చాలా సమయం పడుతుంది. నిన్న సాయంత్రం, విపత్తు ప్రభావిత ప్రాంతంలో కొండచరియలు విరిగిపడిన భయానక దృశ్యాన్ని మీ అందరితో పంచుకుంటున్నా' అని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్ ఎదుర్కొంటున్న తీవ్రమైన ప్రకృతి వైపరీత్యం గురించి ఇది చాలా చెబుతుందని అనిల్ బలూనీ తెలిపారు. సవాల్‌తో కూడిన పరిస్థితుల్లో రోడ్లపై పేరుకుపోయిన కొండ చరియల శిథిలాలు తొలగిస్తున్న కార్మికుల అంకితభావంతో పాటు అధికారులందరినీ అభినందిస్తున్నట్లు వెల్లడించారు.



## కష్టకాలంలో నేపాల్‌కు సంపూర్ణమద్దతు ఇస్తాం
## ప్రధాని సుశీల కర్కికి ప్రధాని మోడీ భరోసా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** కష్టకాలంలో ఉన్న పొరుగుదేశం నేపాల్‌కు భారత్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. ఆ దేశ తాత్కాలిక ప్రభుత్వ నూతన ప్రధానిగా నియమితులైన సుశీల కర్కితో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సంభాషణ ఎంతో ఆత్మీయంగా, భరోసా ఇచ్చేదిగా జరిగిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన నిరసనలు, సంభవించిన ప్రాణనష్టం పట్ల ప్రధాని మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో నేపాల్‌కు అండగా నిలుస్తామని, అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. నేపాల్‌లో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించేందుకు సుశీల కర్కి చేస్తున్న ప్రయత్నాలకు భారత్ పూర్తి అండదండలు అందిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ సంభాషణ వివరాలను ప్రధాని మోదీ స్వయంగా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. "నేపాల్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాని సుశీల కర్కితో ఆత్మీయంగా మాట్లాడాను. ఇటీవల జరిగిన ప్రాణనష్టంపై నా ప్రగాఢ సానుభూతిని తెలియజేశాను. శాంతి, స్థిరత్వాన్ని నెలకొల్పే ఆమె ప్రయత్నాలకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని మరోసారి హామీ ఇచ్చాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అదేవిధంగా, శుక్రవారం జరగనున్న నేపాల్ జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సుశీల కర్కికి, నేపాల్ ప్రజలకు ప్రధాని మోడీ ముందుగానేశుభాకాంక్షలు తెలియజేశారు.

## పెన్సిల్వేనియాలో కాల్పులు.. ముగ్గురు పోలీసులు మృతి

**పెన్సిల్వేనియా (యుఎస్), సెప్టెంబరు 18:** అమెరికాలో మరోసారి కాల్పుల మోత మోగింది. పెన్సిల్వేనియాలో జరిగిన ఒకదారుణ ఘటనలో ముగ్గురు పోలీసు అధికారులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు అధికారులు తీవ్రంగా గాయపడ్డారు. గృహ హింసకు సంబంధించిన ఒక కేసు విచారణ కోసం వెళ్లిన వారిపై ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో నిందితుడు కూడా హతమయ్యాడని అధికారులు తెలిపారు. పెన్సిల్వేనియాలోని కొడొరస్ టౌన్‌షిప్‌లో ఈ విషాదం చోటుచేసుకుంది. ఒక రోజు క్రితం ప్రారంభమైన కేసు విచారణలో భాగంగా పోలీసులు అక్కడికి వెళ్లారని స్టేట్ పోలీస్ కమిషనర్ క్రిస్టోఫర్ పారిస్ తెలిపారు. "ఇది గృహ హింసకు సంబంధించిన కేసు. విచారణలో భాగంగా వెళ్లిన అధికారులపై దాడి జరిగింది" అని ఆయన మీడియాకు వివరించారు.

## అన్ని మతాలను గౌరవిస్తా
### - చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** నిజజీవితంలోనే కాకుండా వృత్తిపరంగా కూడా తాను అన్ని మతాలను గౌరవిస్తానని సిజెఐ బీఆర్ గవాయ్ పేర్కొన్నారు. ఖజురహో ఆలయ సమూహంలో ఉన్న విష్ణు దేవుడి విగ్రహానికి చెందిన వివాదంపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద ఖజురహో ఆలయ సమూహంలో ఉన్న జవారి టెంపుల్‌లో ఏడు అడుగుల విష్ణుమూర్తి విగ్రహం ఉన్నది. అయితే ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, దాని స్థానంలోమరో విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని సుప్రీంకోర్టులో పిల్ వేశారు. ఆ పిల్‌పై మంగళవారం వాదనలు జరిగాయి. ఆ సమయంలో చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాకేశ్ దలాల్అనేవ్యక్తి పిటీషన్‌వేశారు. మొఘల్ రాజులకాలంలో డ్యామేజ్ అయినవిగ్రహాన్ని తొలగించి కొత్తవిగ్రహాన్ని ఏర్పాటుచేయాలని కోరారు.

## డ్రగ్స్‌ఎక్కువ ఉన్న దేశాల్లో భారత్‌ను చేర్చిన అమెరికా!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** మాదకద్రవ్యాల ఉత్పత్తి, రవాణాకు ప్రధాన కేంద్రాలుగా ఉన్న దేశాల జాబితాను అమెరికా విడుదల చేసింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికా కాంగ్రెస్‌కు సమర్పించిన అధికారిక నివేదికలో మొత్తం 23 దేశాల పేర్లను వెల్లడించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ జాబితాలో భారత్‌తో పాటు పొరుగు దేశాలైన చైనా, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బర్మా కూడా ఉన్నాయి. తమ దేశంలోకి అక్రమంగా ప్రవేశిస్తున్న మాదకద్రవ్యాల ముప్పును ఎదుర్కొనేందుకు కట్టుబడి ఉన్నామని ట్రంప్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ జాబితాలో ఉన్న ఇతర దేశాలలో మెక్సికో, కొలంబియా, వెనిజులా, బొలీవియా, ఈక్వెడార్, పెరూ, పనామా, కోస్టారికా, జమైకా, లావోస్ వంటి దేశాలు ఉన్నాయి. అయితే, ఈ జాబితాలో ఒక దేశం పేరు ఉండటం అనేది ఆ దేశ ప్రభుత్వ వైఫల్యాన్ని సూచించదని అమెరికా తన నివేదికలో స్పష్టం చేసింది. భౌగోళిక, వాణిజ్య, ఆర్థిక కారణాల వల్ల కొన్ని దేశాలు మాదకద్రవ్యాల రవాణాకు అనుకూలంగా మారతాయని, అందుకే వాటిని ఈ జాబితాలో చేర్చినట్లు తెలిపింది.

ప్రభుత్వాలు డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఈ పరిస్థితి ఉండొచ్చని పేర్కొంది. గత 12 నెలలుగా మాదక ద్రవ్యాల నియంత్రణ ఒప్పందాలను పాటిం చడంలో, చర్యలు తీసుకోవడంలో 'దారుణంగా విఫలమైన' దేశాలుగా ఆఫ్ఘనిస్థాన్, బొలీవియా, బర్మా, కొలంబియా, వెనిజులా పేర్లను ట్రంప్ ప్రత్యేకంగా ప్రస్తావించారు.

ఇటీవల భారత నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) పనితీరును భారత్‌లోని అమెరికా రాయబార కార్యాలయం ప్రశంసించడం గమనార్హం. ఓ అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను ఎన్‌సీబీ ఛేదించిన నేపథ్యంలో 'అక్రమ మాదక ద్రవ్యాల నుంచి అమెరికన్లను రక్షించడంలో, వారి ప్రాణాలను కాపాడటంలో సహాయం చేస్తున్నందుకు భారత ఎన్‌సీబీకి ధన్యవాదాలు" అని అమెరికా ఎంబసీ పేర్కొంది. ఈక్రమంలో ఇపుడు తాజా జాబితాలో భారత్ పేరు రావడం చర్చనీయాంశం అయింది.


## హిండెన్‌బర్గ్ ఆరోపణలపై ఆదానికి సెబీ క్లీన్‌చిట్!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** ఆదానిగ్రూప్ సంస్థలపై అమెరికాకు చెందిన షార్ట్‌సెల్లర్ సంస్థ హిండెన్‌బర్గ్‌రీసెర్చి చేసిన ఆరోపణల్లో ఆధారాలు లేవని, ఎలాంటి నంబంధనలు ఉల్లంఘించిందన్న ఆరోపణలపై హిండెన్‌బర్గ్ ఆధారాలు చూపించలేకపోయిందనిసెబీ క్లీన్‌చీట్ ఇచ్చింది. ప్రత్యేకించి ఆదానిగ్రూప్ ఛైర్మన్ గౌతమ్ ఆదాని, గ్రూపు కంపెనీలపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలు నిరాధారమని సెబీ తేల్చిచెప్పింది. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చి ఆదాని మరో మూడు కంపెనీలు షేర్ల లావాదేవీలకు సంబంధించి పలు అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపించింది. ఆదికార్ప్ ఎంటర్‌ప్రైజెస్, మైల్‌స్టోన్‌ట్రేడ్‌లింక్స్, రెహవార్ ఇన్‌ఫ్రా సంస్థలద్వారా ఆదానిగ్రూప్‌లోకి నిధులను మళ్లిస్తోందని ఆరోపించింది. సెబీ గురువారం జారీచేసిన రెండు ఉత్తర్వుల్లోనూ ఎలాంటి నిబంధనల ఉల్లంఘనలు జరగలేదని ధృవీకరించింది. సంస్థ నిర్వహించిన సంబంధంలేని పార్టీలతో ఉన్న డీల్స్‌ను సంబందం ఉన్న పార్టీల డీల్స్‌గా పరిగణించలేమని, 2021లో వచ్చిన సవరణల తర్వాత నిర్వచనం కూడా మారిందని సెబీ వెల్లడించింది. అన్ని రుణాలను కూడా తిరిగి చెల్లించారని, నిదులు సమీకరణ ఎందుకోసం చేసారో వాటికి మాత్రమే సెబీ వినియోగించిందని సెబీ తన నివేదికలో వెల్లడించింది. అందువల్ల ఆదాని గ్రూప్‌పై చేపట్టిన అన్ని విచారణలను నిలిపివేస్తున్నట్లు సెబీ ప్రకటించింది.

సెబీ ఉత్తర్వులపై ఆదాని ఛైర్మన్ గౌతమ్ ఆదాని స్పందించారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలు నిరాధారమని సెబీ ఉత్తర్వులతో నిర్ధారణ అయిందని పేర్కొంటూ సెబీ తీర్పును స్వాగతించారు. విషప్రచారంచేసిన వారు దేశానికి క్షమాపణలు చెప్పాలని కోరారు. సత్యమేవ జయతే, జైహింద్ అంటూ ఆయన తన ఎక్స్ ఖాతలోపోస్టుచేసారు. జాతికి సేవలందించడంలో రాజీలేని మార్గంలోనే ముందుకువెళతామని, భారత్‌లో మాసంస్థలు అందుకు ప్రతీకగా నిలుస్తాయని గౌతమ్ ఆదాని అన్నారు.

## ఎంపి కంగనా దక్షిణాదికి వస్తే చెంపదెబ్బకొట్టాలి!



### డిఎంకె నేత అళగిరి వ్యాఖ్యలపై దుమారం

**చెన్నై, సెప్టెంబరు 18:** బిజెపి ఎంపీ కంగనారనౌత్ దక్షిణాదికి వస్తే చెంపదెబ్బ కొట్టాలని అళగిరి అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై పలువురు మండిపడుతున్నారు. అయితే, రూ.100 చెల్లిస్తే మహిళా కార్యకర్తలను నిరసనల్లోనే పాల్గొనేందుకు నియమించుకోవచ్చంటూ కంగనా గతంలో చేసిన ప్రకటనపై అళగిరి స్పందించారు. ఈ సందర్భంగా మండి ఎంపీపై విరుచుకుపడ్డారు. బిజెపి ఎంపీ అహంకారంతో మాట్లాడుతుందని విమర్శించారు. ఆమె దక్షిణాది రాష్ట్రాల సందర్శనకు వస్తే అదే సమయంలో ఆమెను చెంపదెబ్బ కొట్టాల్సిందేంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గతంలో ఇలాంటి వ్యాఖ్యలు కంగనా గతంలో చేసిందని గుర్తుచేశారు. ఢిల్లీ విమానాశ్రయంలో ఓ మహిళా సిఐఎస్ఎఫ్ సిబ్బంది ఆమెను చెంపదెబ్బ కొట్టిన విషయాన్ని గుర్తుచేశారు. రైతుల ఉద్యమాన్ని ఉద్దేశించి కంగనా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా చెంపదెబ్బ కొట్టిందని, అవమానించే వ్యాఖ్యలు చేస్తే ఎవరికైనా ఆగ్రహం వస్తుందని అళగిరి తెలిపారు.

ఈసారి దక్షిణాదికివస్తే మరిచిపోకుండా కంగనాను చెంపదెబ్బ కొట్టాల్సిందేనని అప్పుడే ఆమెకు తప్పు తెలిసివస్తుందన్నారు. కాగా అళగిరిచేసిన వ్యాఖ్యలపై కంగనారనౌత్ స్పందించింది. భారత్‌లో ఎక్కడికైనా వెళ్లవచ్చని ఎవరూ ఆపలేరన్నారు. ద్వేషించేవారు కొందరుంటే ప్రేమించే వారు చాలా మందే ఉన్నారన్నారు. వరద బాధితులను కలిసేందుకు వెళ్లిన ఆమె ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. అళగిరి వ్యాఖ్యలపై స్పందించారు. తమిళనాడు సీఎం తలైవి జయలలిత పాత్రను సినిమాలో పోషించానని కానీ ఓటింగ్ సమయంలో సభలో ఉన్న ప్రతిపక్ష ఎంపీలు కూడా వరుసలో వెళ్తుండగా తనను తలైవి అని సంబోధించారన్నారు. మహిళలపై ఇలాంటి అగౌరవకరమైన వ్యాఖ్యలు చేయకూడదని ఇది ప్రజలకు తప్పుడు సందేశాన్ని పంపుతుందన్నారు.

ఇదిలా ఉండగా.. కులు జిల్లాలోని మనాలి సబ్ డివిజన్‌లోని సోలాంగ్, పాల్చన్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఇక్కడ తన రెస్టారెంట్ ఉందని ఇక్కడ కేవలం రూ.50 వ్యాపారం మాత్రమే జరిగిందని రూ.15లక్షలు జీతాలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. బియాస్ నది ఉప్పొంగుతున్నందున సోలాంగ్ గ్రామంలో కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఎంపీకి తెలిపారు.

## శబరిమల ఆలయం స్వర్ణాభరణ వివాదంపై విజిలెన్స్ దర్యాప్తు



**తిరువనంతపురం, సెప్టెంబరు 18:** కేరళలోని ప్రసిద్ధ శబరిమల ఆలయంలో విగ్రహాల బంగారు పూతపూసిన తాపడాలను అనుమతి లేకుండా తొలగించడం ఇటీవల వివాదాస్పదమైంది. తాజాగా ఇందుకు సంబంధించిన మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విగ్రహాల తాపడాలపై బంగారం బరువు తగ్గడాన్ని కేరళ హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. దీనిపై విజిలెన్స్ కమిటీ దర్యాప్తు చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. శబరిమలలో గర్భగుడి ముందు ఉన్న ద్వారపాలక విగ్రహాలపై బంగారు పూత పూసిన రాగి తాపడాలను 2019లో మరమ్మతుల నిమిత్తం తొలగించారు. వాటిని సరి చేయించి కొత్త బంగారు పూత తాపడాలను అందిస్తానని ఉన్నికృష్ణన్ అనే దాత తీసుకెళ్లారు. ఈ పనిని చెన్నైలోని ఓ సంస్థకు అప్పగించారు. 2019లో వాటిని తొలగించే సమయంలో తాపడాల బరువు 42.8 కిలోలుగా ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే ఆ తాపడాలను తమ వద్దకు తెచ్చినప్పుడు బరువు 38.28 కిలోలు మాత్రమే ఉందని సదరు కంపెనీ తెలిపింది. అంతేగాక ఆలయం నుంచి తాపడాలను తొలగించిన దాదాపు 40 రోజుల తర్వాత వాటిని చెన్నైలోని కంపెనీకి అందించినట్లు తెలిసింది. ఈ పరిణామాలపై తాజాగా కోర్టు అనుమానం వ్యక్తం చేసింది. ఉన్నట్లుండి తాపడాల బరువు 4.524 కేజీలు తగ్గడాన్ని తీవ్రంగా పరిగణించింది. వీటిని తిరిగి అమర్చినప్పుడు ఎందుకు బరువును సరిచూడలేదని ప్రశ్నించింది. ఈ తగ్గుదలకు ఏకైక కారణంగా బంగారు పూత తగ్గడమే అని న్యాయస్థానం అభిప్రాయపడింది. లేదంటే దాత వాటి స్థానంలో మరో తాపడాల సెట్‌ను కంపెనీకి ఇచ్చే అవకాశం కూడా ఉన్నట్లు పేర్కొంది. ఇందులో లోపాలు కనిపిస్తున్నాయని, బరువు ఎలా తగ్గిందో తెలుసుకునేందుకు విజిలెన్స్‌కమిటీ దర్యాప్తుకు ఆదేశించింది. ఇందుకు సహకరించాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుకు సూచించింది. దీనిపై మూడు వారాల్లోగా నివేదికను అందచేయాలని స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు విచారణను సెప్టెంబర్ 30వ తేదీకి వాయిదా వేసింది.



# ఓట్ల తొలగింపు ఆన్‌లైన్‌లో అసాధ్యం

## అదంతా నిరాధార ప్రచారం: స్పష్టం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** సాఫ్ట్‌వేర్ వాడి ఓట్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీచేసిన విమర్శలను కేంద్రఎన్నికల సంఘం ఖండించింది. అదంతా నిరాధార, అసత్య ప్రచారమని వెల్లడించింది. ఆన్‌లైన్ వేదికగా ఓట్లను తొలగించడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సంబంధిత వ్యక్తికి సమాచారం ఇవ్వ కుండా ఏ ఒక్కరిఓటు తొలగించడం లేదు. ఆన్ లైన్‌లో మరెవరూ తొలగించలేరు. 2023లో అలంద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఓటర్ల తొల గింపునకు విఫల ప్రయత్నాలు జరిగాయి. ఆ వ్యవహారంపై దర్యాప్తు కోసం ఎన్నికల సంఘమే ఫిర్యాదు చేసింది. రికార్డుల ప్రకారం అలంద్ అసెంబ్లీకి 2018లో జరిగిన ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్ నేత బిఆర్ పాటిల్ గెలుపొందారు అని ఇసి వెల్లడించింది. రాహుల్ తప్పుడు సమాచా రాన్ని ప్రచారం చేస్తున్నారని బిజెపి దుయ్య బట్టింది. రాహుల్‌కు రాజ్యాంగం, చట్టం అర్థం కావడంలేదు. 2014 నుంచి మోడీజీ సాధిస్తున్న విజయాలన్నీ నిజం కాదని ఆయన ఆరోపిస్తు న్నారు. ఈ వ్యాఖ్యలు దేశ ప్రజలకు, ఓటర్లకు అవమానం. ఆయన బాంబు గురించి మాట్లాడు తున్నారు. ఈ ప్రకటలను తీవ్రంగా ఖండిస్తున్నాను అని మాజీ కేంద్రమంత్రి రవిశంకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. హైడ్రోజన్ బాంబు పేలుస్తామని కాంగ్రెస్‌వాళ్లు అంటున్నారు. ఆ బాంబ్ ఇలాగే ఉంటుందా? వాళ్లు ఓటమిని చవిచూస్తున్నారు. ఈ సమయంలో వారు చేయాల్సింది దానిని అంగీకరించడం. కష్టపడి మీస్థాయికి వస్తామనేలా వారిమాటలుఉండాలి. అంతేకానీ దానికిబదులుగా వారు కోర్టుల జోక్యాన్ని కోరు కుంటున్నారు. లేకపోతే వేరొకరిపై నిందలు వేస్తున్నారు అని ఢిల్లీ మంత్రి మజీందర్ సింగ్ సిర్సా మండిపడ్డారు. బంగ్లాదేశ్, నేపాల్ తరహా అశాంతి భారత్‌లో సృష్టించారని రాహుల్ భావిస్తున్నారని కమలం పార్టీ నేత అనురాగ్ ఠాకూర్ విమర్శించారు. రాహుల్‌నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దాదాపు 90ఎన్నికల్లో ఓటమి చవిచూసిందని, దాంతో ఆయనఅసహనం రోజురోజుకూ పెరుగుతోందని ఎద్దేవా చేశారు. క్షమాపణలు కోరడం, కోర్టుమందలింపులు ఆయనకు పరిపాటిగా మారాయని అన్నారు.

# ఓట్ల తొలగింపునకు సాఫ్ట్‌వేర్ వాడుతున్నారు
## -కాంగ్రెస్ అగ్రనేత రాహుల్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు18:** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి పట్టున్న ప్రాంతాల నుంచి ఓట్లను తొలగించారని విమర్శించారు. రాష్ట్రం వెలుపలి నుంచి నకిలీ లాగిన్లు, ఫోన్ నెంబర్లను ఉపయోగించి ఓటర్ ఐడిలను తొలగించినట్లు వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి కేంద్రీకృత పద్ధతిలో ఈ చర్యలకు పాల్పడినట్లు ఆరోపించారు. ఈ మేరకు ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ ఓట్ల తొలగింపు అంతా వ్యక్తులతో గాకుండా సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి చేస్తున్నారు. అదంతా ఒక ప్రక్రియ ప్రకారం జరుగుతోంది. ప్రతిపక్షాలకు ఓట్లు వేసే కమ్యూనిటీలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇందుకు సంబంధించి మేం 100 శాతం ఆధారాలను గుర్తించాం. నేను ఈ దేశాన్ని, రాజ్యాంగాన్ని ప్రేమిస్తున్నాను. ఈ ప్రజాస్వామ్య ప్రక్రియను ఇష్టపడతాను. ఈ ప్రక్రియను నేను రక్షిస్తున్నాను. ఇక దీనికి ఎలా స్పందించాలనేది మీ చేతుల్లోనే ఉంటుంది. కర్ణాటకలోకి అలంద్‌లో ఆరువేల ఓట్లను తొలగించే ప్రయత్నం జరిగింది అని విమర్శించారు. అలాగే ఓట్ల చోరీకి పాల్పడేవారిని ఎన్నికల సంఘం చీఫ్ రక్షిస్తున్నారని, ఈ వ్యవహారంపై విచారణ జరపాలన్న అభ్యర్థనలను విస్మరిస్తున్నారని అన్నారు. ఇది హైడ్రోజన్ బాంబు కాదని, దానిని త్వరలో పేలుస్తానని వెల్లడించారు.

# సంక్షిప్తంగా..

## అమెరికాలో ట్రంప్ పసిడి విగ్రహం!




**వాషింగ్టన్, సెప్టెంబరు 18:** అమెరికా చట్టసభల భవనం క్యాపిటల్ ఎదురుగా ట్రంప్ బంగారు విగ్రహం ఏర్పాటుపై అమెరికాతోపాటు ప్రపంచదేశాల్లోను ఆసక్తిపెరిగింది. కొందరు ఈ చర్యపై విమర్శలు కూడా గుప్పిస్తున్నారు ట్రంప్ చేతిలో క్రిప్టో కరెన్సీ ఉన్నట్టు 12 అడుగుల ఎత్తు ఉండేలా ఈ విగ్రహాన్ని డిజైన్ చేశారు. దీని కోసం క్రిప్టోకరెన్సీ పెట్టుబడిదారులు నిధులు సమకూర్చారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేటును 25 బేస్ పాయింట్ల మేర తగ్గించిన నేపథ్యంలో విగ్రహం ఏర్పాటు ఆసక్తికరంగా మారింది. దీన్ని చూసేందుకు జనాలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. డిజిటల్ కరెన్సీ భవిష్యత్తు, రిజర్వ్ బ్యాంకుల విత్త విధానాలు, ఆర్థిక రంగ మార్కెట్‌లో ప్రభుత్వం పాత్ర తదితర అంశాలపై జనాల్లో అవగాహన, చర్చను ప్రారంభించేందుకు ఈ విగ్రహం ఏర్పాటు చేసినట్టు క్రిప్టో ఇన్వెస్టర్లు కొందరు పేర్కొన్నారు.

## పాక్-సౌదీ మధ్య కీలక రక్షణ ఒప్పందం

**రియాద్, సెప్టెంబరు 18:** దాయాది పాకిస్థాన్, సౌదీ మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆ దేశ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వ్యూహాత్మక రక్షణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. రెండు దేశాల్లో దేనిపైన అయినా దాడి జరిగితే అది ఇద్దరిపైనా జరిగిన దాడిగా భావిస్తారు. అప్పుడు రెండు దేశాలూ దాడి చేసిన దేశంపై పోరాడేలా ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్-భారత్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ ఒప్పందం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఒప్పందంపై భారత్ తాజాగా స్పందించింది. ఈ ఒప్పందం పరిణామాలను అర్థం చేసుకునేందుకు అధ్యయనం చేస్తున్నట్లు పేర్కొంది. జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి, అన్ని రంగాల్లో సమగ్ర జాతీయ భద్రతను నిర్ధారించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.

## ఎయిర్ ఇండియా ప్రమాదం.. బోయింగ్‌పై అమెరికాలో దావా



**న్యూయార్క్, సెప్టెంబరు 18:** అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిం డియా విమానప్రమాదం యావత్ దేశాన్ని దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈఘటనలో మృతులకు సంబంధించిన నాలుగు కుటుంబాలు విమాన తయారీ సంస్థ బోయింగ్‌పై అమెరికాలో దావావేశాయి. ఈ పిటిషన్‌లో విడిభాగాల తయారీ సంస్థ హనీవెల్ పేరునుకూడా చేర్చాయి. ఈ మేరకు ఆ కుటుంబాలు మంగళవారం దాఖలు చేసిన ఈ దావాలో.. ఇంధన స్విచ్‌లు లోపభూయిష్టంగా ఉండటం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించాయి. 787 డ్రీమ్‌లైనర్ విమానం డిజైన్, దాని విడిభాగాల అభివృద్ధి సమయంలోనే లోపాలు వారికి తెలు సని.. అయినా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదని పేర్కొన్నారు. 'ఇంధన సరఫరా, విమాన థ్రస్ట్‌నియంత్రణకు సంబంధించిన డిజైన్‌లో లోపంఉంది' అని బాధిత కుటుంబాలు ఆరోపించాయి. అంతేకాక.. అకస్మాత్తుగా వచ్చిపడే ప్రమాదాలను నిలువరించేందుకు ఆ రెండు సంస్థలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోలేదన్నాయి. స్విచ్‌లకు తనిఖీలు, మరమ్మతులు అవసరమని విమానాయాన సంస్థలను హెచ్చరించలేదన్నారు.

## వైష్ణోదేవి యాత్ర పునఃప్రారంభం

**డెహ్రాడూన్, సెప్టెంబరు 18:** భారీ వర్షాలు, వరదలతో తీవ్ర ఆటంకాలు ఎదుర్కొన్న శ్రీ మాతా వైష్ణో దేవి యాత్ర ఈ రోజు తిరిగి ప్రారంభమైంది. ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం నిలిపివేసిన యాత్రను, వాతావరణం మెరుగుపడటంతో అధికారులు పునరుద్ధరించారు. దీంతో భక్తులు, స్థానిక వ్యాపారులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఉదయం 6 గంటల నుంచే యాత్రకు భక్తులను అనుమతించారు. బేస్ క్యాంప్ నుంచి ఆలయం వరకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చినట్లు శ్రీ మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్ర మండలి అధికారులు తెలిపారు. పొగమంచు కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయిన హెలికాప్టర్ సేవలను కూడా తిరిగి ప్రారంభించారు. తొలిరోజే 3,500 మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని, ఉదయం నుంచి భక్తుల రాక నిరంతరాయంగా కొనసాగుతోందని వారు వెల్లడించారు.

19-09pg6exHMNWJQE 10_19-09pg6exHMNWJQE.qxd 9/19/2025 12:10 AM Page 1



# రసవత్తరంగా ఆరంభమైన శాసనసభా సమావేశాలు

## న- ప్రశ్నోత్తర సమయం, జీరో అవర్‌లపై మంత్రుల శ్రద్ధ పెట్టడం లేదంటూ స్పీకరు అసహనం

## - సభకు హాజరుగాని వైసిపి శాసనసభ్యులు, సమావేశాలకు వస్తే మాట్లాడేందుకు సమయం ఇస్తామన్న స్పీకర్

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాత వార్తప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. సభకు వైకాంగ్రెస్ పక్ష ఎంఎల్‌ఏలు హాజరు కాలేదు. శాసనసభ ప్రశ్నోత్తర సమయంతో ప్రారంభమైంది. అనుసరణగా జీరో అవర్‌ల సాగింది. పలు అంశాలపై ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ, మంత్రుల నడుమ రసవత్తరమైన సంభాషణ చోటు చేసుకుంది. జీరో అవర్‌లో సమస్యలపై తగిన ఆసక్తి మంత్రుల్లో కన్పించడంలేదనే విమర్శలు సభ్యుల నుంచి వెల్లువెత్తాయి. ఒక శాసనసభలో ప్రశ్నోత్తరాలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేపట్టారు. గురువారం తొలి రోజు సమావేశంలో జీరో అవర్‌పై మంత్రులు, అధికారులపై స్పీకర్ అయ్యన్న అసహనం వ్యక్తం చేసారు. జీరో అవర్‌లో ఎమ్మెల్యేలు మాట్లాడితే ఎవరూ నోట్ చేసుకోవట్లేదేనని స్పీకరు వ్యాఖ్యానించారు. జీరో అవర్‌లో లేవనెత్తిన అంశాలపై తప్పనిసరిగా సమాధానం రావాలన్న బుచ్చయ్యచౌదరి సమాధానం ఇచ్చేలా మంత్రులు, అధికారులను ఆదేశించాలని పట్టుబట్టిన బుచ్చయ్య స్పీకర్ జోక్యం చేసుకుని మంత్రులు వెంటనే సమాధానం చెప్పాలని ఆదేశాలు తాము నోట్ చేసుకుని సమాధానం చెబుతామని సభకు మంత్రి నాదెండ్ల స్పష్టం చేసారు. వివిధ సమస్యలపై సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. ఈ సమావేశాలను వారం లేదా 10 రోజులు నిర్వహించే అవకాశం ఉంది. 6 ఆర్డినెన్స్‌ల స్థానంలో బిల్లులను ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టనుంది. పంచాయతీరాజ్ సవరణ, మున్సిపల్ చట్టాల సవరణ, ఏపీ మోటారు వాహనాల పన్నులు, ఎస్సీ వర్గీకరణ సహా ది ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్



లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ది బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ట్రస్ట్ ఎట్ ఆంధ్రప్రదేశ్ ఆర్డినెన్స్ 2025 స్థానంలో బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఇక అసెంబ్లీకి రాని ఎంఎల్‌ఏలకు ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకునే నైతిక హక్కుందా? ఈ విషయంపై దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పార్లమెంటులోనూ చర్చ జరగాలనేది నా అభిప్రాయం' అని శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సభలో వ్యాఖ్యానించారు..'వైకాపా ఎంఎల్‌ఏలు ప్రమాణస్వీకారం తర్వాత సభకు రాలేదు. ఆ 11 మందిలో జగన్ మినహా మిగిలిన పది మంతి జీతాలు తీసుకుంటున్నారు. జగన్, వైకాపా ఎంఎల్‌ఏలందరూ అసెంబ్లీకి రండి. అందరు ఎంఎల్ఏలకూ ఇచ్చినట్లే మీకూ మాట్లాడే సమయమిస్తా. ఆ భాధ్యత నాది. అయ్యన్నపాత్రుడిగా ననున గౌరవించాలనడం లేదు. ఈ రోజు నేనున్నా, రేపు ఇంకొకరు స్పీకర్‌గా వస్తారు. స్పీకర్ స్థానాన్ని గౌరవించాల్సిన వైకాపా ఎంఎల్‌ఏలకు లేదా అని ప్రశ్నించారు 'అసెంబ్లీ సమావేశాలను ఈ నెలాఖరుతో ముగించి...దసరా తర్వాత మళ్ళీ ఐదారు రోజులు కొనసాగించాలనేది నా వ్యక్తిగత ఆలోచన. గురువారం జరిగే బీఏసీ సమావేశంలో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటాం. సమావేశాలకు ఎంఎల్‌ఏలందరూ హాజరవ్వాలి అనిఅయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. అమృత పథకంలో మైదుకూరు పురపాలక సంఘం అంశంపై ఎంఎల్ఏ పుట్టా సుధాకర్‌యాదవ్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులనవ గౌరవ వేతనంపై జనసేన ఎంఎల్ఏ కొణతాలరామకృష్ణ, ఏపీపీఎస్సీ గ్రూప్-1 నోటీస్‌పై కమిటీపై ఎంఎల్ఏ కూన రవికుమార్, రాష్ట్రంలో సౌరవిద్యుత్తుపై ఎంఎల్ఏ బత్తుల రామకృష్ణ, తుంగభద్ర డ్యాం నీటి వినియోగంపైఎంఎల్ఏ ఎంఎస్‌రాజు, టిడ్కో ఇళ్ళ నిర్మాణంపై కామినేని శ్రీనివాస్, శ్రీకాకుళం ట్రైల్యాండ్‌భూములకు సాగునీరుపైఎంఎల్‌ఏగొండు శంకరరావు, పెందుర్తి నియోజకవర్గంలో మానవ వనరుల అభివృద్ధిపై ఎంఎల్ఏ పంచకర్ల రమేష్‌బాబులు ప్రశ్నించారు, వైసిపి ఇరిగేషన్ రంగాన్ని విధ్వంసం చేసింది - మంత్రి నిమ్మల రామానాయుడు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇరిగేషన్ రంగాన్ని విధ ్వంసం చేసిందన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు..కూటమి ప్రభుత్వం చివరి ఎకరం వరకు సాగు నీరందించేలా ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌ను గాడిలో పెడుతోందన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల రుణం తీర్చుకునేందుకు కూటమిప్రభుత్వంపని చేస్తోందన్నారు, ప్రశ్నోత్తరాల సమయంలో బీఆర్ఆర్ వంశధార, తోటవల్లి, వంశధార-నాగావళి లింక్, జంఝావతి, హిరమండలంలిఫ్ట్, నాగావళి-చంపావతి, మహేంద్రతనయ, తరకరామతీర్థసాగర్ వంటికీలకమైన ప్రాజెక్టులను రెండేళ్ళలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు.

# రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం!

**విజయవాడ,సెప్టెంబరు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ లో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో పలు మార్పులు చోటు చేసుకుంటాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, కాకినాడ, డా. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, రాయలసీమ జిల్లాలతో పాటు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరులో వర్షాలు పడనున్నాయి. ఈ ప్రాంతాల్లో మేఘావృత వాతావరణం నెలకొని ఉండగా, అక్కడక్కడ పిడుగులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు చెట్ల కింద నిలబడొద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ప్రస్తుతం పశ్చిమ మధ్య నైరుతి బంగాళాఖాతం నుంచి తూర్పు విదర్భ, తెలంగాణ, దక్షిణ కోస్తాంధ్ర వరకు సముద్ర మట్టానికి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాయలసీమలో రాబోయే రెండు రోజుల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని తిశిళీదీలీతి మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. గురువారం వర్షాలు కురిసే జిల్లాలు: తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు వాతా వరణ అధికారుల సూచనలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

# ఆర్డిటి అనంత పేదలకు వరప్రసాదిని

## - పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా పేదల అభ్యున్నతికి ఆర్డిటి సేవలు : ఎమ్మెల్యే సింధూర రెడ్డి



**అనంతపురం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో** ఉమ్మడి అనంతపురం జిల్లాలో రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి) ఒక గొప్ప వరప్రసాదం, పేదల పాలిట కల్పవృక్షం ఈ సంస్థ. ఈ ఆర్‌డిటి సంస్థ పార్టీలకు, మతాలకు, కులాలకు అతీతంగా పేదల సంక్షేమాభివృద్ధికి కోసం పనిచేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో పేద మహిళా అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తోంది. ఈ సంస్థ ద్వారా విద్యారంగంలో పేద విద్యార్థుల ఉన్నత విద్యకు, క్రీడారంగంలో గ్రామీణ ప్రాంతాల్లోనీ నిరుపేద కుటుంబాల్లోని యువ క్రీడాకారులకు, వైద్య రంగంలో నిరుపేదలకు మరీ ముఖ్యంగా మహిళాభివృద్ధి కోసం ఎన్నో సేవలు అందిస్తోంది. ఈ సంస్థ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని 3891 గ్రామాల్లో సుమారు 4.50 లక్షల కుటుంబాలకు వివిధ సేవలు అందిస్తోంది. ప్రభుత్వంతో పాటు ఈ సంస్థ మినీ ప్రభుత్వం లాగా ప్రజలకు చేసిన సేవలు లక్షలాదిమంది ప్రజల అభిమానాన్ని ఈ సంస్థ చూరగొందనీ చెప్పవచ్చు. ఎస్సీ, ఎస్టీ కాలనీలో పేదలకు ఇళ్ల నిర్మాణం, పేద విద్యార్థుల కోసం పాఠశాలలభవనాల నిర్మాణం పేద విద్యార్థులకు విద్యాభివృద్ధి గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపుకు చెరువులు, కుంటలు, చెక్ డ్యాంల నిర్మాణం, రైతులకు పండతోటల పెంపకం, తుంపర సేద్యంతో పాటు బాగా వెనుకబడిన గ్రామాలకు రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మూడు ప్రధాన హాస్పిటల్స్ ను నిర్మాణం చేపట్టి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తోంది. ఈ ఆర్ డి టి సంస్థ ద్వారా నిర్మాణం చేపట్టిన హాస్పిటల్‌లో సుమారు 8.50 లక్షల అవుట్ పేషెంట్స్ కు సుమారు 60 వేల మంది ఇన్ పేషెంట్స్ కు నిత్యం వైద్య సేవలు ఉచితంగా వైద్యం అతి తక్కువ ధరకే మెడిసిన్స్ అందిస్తోంది. సుమారు 15 వేల మందికి సర్జరీ వైద్యం, మరో 15వేల మంది మహిళలకు డెలివరీలు చేపట్టింది. ఈ సంస్థలో సుమారు 3వేల మందికి పైగా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆర్డిటి సంస్థ ద్వారా క్రీడారంగంలో యువ క్రీడాకారులకు అంతర్జాతీయ స్థాయి క్రీడా శిక్షణతో రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది గ్రామీణ ప్రాంతపు యువ క్రీడాకారులకు శిక్షణ ఇవ్వడం వలన వీరు వివిధ రంగాలలో అత్యంత ప్రతిభను చాటి మన రాష్ట్ర ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్నారు. ఇటువంటి గొప్ప ఆర్డిటి సంస్థకు కొన్ని సాంకేతిక కారణాలవల్ల ఎఫ్‌సిఆర్ఏ రెన్యువల్ చేయకుండా కేంద్రప్రభుత్వం ఆంక్షలు విధించింది. అయితే పేదల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న ఆర్డిటి సంస్థకు ఎఫ్‌సిఆర్ఏ మంజూరయ్యేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వం ద్వారా ఎఫ్‌సిఆర్ఏ మంజూరయ్యేలా న్యాయం చేయాలని ప్రత్యేకంగా విన్నవించుకుంటున్నాను.

# వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరమ్స్ సమావేశాలు నిర్వహించండి

## - రాష్ట్ర ముతవల్లీల సంఘం అధ్యక్షుడు కేఎం సైకిల్ షఫీ డిమాండ్

**అనంతపురం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో** రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలని సదుద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశములు అన్ని జిల్లాలలో జరపాలని వక్ఫ్ బోర్డ్ సీఈఓను దేశించినా ప్రతి జిల్లాలోని జిల్లా ఆధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా డిఎండబ్ల్యూ అధికారులు వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశములు జరపకుండా తగిన శ్రద్ధ చూపకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారని రాష్ట్ర ముతవలీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రతి జిల్లాలోనూ వక్ఫ్ ఆస్తులు పరిరక్షణ సమావేశములు నిర్వహించకుండా జిల్లా కలెక్టర్లు బిజీగా ఉన్నారని తప్పుడు సంకేతాలు ఇస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ల్యాండ్ గ్లాబర్లు, రాజకీయ నాయకుల కబంధ హస్తాలలో ఉన్న వక్ఫ్ స్థలాలను కాపాడడం మరిచిపోయి వారికి వత్తాసు పలుకుతూ వక్ఫ్ పరిరక్షణ సమావేశాలు ఆయా జిల్లాలలో నిర్వర్తించకపోవడం చాలా శోచనీయం అని ఆయన ఆరోపించారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్, సీఎంవో ఆఫీసు అధికారులు తక్షణమే స్పందించి అన్ని జిల్లాల కలెక్టర్లకు తప్పకుండా వక్ఫ్ ప్రొటెక్షన్ ఫోరం సమావేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తద్వారా జిల్లాలలో, తాలూకాలలో మండలాలలో తగిన కార్యచరణ చేసి వక్ఫ్ స్థలాలు కాపాడాలి అన్న నిర్ణయానికి రావలసిన అవసరం ఎంతైనా ఉందని తప్పకుండా ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం తెలిపిన షెడ్యూల్ ప్రకారం జిల్లా కలెక్టర్లు తూచా తప్పకుండా సమావేశాలు నిర్వర్తించాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ ముతవల్లిల సంఘం తరపున అధ్యక్షులు కేయం షకీల్ షఫీ డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 23 నుంచి డిసెంబర్ 15 వరకు అన్ని జిల్లాల్లోవక్ఫ్ ప్రొడక్షన్ సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఒక షెడ్యూల్ తయారుచేసి అన్ని జిల్లాలకు పంపినట్లు ఆయన వెల్లడించారు.

ఆ షెడ్యూల్ ప్రకారం అన్ని జిల్లాల్లో వక్ఫ్ ప్రొటెక్షన్ సమావేశాలు నిర్వహినకు ఆయా జిల్లా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# 19వ తేదీన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైసిపి

## - అనంతను కలిసిన జక్కంపూడి రాజా



**అనంతపురం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త బ్యూరో** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డిని ఆ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు జక్కంపూడి రాజా గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ చలో మెడికల్ కాలేజి కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో నిర్మాణంలో ఉన్న మెడికల్ కళాశాల భవనాన్ని శుక్రవారం జక్కంపూడి రాజాతో పాటు వైసీపీ నేతలు పరిశీలించనున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి అనంతపురానికి చేరుకున్న జక్కంపూడి రాజా అనంత వెంకటరామిరెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు జక్కంపూడి రాజాకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తాజా రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు.

# అరంగేట్రం ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా రామ్‌చరణ్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** భారత్‌లో తొలిసారి నిర్వహించనున్న ఆర్చరీ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్)కు గ్లోబల్ ఐకాన్ రామ్‌చరణ్‌ను బ్రాండ్ అంబా సిడర్‌గా నియమిస్తున్నట్లు జాతీయ ఆర్చరీ అసోసియేషన్(ఏఏఐ) అధ్యక్షుడు అర్జున్ ముండా, ఏఏఐ ప్రధాన కార్యదర్శి వీరేంద్ర సచ్‌దేవా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలోని యమున స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా అక్టోబర్ 2నుంచి 12 వరకు అరంగేట్రం ఏపీఎల్ జరుగనుంది. ఫ్రాంచైజీ ఆధారిత లీగ్‌గా జరుగబోతున్న టోర్నీలో ఆతిథ్య భారత్‌లోని పురుష, మహిళా కాంపౌండ్, రికర్వ్ ఆర్చర్లతో పాటు వివిధ దేశాల ఆర్చర్లను ఒక చోటుకు చేర్చనుంది.



ఉరవకొండ బస్ స్టేషన్‌లో మహిళా ప్రయాణీకులతో స్త్రీశక్తి పథకంపై ఆరా తీస్తున్న ఆర్టీసీ వైస్ ఛైర్మెన్, ఎండీ సి.హెచ్.ద్వారకా తిరుమల రావు

# 1,050 ఎలక్ట్రిక్ బస్సులతోపాటు మరో 1,500 కొత్త బస్సులు

## - ఇతర రాష్ట్రాల తరహాలో విమర్శలకు తావులేకుండా స్త్రీశక్తి పథకం అమలు

### - ఆర్టీసి వైస్ ఛైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్.ద్వారకా తిరుమలరావు

**ఉరవకొండ, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** రాష్ట్రంలో కొత్తగా మంజూరైన 1,050 ఎలక్ట్రిక్ బస్సులతోపాటు మరో 1,500 కొత్త బస్సులను కొనగోలు చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయించారని ఆర్టీసీ వైస్ చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ సి.హెచ్.ద్వారకా తిరుమలరావు తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఉరవకొండ ఆర్టీసీ డిపోను, బస్ స్టేషన్, కార్గో పార్సిల్ సర్వీస్ కేంద్రాలను ఆయన సంస్థ కడప జోనల్ ఛైర్మెన్ పూల నాగరాజుతో కలిసి తనిఖీ చేశారు. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో బస్సులు ఎక్కి మహిళా ప్రయాణీకులతో స్త్రీశక్తి పథకం అమలు, ఉపయోగాలపై ఆరా తీసి సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర ్బంగా ఎండీ సి.హెచ్.ద్వారకా తిరుమలరావు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆగస్టు 15న మహిళలకు ప్రధానమైన శ్రావణ శుక్రవారం రోజు స్త్రీశక్తి పథకం అమలులోకి వచ్చిందన్నారు. మిగతా రాష్ట్రాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వివిధ విమర్శలకు గురైన దృష్ట్య సమగ్రంగా అధ్యయనం చేసిన తరువాతే రాష్ట్రంలో అమలులోకి తెచ్చి పకడ్బందీగా, విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. స్త్రీశక్తి పథకం అమలులోకి రాకముందు రాష్ట్రంలో మహిళా ప్రయాణీకుల సంఖ్య నూటికి 40శాతంగా ఉండగా పురుషుల సంఖ్య 60శాతం ఉందని పథకం అమలులోకి వచ్చిన తరువాత మహిళా ప్రయాణీకుల సంఖ్య 65శాతం, పురుష ప్రయాణీకుల సంఖ్య 35కు చేరిందన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఆక్యూపెన్సీ రేషియో (ఓఆర్) 69శాతం నుంచి 80 శాతానికి పెరిగిందన్నారు. ఉచిత బస్సుల్లో ఓఆర్ 76 శాతంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 129 ఆర్టీసీ డిపోల్లో 60 డిపోల్లో ఓఆర్ 100శాతం దాటిపోయిందన్నారు. సెప్టెంబర్ 6న తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం డిపోలో ఓఆర్ 130శాతం నమోదైందని వివరించారు. రాష్ట్రంలోని మహిళలు అవసరం మేరకే ప్రయాణం చేస్తున్నారన్న ఎండీ ఇతర రాష్ట్రాల కంటే రాష్ట్రంలో ఉచిత ప్రయాణ సౌకర్యం సజావుగా సాగుతోందన్నారు. కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణీకుల పట్ల సహనంతో ఉండాలని సూచించామన్నారు. స్త్రీశక్తి పథకం సమర్థవంతంగా అమలు చేస్తూనే బస్ స్టేషన్లలో సౌకర్యాల మెరుగుపై దృష్టి కేంద్రీకరించామన్నారు. ప్రయాణీకులు బస్సుల కోసం వేచి ఉండటానికి త్రీ సీట్ బల్లలు సరఫరా చేశామని తాగునీరు, టాయిలెట్ల సౌకర్యాలను మరింత పటిష్టంగా నిర్వహించడానికి కాంట్రాక్టులు ఇవ్వనున్నామన్నారు. ఇంటర్ స్టేట్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఎక్కువగా రాయలసీమ, క్రిష్ణా, ఉత్తరాంధ్ర జిల్లాల నుండి వినతులు వస్తున్నాయని ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి మండలి త్వరలోనే ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఎండీ సి.హెచ్.ద్వారకా తిరుమల రావు వెల్లడించారు.

# దసరా ఏర్పాట్లపై సమీక్ష - హుండీ ఆదాయం రూ.2కోట్లు

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త** దుర్గమ్మ ఆలయంలో నిర్వహించబోయే దసరా ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై ఛీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ డి భ్రమరాంబ సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను తెలుసుకుని పలుసూచనలు చేశారు. 72 గంటల్లో ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలకోసం అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. - రెండు లక్షల వాటర్ బాటిల్స్: దసరాల్లో భక్తులకు అందించేందుకు రెండు లక్షల వాటర్ బాటిల్స్‌ను ఇప్పటికే సిద్ధం చేశారు. - అన్నదాన భవనం పరిశీలన: ఇఒ వికె శీనానాయక్ గురువారం అన్నదాన భవనం పరిశీలించి అక్కడ దసరాల్లో జరగబోయే అన్నదాన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు నిరంతరం ప్రసాదం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్ రమా, ఏఇఒలు శ్రీనివాస్, వేంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కెనాల్‌రోడ్డులో దసరా ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

- హుండీ ఆదాయం రు.2కోట్లు: అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారికి భక్తులు హుండీల ద్వారా స మర్పిం చిన కాను కలను గు రు వారం లెక్కిం చగా రు. 2,17,98,528ల నగదు, 235గ్రాముల బంగారం, 3కెజిల 970 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ యుఎస్ 321 డాలర్స్, సింగపూర్‌డాలర్స్ 10, యుఎఇ దిర్హమ్స్ 35, సౌదీ రియాల్స్ 25, ఒమన్ బైసా 200, ఖతార్ 24 రియాల్స్, మలేషియా 2 రింగట్లు, 65యూరోలు, కువైట్ 5.1/2 దీనార్లు, హాంకాంగ్ 500 డాలర్లు, థాయిలండ్ 40 బాట్, బహ్రెయిన్ 11 దినార్లు లభించాయని ఇఒ వికె శీనానాయక్ తెలిపారు. - క్యూలైన్లను పరిశీలించిన ఎమ్మెల్యే: దసరా ఉత్సవాలకోసం ఏర్పాటుచేసిన క్యూలయిన్లను ఎమ్మెల్యే సుజనా చౌదరి గురువారం ఇఒ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దసరా ఉత్సవాలు మరింత ఘనంగా నిర్వహిస్తామన్నారు. విజయవాడ ఉత్సవ్‌ను కూడా వైభవంగా నిర్వహిస్తామన్నారు. దుర్గమ్మవారిని సుజనాచౌదరి దర్శించుకున్నారు.



మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆహ్వానం అందిస్తున్న ఇఒ

# రైల్వేలో క్యూఆర్ కోడ్‌ను యూటిఎస్ యాప్‌తో స్కాన్‌చేస్తే రైల్వే జనరల్ టిక్కెట్లు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 18,ప్రభాతవార్త** ప్రస్తుత పండుగల సీజన్‌లో సాధారణ తరగతి ప్రయాణికుల సౌకర్యార్థం తెలుగు రాష్ట్రాలలోని దక్షిణ మధ్య రైల్వే ఆధునిక పరిజ్ఞానంతో మౌలిక సౌకర్యాలను కల్పించడం ద్వారా ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తమ ప్రయాణాన్ని సాఫీగా కొనసాగించేందుకు చర్యలు చేపట్టింది. రిజర్ ్వ టిక్కెట్లను సులభతరంగా కొనుగోలు చేయడానికి 'యూటిఎఫ్' మొబైల్ అప్లికేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఆధునిక టికెటింగ్ వ్యవస్థలో యూటిఎఫ్‌తో మరో ముందడుగు వేసింది. భారతీయ రైల్వేలో సాధారణ తరగతిలో భారీ సంఖ్యలో ప్రయాణించే ప్రయాణికులకు యూటిఎఫ్ మొబైల్ యాప్ ద్వారా టిక్కెట్ల కొనుగోలును ప్రోత్సహించడానికి దక్షిణ మధ్య రైల్వే ఒక నూతన విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. రెట్రో రిఫ్లెక్టివ్ జాకెట్లు వెనుక వైపు క్యూఆర్ కోడ్ ముద్రించబడిన యూటిఎఫ్ యాప్/రైల్ వన్ యాప్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా జనరల్ టిక్కెట్లను కొనుగోలు చేసే సౌకర్యం ఏర్పాటు చేయబడింది. స్టేషన్ కాన్కోర్స్ ప్రాంతంలో యూటిఎఫ్ మొబైల్ యాప్‌ను ప్రోత్సహించడానికి నియమించబడిన వ్యక్తులు ఈ జాకెట్లను ధరిస్తారు. రైలు వినియోగదారులు యూటిఎస్/రైల్ వన్ యొక్క మొబైల్ అప్లికేషన్‌తో జాకెట్ వెనుక భాగంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యూటిఎఫ్ అప్లికేషన్ ద్వారా వినియోగించి టిక్కెట్లను కొనుగోలు చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి సిబ్బంది, ప్రయాణికులకు తెలియజేస్తారు. ఈ ముఖాముఖీ విధానం యాప్ యొక్క వినియోగదారు-స్నేహపూర్వక లక్షణాల గురించి, ముఖ్యంగా క్యూఆర్ కోడ్ ఆధారిత టికెటింగ్ గురించి ప్రయాణికులలో అవగాహన కల్పించడంలో సహాయపడుతుంది. ఇది టికెట్ కౌంటర్ వద్ద క్యూలను, ప్రయాణికుల సమయం వృధా కాకుండా, నగదు రహిత, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించేందుకు సహాయ పడుతుంది. ఈ అధునాతన వ్యవస్థ జోన్‌లోని ఆరు డివిజన్‌లలోని ప్రధాన స్టేషన్‌లైన సికింద్రాబాద్, కాచిగూడ, విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, తిరుపతి, నాందేడ్ మొదలైన వాటిలో ప్రవేశపెట్టబడింది. జనరల్ టిక్కెట్ల కొనుగోలు కోసం మొదట విధించిన దూర పరిమితులను సడలించారు. రైలు వినియోగదారులు ఇప్పుడు స్టేషన్ ప్రాంగణం మరియు రైల్వే ట్రాక్ నుండి 5మీటర్ల దూరంలో ఉన్న ఏ ప్రదేశం నుండైనా టిక్కెట్లను కొనుగోలు చేయవచ్చు. సరళంగా చెప్పాలంటే ప్రయాణికుడు తమ ఇంటి నుండే తమ టిక్కెట్లను(జర్నీ/ప్లాట్‌ఫామ్ టిక్కెట్లు రెండూ) బుక్ చేసుకోవచ్చు. జనరల్ టికెట్లను కొనుగోలు చేయడానికి పొడవైన క్యూలలో నిలబడకుండా రైలులో ప్రయాణం చేసే సౌకర్యం. స్టేషన్ కాన్కోర్స్ ప్రాంతంలో ఉన్న ప్రయాణికులు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా టిక్కెట్లను కొనుగోలు చేయవచ్చు.



రైల్వేలో క్యూఆర్ కోడ్‌ను యూటిఎస్ యాప్‌తో స్కాన్ చేయడం ద్వారా జనరల్ టిక్కెట్ పొందే విధానాన్ని ప్రయాణికులకు వివరిస్తున్న సిబ్బంది

# కంగుందిని పర్యాటక కేంద్రంగా మార్చుతాం

## - ఆర్టీసి వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం - కుప్పంలో తొలిసారి బౌల్డరింగ్ జిమ్ నిర్మాణం!

**కుప్పం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** సుమారు వెయ్యేళ్ళ చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచే కంగుంది ప్రాంతాన్ని సిఎం చంద్రబాబునాయుడు సూచనలతో పర్యాటక కేంద్రంగా మార్చుతామని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. గురువారం కంగుంది గ్రామంలో తదేకం ఫౌ ండేషన్ అధ్వర్యంలో బౌల్డరింగ్ జిమ్ నిర్మాణానికి వారు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కంగుంది దుర్గంలో ఇటీవలే ట్రెక్కింగ్ యాత్రలను విజయవంతంగా మొదలు పెట్టినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని అందమైన ప్రకృతి రమణీయతతో కూడిన ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. యువతలో ట్రెక్కింగ్, రాక్ క్లైంబింగ్ వంటి కార్యక్రమాతో శారీరక దృఢత్వం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కుప్పం ప్రాంతంలో తొలిసారి బౌల్డరింగ్ జిమ్‌ను ప్రారంభించడం జరుగుతోందన్నారు. కుప్పం ప్రాంతంనుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులు ఎదిగేలా తగు ప్రోత్సాహం కల్పిస్తామన్నారు. సిఎం చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా కుప్పాన్ని ఆదర్శ నియోజకవర్గంగా మలుస్తున్నారన్నారు. విద్య, వైద్యం, ఆరోగ్యం, పారిశ్రామిక రంగాల్లో సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలు పరుగులు పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ధనశేఖర్, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, నేతలు దివాకర్, షరీఫ్, మునాఫ్, తిరుపతి, తదేకం ఫౌండేషన్‌ప్రతినిధులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఆర్టీసీ వైస్ ఛైర్మన్, కడ పి.డి

# మారేడ్‌పల్లిలోని ఓ వ్యాపారవేత్త ఇంట్లో ఇడి సోదాలు

**హైదరాబాద్ (కంటోన్మెంట్), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లి ఏటిసి సెంటర్ రోడ్డులోని వెల్డింగ్‌టన్ ఎన్‌క్లేవ్‌లో నివాసం ఉంటున్న వ్యాపార వేత్త బూరుగు రమేష్ కుమారుడు, అతని కుమారుడు నివాసాలపై ఈడి అధికారులు గురువారం సోదాలు నిర్వహించారు. వెల్డింగ్ టన్ ఎన్‌క్లేవ్‌లోని ఫ్లాట్ నెం 26లో నివాసం ఉంటున్న రమేష్ ఇంట్లో ఈడి అధికారులు రెండు బృందాలతో ఈడి సోదాలు నిర్వహించారు.

# పిల్లలకు సురక్షిత నగరంగా హైదరాబాద్

## 'క్లాప్ ఫర్ చిల్డ్రన్' పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రులు సీతక్క, పొన్నం



**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో 'క్లాప్ ఫర్ చిల్డ్రన్- పిల్లల భద్రత కోసం నగరస్థాయి కార్యాచరణ ప్రణాళిక'ను తెలంగాణ ప్రభుత్వం, యూనిసెఫ్ సంయుక్తంగా ప్రారంభించింది. పిల్లలకు హైదరాబాద్‌ను సురక్షిత నగరంగా మార్చుతామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రవాణా, బిసి శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. క్లాప్ ఫర్ చిల్డ్రన్ పోస్టర్‌ను సచివాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, హైదరాబాద్‌ను 'పిల్లలకి సురక్షిత నగరం'గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తుందని.. ఇతర నగరాలు, రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామన్నారు. ఈ ప్రయత్నంలో యూనిసెఫ్ సంస్థకు పూర్తి సహకారం అందిస్తామని వెల్లడించారు. ఈ ప్రణాళిక ద్వారా ప్రభుత్వ విభాగాలు, చట్టపరమైన సంస్థలు, సమాజం కలిసి పిల్లలు సురక్షితంగా, ఆరోగ్యంగా ఎదగడానికి కృషి చేయనున్నారు. చట్టపరమైన సంస్థలు, ఫ్రంట్‌లైన్ సేవలను బలోపేతం చేసి, మహిళా శిశు సంక్షేమ, పోలీసు, ఆరోగ్యం, విద్య, కార్మిక, జిహెచ్ఎంసి వంటి విభాగాల సమ న్వయంతో బుల్లీయింగ్, ఈవ్‌టీజింగ్, అసురక్షిత రవాణా, మాదకద్రవ్యాల వినియో గాన్ని నివారించడానికి చర్యలు చేపడతారు. బాలల రక్షణ సెల్‌లు, విజిలెన్స్ కమిటీల ద్వారా డేటా ఆధారిత మానిటరింగ్ జరుగుతుంది. అలాగే ఫ్రంట్‌లైన్ వర్కర్లకు, పిల్లలకు అనుకూలమైన, శిక్షణ ఇవ్వ నున్నారు. ఈ కార్యక్రమంలో మహిలా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి శ్రీమతి అనితా రామచంద్రన్, యూనిసెఫ్ చీఫ్ ఆఫ్ ఫీల్డ్ ఆఫీస్ డా. జెలాలెం బిర్హాను టాఫెస్సే తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థిపై కాలేజీ ఫ్లోర్ ఇన్‌చార్జి దాడి

## మలక్‌పేట్ పోలీసులకు విద్యార్థి తల్లిదండ్రులు ఫిర్యాదు



పోలీస్‌స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి కుటుంబసభ్యులు

**హైదరాబాద్ (మలక్‌పేట), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** దిల్‌షుక్‌నగర్ గడ్డిఅన్నారం నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిపై ఫ్లోర్‌ఇన్‌చార్జ్ దాడి చేయడంతో విద్యార్థి ఎడమ దవడ ఎముక విరిగిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధిత విద్యార్థి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అల్మాస్ గుడా ప్రాంతానికి చెందిన డి. సంతోష్ కుమార్ కుమారుడు దొంతిక సాయి పునీత్ దిల్‌షుక్‌నగర్ గడ్డిఅన్నారం నారాయణ జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 15వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల 15 నిమిషాల సమయంలో ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన వాగ్వాదం విషయంలో ఫ్లోర్ ఇంచార్జ్ మాలి సతీష్ జోక్యం చేసుకొని సాయి పునీత్ పై దాడి చేసి కొట్టడంతో సాయి పునీత్ ఎడమ దవడ ఎముక విరిగి పోయింది. సంఘటన గురించి కళాశాల నిర్వహాకులు తమకు తెలియ జేయలేదని, తమ కుమారుడు సాయిపునిత్ సంఘటన గురించి తమకు చెప్పడంతో దాడి గురించి తమకు తెలిసిందని విద్యార్థి తల్లిదండ్రులు పేర్కొ న్నారు. సంఘటన గురించి కళాశాల మేనేజ్మెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని విద్యార్థి తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ సంఘటన గురించి చర్యలు తీసుకోవాలని విద్యార్థి తల్లిదండ్రులు మలక్ పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని మలక్ పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ పేర్కొన్నారు.

# బస్తీల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

## అభివృద్ధి కాలనీలకే పరిమితం కావొద్దు

## దిశ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో హరిచందన తదితరులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** హైదరాబాద్ అంటే జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ కాదని, నిజమైన హైదరాబాద్ బస్తీల్లో ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బస్తీలు, మురికివాడల్లో ఇంకా పేద ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారం కోసం అధికారులు ప్రణాళికలు రూపొందించి సమన్వయంతో పని చేయాలన్నారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్ ఆర్డీలో గురువారం హైదరాబాద్ జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) సమావేశం గురు వారం కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. జీహెచ్ఎంసీ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ, కేంద్ర సహాయక పథకాలు(సీఎస్ఎస్), ప్రాజెక్టుల అమలు స్థితిపై సమీక్షించారు. గత దిశ సమావేశం తరువాత తీసుకున్న చర్యలపై నివేదికలను పరిశీలించి పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర పథకాలను సమయానుకూలంగా, సమర్థవంతంగా అమలు చేయాలని, శాఖల మధ్య సమన్వయం ముఖ్యమన్నారు. నగరంలో నిధుల కొరత ఉన్నప్పటికి లభ్యమవుతున్న నిధులను సమర్థవంతంగా వినియోగవించుకొని అభవివృద్ధి చేయాలన్నారు. నగరంలో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్లు జలమయమై ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. నాంపల్లిలో ఇద్దరు, సనత్‌నగర్‌లో ఒక యువకుడు నాలాలో కొట్టుకు పోవడం దుర దృష్టకరమని అన్నారు. పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలతో అన్ని శాఖల అధికారులు కలిసి పనిచేసి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచాలన్నారు. పాఠశాలలు, సామాజిక భవ నాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టళ్లపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాలన్నారు. తెలంగాణ ఏర్పడిన అనంతరం నగర అభివృద్ధికి నిధుల కొరత ఏర్పడిందన్నారు. సంక్షేమం, మౌళికసదుపాయాలు, అభివృద్ధి, విద్య తదితర అంశాలపై దిశా సమా వేశంలో చర్చించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన, వివిధ శాఖల ప్రతి నిధులు, సీనియర్ అధికారులు పాల్గొ న్నారు.

# మాదకద్రవ్యాల నివారణ అందరి బాధ్యత

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం : మంత్రి జూపల్లి

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** యువత జీవితాలకు ప్రమాదకరంగా మారిన మాదకద్రవ్యాల నివారణ సమాజంలో అందరి బాధ్యత అని రాష్ట్ర పర్యాటక, ఆబ్కారీ, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్‌లో గల మఖ్దూమ్ భవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ హాల్లో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్య మండలి నిర్వహించిన మాదకద్రవ్యాల వల్ల కలిగే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళారూపాల వర్కుషాప్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేణి శంకర్, సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ ఛాయాదేవి, సమితి సభ్యులు మరుపాక అనిల్ కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి స్టాలిన్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, ఉపాధ్యక్షులు కె లక్ష్మి నారాయణ తోపాటు కళాకారులూ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజా నాట్య మండలి నాటక బృందం మాదక ద్రవ్యాల నివారణ, అవగాహన కల్పించడానికి రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాల యాలు, కళాశాలలు, పాఠశాలల వద్ద తమ కళారూపాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని వసతులు, సౌకర్యాలతో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామని తెలిపారు.

# సామాజిక ఉద్యమంగా వనమహోత్సవం

## జిల్లాల వారీగా లక్ష్యాలపై ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్‌నదీమ్ సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు 2025సంవత్సర వన మహోత్సవం కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా సాగుతుంది. జిల్లాలు, డిపార్టుమెంట్లవారీగా మొక్కలు నాటడంపై గురువారం సచివాలయంలోని అటవీశాఖ మంత్రి ఛాంబర్‌లో ఉన్నతాధికారులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని అటవీ, పర్యావరణ శాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ సువర్ణ నిర్వహించగా, అన్ని విభాగ అధికారులు పాల్గొన్నారు. ఇప్పటివరకు మొక్కలు నాటిన ప్రాంతాలకు జీయో టాగింగు పూర్తనట్టు గుర్తించారు. ఈ సంవత్సరం 18.03 కోట్ల మొక్కలు టార్గెట్ పెట్టుకోగా... 13.84 కోట్ల మొక్కలు ప్లాంటేషన్ పూర్తి చేసినట్టు వివరించారు. 77 శాతం టార్గెట్ పూర్తి చేసినట్టు స్పష్టం చేశారు. అయితే, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని మరింత విస్తరింప చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది మొక్కలు పెంచే కార్యక్రమాన్ని వన మహోత్సవం పేరిట చేపడుతున్న విషయం తెలిసిందే. అటవీ అధికారులు సిద్ధం చేసిన పీపీటీని ప్రిన్స్‌పల్ సెక్రటరీ, పీసీసీఎఫ్ వీక్షిం చారు. సమగ్రంగా వివరాలు అడిగి తెలుసు కున్నారు. అన్ని డిపార్టుమెంట్లలో ఈ మొక్కలు నాటుతున్నప్పుడు ఎదరవుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టి వచ్చింది. అయితే, గత ఏడాది అనుభవాల ఆధారంగా మరింత పక్కాగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు వన మహోత్సవం కింద పకడ్బందీ కార్యచరణ రూపొందిం చాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.. అన్ని మండలాలు, గ్రామాలు, మున్సిపాలిటీల్లో పెద్దఎత్తున మొక్కలు నాటేందుకు సన్నద్ధం అవ్వాలని ఆదేశించారు. ఈ సారి 100 శాతం మనం పెట్టుకున్న టార్గెట్ రీచ్ కావాలని మంత్రి సురేఖ ఆదేశించిన విషయాన్ని అధికారులు గుర్తు చేశారు.

# 30న సద్దుల బతుకమ్మ రోజును సెలవుదినంగా ప్రకటించాలి

## సిఎస్‌కు టిజిఎంప్లాయీస్ జెఎసి విజ్ఞప్తి

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** సద్దుల బతుకమ్మ పండుగైన సెప్టెంబరు 30న సెలవు దినంగా ప్రకటించాలని తెలంగాణ ఎంప్లాయీస్ జేఏసి డిమాండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె కృష్ణారావుకి టిజిఈజేఏసి గురువారం వినతిపత్రం సమర్పించింది. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం మహిళలు సద్దుల బతుకమ్మ పండుగను పెద్ద ఎత్తున జరుపుకుంటారని అందుకే ఈ నెల సెప్టెంబర్ 30న జరిగే సద్దుల బతుకమ్మ పండుగ రోజును సెలవుదినంగా ప్రకటించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావుని టిజిఈజేఏసి చైర్మన్ మారం జగదీశ్వర్ జేఏసి నేతలతో కలిసి కోరారు.

# రెండు ఆటోలు ఢీ

## భూత్పూరు వద్ద ఘోరప్రమాదం

## ముగ్గురు మృతి, పలువురికి గాయాలు

**భూత్పూర్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కొత్తమొల్గర గ్రామ శివారులో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు ఆటోలు పరస్పరం ఢీకొన్న సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయా లయ్యాయి. భూత్పూర్ పోలీస్ ఎస్సై చంద్రశేఖర్ తెల్పిన వివరాల ప్రకారం ఖిల్లాఘన్‌పూర్ నుంచి భూత్పూర్‌కు ఐదుగురు ప్రయాణీకులతో వస్తున్న టీజీ 32టీ 2284 నెంబరు గల ఆటో, మహబూబ్‌నగర్ నుంచి కూల్ డ్రింక్స్ లోడ్‌తో నాగర్‌కర్నూల్ వైపు వెళ్లే మరో ఆటో పర స్పరం ఢీకొన్నాయి.
ప్రమాదంలో ఐదుగురు ప్రయాణీకులతో ఖిల్లాఘన్‌పూర్ నుంచి భూత్పూర్ వైపు వస్తున్న ఆటోలో ప్రయాణించే ఖిల్లా ఘన్‌పూర్ గట్టుకాడిపల్లికి చెందిన గుంపల్లి వంశీ (24), ఇదే మండలం దొంతికుంటతండాకు చెందిన పాత్లావత్ సక్రి(33), భూత్పూర్ మండలం పోతుల మడుగుకు చెందిన చౌదరి నర్సింహారెడ్డి (56) మృతి చెందారు. ఇరువురు వంశీ, నర్సింహారెడ్డి అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ పాత్లావత్ సక్రి తలకు బలమైన గాయాలతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

# రోడ్డు భద్రతలో ట్రాఫిక్ పోలీసుల పాత్ర కీలకం

## హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సదస్సును ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** పిల్లలు పాఠశాల నుంచి సురక్షితంగా ఇంటికి చేరాలన్నా, రోగులు సమయానికి ఆస్పత్రికి చేరాలన్నా, ప్రజలు ఒత్తిడి లేకుండా ప్రయాణించాలన్నా ట్రాఫిక్ పోలీసుల పాత్ర ఎంతో కీలకమని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. గురువారం నెక్లెస్‌రోడ్డులోని జలవిహార్‌లో హైదరాబాద్ సిటీ పోలీసు సంయుక్తంగా నిర్వహించిన ట్రాఫిక్ రోడ్డు భద్రతా సమ్మిట్ 2025ను గవర్నర్ జిష్ణుదేవ్ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రారంచారు. ఈ సమ్మిట్ రెండు రోజులుపాటు జరగనుంది. సమ్మిట్‌లో నగరంలోని ట్రాఫిక్ నిపుణులు, పరిశ్రమ ప్రముఖులు, విద్యావేత్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంగా హెచ్‌సీఎస్‌సీ ఇతర నగరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. విద్యాసంస్థలు ఇతరులు ట్రాఫిక్ విభాగానికి సహకరించాలని కోరారు. నగర పోలీసు కమిషనర్ సివి ఆనంద్ మాట్లాడుతూ నగరంలో రోజు రోజుకు పెరుగుతున్న వాహానాలతో ట్రాఫిక్ కు అంతరాయం లేకుం డా ఉండేందుకు చేపట్టా ల్సిన అన్ని రకాలైన ముందస్తు జాగ్రత్త చర్యలు ఎప్పటి కప్పుడు చేపడుతున్నట్లు ఆయన పేర్కొ న్నారు. 92లక్షల వాహ నాలు, రోజుకు 1500కొత్త వాహానాలు రోడ్లపై ప్రయాణిస్తున్నాయ న్నారు. ట్రాఫిక్ నిర్వహణ నగర భద్ర తకు కీలకమని ఆయన అన్నారు. ప్రజల సహకారంతో ఎప్పటి కప్పుడు ట్రాఫిక్‌లో మార్పులు చేసుకుంటూ ప్రజలు, వాహన దారులకు ఇబ్బందులు రాకుండా చూసు కుంటు న్నామన్నారు. ప్రజల సహకారాన్ని పోలీసుల తరుపున అభినందిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో అడిషినల్ సీపీ విక్రమ్ సింగ్‌మాన్, జాయింట్ సీపీ జోయల్ దేవిస్, హెచ్‌సీఎస్‌సీ ట్రాఫిక్ ఫోరం జాయింట్ సెక్రటరీ వి.రాజశేఖరరెడ్డి, ట్రాఫిక్, ఎల్అండ్‌ఓ విభాగాల అన్ని డీసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రోడ్డు భద్రతా సదస్సును ప్రారంభిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

# మైనారిటీ గురుకులాల్లోని టీచర్లకు వేతనాలు చెల్లించాలి

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులను పర్మనెంట్ చేయాలి

## రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** మైనారిటీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పది నెలల వేతనం తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వందలాది మంది ఉపాధ్యాయులు గురు వారం నాడిక్కడ మైనార్టీ గురుకుల కార్యాలయా న్ని ముట్టడించారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, బిసి విద్యార్థి సం ఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న టీచర్స్ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అక్కడే మొహరించిన పోలీసులు ఈ ముట్టడిని అడ్డుకునేందుకు ప్రయ త్నించారు. దీంతో పోలీసులకు వ్యతిరేకంగా టీచర్స్‌కు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కొద్ది సేపు ఉద్రిక్తత వాతావరణ ఏర్పడింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య టీచర్స్, పోలీసులను శాంతింప జేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణ య్య, పిజిఆర్‌టి రాష్ట్ర అధ్యక్షుడు వేమ్‌రెడ్డి దిలీప్‌రెడ్డి, ఎస్‌టియు అధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ మైనార్టి గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్-ఔట్‌సోర్సింగ్ టీచర్లను పర్మినెంట్ చేయాలని, ఏడాదికి 12 నెలలకు వేతనాలు చెల్లించాని డిమాండ్ చేశారు. ఈ కాంట్రాక్ట్ టీచర్లకు రెగ్యులర్ టీచర్లకు ఉండే అన్ని అర్హతలు ఉన్నాయని, పోస్టులకు తగు బిఇడి, డిఇ విద్యార్హత ఉందని, నోటిఫికేషన్ ద్వారా, మేరిట్ కమ్ రోస్టర్ ద్వారా ఈ మేరకు ఎంపిక చేయడం జరిగిందన్నారు.

# సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా ఏనుగు నరసింహారెడ్డి బాధ్యతలు స్వీకరణ



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న డా. ఏనుగు నరసింహారెడ్డి, ఆచార్య నిత్యానందరావు, డా. ఎన్.బాలాచారి తదితరులు


**హైదరాబాద్ (రవీంద్రభారతి), సెప్టెంబరు 18, ప్రభాతవార్త :** రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడుగా డా. ఏనుగు నరసింహారెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం నిన్ననే సంచాలకుడుగా నియ మిస్తూ జీఓ విడుదల చేసింది. రెండు సంవ త్సరాలపాటు డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమితులైన నరసింహారెడ్డి గురువారం రవీంద్రభారతి ప్రాంగణం కళాభవన్‌లోని భాషా సాంస్కృతికశాఖ కార్యాలయంలో సంబంధిత పత్రాలపై సంతకం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఏర్పాటు చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీలో తొలి ఛైర్మన్ డా. నందిని సిధారెడ్డితో కలిసి, తొలి కార్యదర్శిగా పనిచేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి, ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలు విజయవంతం కావడానికి విశేష కృషిచేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్‌శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు నరసింహారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా. నామోజు బాలాచారిలతో పాటు పలువురు ప్రముఖులు, సాహిత్యవేత్తలు, సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, రవీంద్రభారతి, సాంస్కృతికశాఖ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## తహశీల్దార్ కార్యాలయంలో

# ఎసిబి దాడులు

## లంచం కేసులో పట్టుబడిన ఇద్దరు అధికారులు

**వనపర్తి క్రైమ్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ఏసీబీ వలలో రెవెన్యూ అధికారులు ప్రభుత్వ ఉద్యోగుల్లో అవినీతి ఆగడాలు ఆపడానికి ఏసీబీ కఠిన చర్యలు కొనసాగిస్తోంది. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట లంచగొండి అధికారులు పట్టుబడుతున్నా, అవినీతి ఆగకపోవడం విచారకరం. తాజాగా వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని తాహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ దాడులు నిర్వహించి, రెవెన్యూ విభాగానికి చెందిన ఇద్దరు అధికారులను అదుపులోకి తీసుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని నిర్విన్ గ్రామానికి చెందిన రైతుకు చెందిన ఇనాం భూమి రద్దు కోసం వనపర్తి ఆర్డిఓకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును వనపర్తి ఆర్డిఓ కార్యాలయం నుండి సంబంధిత మండలం కొత్తకోట తహసిల్దార్ కార్యాలయానికి పంపించారు. ఆర్డిఓ ఆదేశాల మేరకు కొత్తకోట మండల తహసిల్దార్ ఆ కార్యాల యంలోని ఎంఆర్ఐ వాసు అదేవిధంగా డిప్యూటీ సర్వేయర్ నవీన్ రెడ్డిలకు దరఖాస్తును పరిశీలించాలని సూచించారు. దరఖాస్తును పరిశీలించిన అధికారులు అనుకూలంగా వివరణ అందించేందుకు రూ. 40,000 డిమాండ్ చేయగా రైతు ఎసిబిని ఆశ్రయించాడు. ఏసీబీ బృందం లింగస్వామి, జిలాని, కిషన్ నాయక్ లతో గురువారం కొత్తకోట మండల కార్యాలయంలో సంబంధిత అధికారులను విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.



# సిఎం రేవంత్‌రెడ్డితో ఎన్వీఎస్ రెడ్డి భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా)గా బాధ్యతలు స్వీకరించిన ఎన్వీఎస్ రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంకు పుష్ప గుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. నగర రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడానికి తగు సలహాలు ఇవ్వవలసిందిగా ముఖ్యమంత్రి ఎన్వీఎస్ రెడ్డికి సూచించారు.

# ఎస్‌సి గురుకుల విద్యార్థులు జాతీయస్థాయిలో ప్రతిభ చాటేలా ప్రణాళికలు రూపొందించాలి


## గురుకుల కార్యదర్శి కృష్ణఆదిత్యకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూచన

**హైదరాబాద్, సెప్టెంబరు 18, ప్రభాతవార్త:** ఎస్‌సి గురుకుల సొసైటీ నూతన కార్యదర్శిగా ఇంటర్ విద్య డైరెక్టర్ కృష్ణ ఆదిత్య గురువారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. మాసబ్‌ట్యాంక్‌లోని డిఎస్ఎస్ భవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గురుకులాలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నూతన కార్యదర్శికి పలు సూచనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ... గురుకుల విద్యాలయాల విద్యా ర్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకునేలా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది సమన్వయంతో విద్యా ర్థులకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలనీ, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రోత్సహించే విధంగా అకడమిక్ కార్యక్రమాలు అమలు చేయాలని సూచించారు. విద్యా ప్రమాణాల పెంపు దిశగా కృషి చేయాలని ఆకాంక్షి ంచారు.
గురుకుల కార్యదర్శిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన కృష్ణ ఆదిత్య.. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల విద్యా ప్రగతి, శిక్షణా ప్రమాణాల పెంపుపై మరింత దృష్టి సారించాలన్నారు. ప్రతి ఉద్యోగి తాను నిర్వహిస్తున్న బాధ్యతను సమగ్రంగా నిర్వర్తించాలని, పరి పాలనలో పారదర్శకత, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయ పాలనను కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు.

# ముందు నీ పార్టీని చక్కబెట్టుకో

## జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో దమ్ముంటే సత్తా చూపించు

## కెటిఆర్‌పై మంత్రి పొంగులేటి ధ్వజం



**ఏదులాపురం మున్సిపాలిటీ, ప్రభాతవార్త :** నీకు విజన్ ఉందా? నీ నాన్నకు ఉందా తెలుసుకో కేటీఆర్ ... ముందు నీ ఇంటిని, నీ పార్టీని చక్కబెట్టుకో.. మూడున్నరేళ్ల తర్వాత వచ్చే ఎన్నికల్లో నువ్వు అమెరికాలో ఉంటావా.. ఇండియాలో ఉంటావా అన్నది కూడా రాష్ట్ర ప్రజలకు సందేహమే. దమ్ముంటే రానున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో మీ పార్టీ సత్తా చూపించండి" అంటూ తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కేటీఆర్‌కు సవాల్ విసిరారు. గురువారం వరంగల్ క్రాస్ రోడ్‌లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 80కుటుంబాలకు చెందిన వారు కాంగ్రెస్‌లో చేరగా వారికి మంత్రి స్వయంగా కండువా కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభను ఉద్దేశించి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు ఎప్పటికీ మరవలేనివని గుర్తుచేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాటు ప్రజల కలలను ఛిద్రము చేసిందని మండిపడ్డారు. వారి హయంలో ఒక లక్ష ఇళ్లు ప్రతి సంవత్సరం కట్టివుంటే, పది లక్షల పేద కుటుంబాలకు గృహాలు అందేవి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం లాంటి ప్రాజెక్టుల కమీషన్లలో మునిగిపోయింది. పాము కొర్రల్లో విషం పెట్టుకున్నట్టే, వీరంతా ఒళ్ళంతా విషం నింపుకుని తిరుగుతున్నారని" ఘాటుగా విమర్శించారు. 2023లో జరిగిన ఎన్నికల్లో నీ నాయన పాలేరులో నన్ను ఓడించడానికి కంకణం కట్టుకుని తిరిగా కాంగ్రెస్ కార్యకర్తలు నన్ను భారీ మెజార్టీతో గెలిపించారని.. పార్టీ ముందు నువ్వెంత బచ్చాగాడివి.. అని మంత్రి పొంగులేటి హెద్దెవ చేశారు. వచ్చే ఎన్నికల్లో నువ్వు నిలబడతావా? నీ మీద బచ్చగాన్ని పెట్టి మళ్లీ పార్టీ గెలిపిస్తుందని కేటీఆర్‌కు సవాల్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు గట్టి బుద్ధి చెప్తారని, అసెంబ్లీ , లోక్ సభ ఎన్నికల్లోనే ప్రజలు వారిని పక్కన పెట్టేశారని మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పేదలకు ఇళ్లు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు కాంగ్రెస్ పార్టీ వచ్చాక జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, టీపీసీసీ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, బొర్రా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# టి-20ల్లో నమీబియా సంచలనం

## 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ.. జాన్ ఫ్రైలింక్ విధ్వంసం



**బులవాయో(జింబాబ్వే), సెప్టెంబర్ 18:** అంతర్జాతీయ టీ20ల్లో నమీబియా కుర్రాడు విధ్వంసం సృష్టించాడు. ఆతిథ్య జింబాబ్వేతో గురువారం జరిగిన మ్యాచ్‌లో జాన్ ఫ్రైలింక్ కేవలం 13 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. టాస్ గెలిచిన నమీబియా తొలుత బ్యాటింగ్ చేసింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన జాన్ ఫ్రైలింక్ ఆరంభం నుంచి జింబాబ్వే బౌలర్లపై ఎదురుదాడి మొదలుపెట్టాడు. తొలి ఓవర్‌లో వరుసగా 3 ఫోర్లు, రెండో ఓవర్‌లో 2 ఫోర్లు, నాలుగో ఓవర్‌లో 2 ఫోర్లు, 3 సిక్సులు బాదేశాడు. ఫ్రైలింక్ విధ్వంసం ధాటికి నమీబియా 4 ఓవర్లలో ఏకంగా 70 పరుగులు చేసింది. అర్ధసెంచరీ తర్వాత కూడా జాన్ ఫ్రైలింక్ మెరుపులు కొనసాగించినా, 31 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 77 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. మిడిలార్డర్ చేతులెత్తేసింది. ఆల్‌రౌండర్ రుబెన్ ట్రంపెల్‌మన్ 24 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 46 పరుగులు చేయడంతో నమీబియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 204 పరుగులు చేసింది. అనంతరం జింబాబ్వే 205 పరుగుల లక్ష్యఛేదనలో చేతులెత్తేసింది. ఆరంభంలోనే వికెట్లను జారవిడుచుకుంది. కెప్టెన్ సికందర్ రాజా (8) కూడా విఫలమయ్యాడు. సియాన్ విలియమ్స్ 48, రియాన్ బురి 32 పరుగులతో రాణించినా జట్టును విజయతీరాలకు చేర్చలేకపోయారు.

# హైదరాబాద్ పాంథర్స్ విజయం

## 6 వికెట్ల తేడాతో లాల్ బహదూర్ సిసి ఓటమి



**హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్, సి-డివిజన్ వన్డే క్రికెట్ లీగ్ లో హైదరాబాద్ పాంథర్స్ విజయం సాధించింది. 6 వికెట్ల తేడాతో లాల్ బహదూర్ సిసిని ఓడించింది. హైదరాబాద్‌లోని టేల్స్ క్రికెట్ గ్రౌండ్‌లో బుధవారం హైదరాబాద్ పాంథర్స్‌కు, లాల్ బహదూర్ సిసికి మధ్య మ్యాచ్ హోరా హోరీగా జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన లాల్ బహదూర్ సిసి నిర్ణీత 20 ఓవర్ లో 9 వికెట్లు కోల్పోయి 94 రన్స్ చేయగలిగింది. రామ్ చరణ్ 28 పరుగులు, భవిత్‌రెడ్డి 17 పరుగులు నమోదు చేశారు. ఇక తుషార్ క్రాంతి తన పేస్ బౌలింగ్ తో నిప్పులు చెరిగి హైదరాబాద్ పాంథర్స్ విజయానికి బాటలు వేశాడు. తుషార్ రెండు ఓవర్లలో 8 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 95 పరుగుల లక్ష్య చేదనలో హైదరాబాద్ పాంథర్స్ 17 ఓవర్లలో విజయాన్ని అందుకుంది. హ్రిత్విక్ 29 బంతుల్లో ఆరు ఫోర్ల తో 36 పరుగులు చేశాడు.

# సెంచరీతో కదంతొక్కిన ధ్రువ్ జురేల్

## ఆసీస్‌పై పట్టు సాధించిన భారత్-ఎ జట్టు

## రాణించిన సాయి సుదర్శన్, జగదీశన్

**లక్నో, సెప్టెంబర్ 18:** ఆస్ట్రేలియా-ఏతో లక్నో వేదికగా జరుగుతున్న మొదటి అనధికార టెస్ట్ మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు అద్భుతంగా రాణిస్తోంది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 4 వికెట్లు కోల్పోయి 403 పరుగులు చేసింది. అయితే, ఇంకా 129 పరుగులు వెనకబడింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా-ఏ 532-6 వద్ద డిక్లేర్ చేసిన విషయం తెలిసింది. భారత్-ఏ జట్టు విషయానికొస్తే, ధ్రువ్ జురేల్ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. అతడి అద్భుతమైన బ్యాటింగ్‌తో ఆసీస్‌కు దీటుగా బదులిస్తోంది. ఆట ముగిసే సమయానికి క్రీజులో దేవ్‌దత్ పడిక్కల్ 86, ధ్రువ్ జురేల్ 113 పరుగులతో ఉన్నారు. 116-1 ఓవర్ నైట్ స్కోర్‌తో ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత జట్టు అద్భుతంగా పోరాడుతోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్(8) విఫలం కాగా, నారాయణ్ జగదీశన్ (64), సాయి సుదర్శన్ (73) రాణించారు. ఆసీస్ బౌలర్లలో జేవియర్ బార్ట్‌లెట్, కోరీ రోకిసియోలీ, లియామ్ స్కాట్, కూపర్ కానెల్లీ ఒక్కో వికెట్ పడగొట్టారు.

## చైనా మాస్టర్స్ 2025 బ్యాడ్మింటన్

# క్వార్టర్ ఫైనల్స్‌కు సింధు

**షెన్‌జెన్(చైనా), సెప్టెంబర్ 18:** చైనా మాస్టర్స్‌లో భారత షట్లర్లు జోరు కొనసాగిస్తున్నారు. రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు బ్యాడ్మింటన్ టోర్నీలో గురువారం జరిగిన రెండో మ్యాచ్‌లో వరుస సెట్లలో విజయం సాధించింది. వరల్డ్ నం.14 పీవీ సింధు, ప్రత్యర్థి థాయిలాండ్ షట్లర్ పోర్‌వవీ చోచువాంగ్‌ను 21-15, 21-15 తేడాతో మట్టి కరిపించింది. 41 నిముషాలపాటు సాగిన హోరాహోరీ పోరులో ఆరంభం నుంచి సింధు ప్రత్యర్థి చోచువాంగ్‌పై ఆధిపత్యం కనబరించింది. చివరకు విజయం సాధించి, క్వార్టర్-ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. అటు బీడబ్ల్యూఎఫ్ సూపర్ 750 టోర్నమెంట్ మెన్స్ డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రాంకిరెడ్డి- చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్- ఫైనల్స్‌కు చేరుకుంది. వరల్డ్ నం.7 సాత్విక్- చిరాగ్ జోడీ



ప్రత్యర్థి చైనీస్ తైపీస్ చియు సియాంగ్-చీహ్, వాంగ్ చి-లిన్ జంటను 21-13, 21-12 తేడతో ఓడించింది. మ్యాచ్ ప్రారంభం నుంచి సాత్విక్- చిరాగ్ జోడీ ఒక్కో గేమ్ గెలుస్తూ ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచింది. 33నిముషాలపాటు సాగిన మ్యాచ్‌లో చైనా జోడీ ఎక్కడా పోటీ ఇవ్వలేకపోయింది. దీంతో సాత్విక్-చిరాగ్ జోడీ గెలుపొంది, క్వార్టర్-ఫైనల్స్‌కు చేరుకుంది.




# ఫ్లాప్.. నీరజ్!

## నిరాశపరిచిన చోప్రా.. 8వ స్థానానికి పరిమితం

## రాణించిన సచిన్.. 4వ స్థానంలో యాదవ్

**టోక్యో(జపాన్), సెప్టెంబర్ 18:** ఇండియన్ ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో తీవ్ర నిరాశపరిచాడు. గురువారంనాడు జరిగిన టోర్నీ ఫైనల్‌లో 12మంది పోటీ పడగా నీరజ్ ఒక్కసారి కూడా 85 మీటర్ల మార్క్ అందుకోలేకపోయాడు. ఉత్తమంగా 84.03 మీటర్లు విసిరి 8వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. మూడు, ఐదో ప్రయత్నంలో ఫౌల్ చేసిన చోప్రా, రెండో ప్రయత్నంలో 84.03 మీటర్లు విసిరారు. నీరజ్ తొలి ప్రయత్నంలో 83.65 మీటర్ల దూరం విసరగా, అతని ప్రత్యర్థి, పాకిస్తాన్ ఒలింపిక్ చాంపియన్ అర్షద్ నదీమ్ 82.73 మీటర్ల త్రో విసిరాడు. కర్టిస్ థామ్సన్ 86.67 మీటర్లు విసిరి ప్రథమ స్థానంలో నిలిచాడు. నీరజ్ చోప్రా వరుస ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలమయ్యాడు. దీంతో 8వ స్థానానికి పరిమితమై పతక రేసు నుంచి వైదొలగాడు. అటు పాక్ అథ్లెట్ అర్షద్ నదీమ్ కూడా ఈ ఫైనల్‌లో తేలిపోయాడు. రెండు, నాలుగు ప్రయత్నాలలో ఫౌల్ చేసిన అతను, ఉత్తమంగా 82.75 మీటర్ల త్రోతో పదో స్థానంలో నిలిచాడు.

**4వ స్థానంలో నిలిచిన సచిన్ యాదవ్**

ఈ ఫైనల్‌లో పోటీపడిన మరో భారత అథ్లెట్ సచిన్ యాదవ్ అంచనాలకు మించి రాణించి అందర్నీ ఆశ్చర్యపరిచాడు. 86.27 మీటర్ల త్రో విసిరి మొత్తం మీద నాలుగో స్థానంలో నిలిచాడు. సచిన్ ఐదో ప్రయత్నంలో 85.96 మీటర్ల త్రో విసిరి పతకం ఆశలు కలిగించినా, చివరి ప్రయత్నంలో 80.95 మీటర్ల దూరమే త్రో విసిరాడు. దీంతో సచిన్ 40 సెంటీమీటర్ల తేడాతో కాంస్య పతకం చేజార్చుకున్నాడు. 86.67 మీటర్లతో మూడో స్థానంలో నిలిచిన అమెరికా అథ్లెట్ థాంప్సన్ కాంస్య పతకం అందుకున్నాడు. కెషోర్న్ వాల్కాట్ (ట్రినిడాడ్ అండ్ టుబాబో) 88.16 మీటర్ల త్రో విసిరి స్వర్ణం గెలవగా, అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా) 87.38 మీటర్లతో రజతం చేజిక్కించుకున్నాడు.

# గ్రామీణ క్రీడాప్రతిభను ప్రోత్సహిస్తాం: మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, సెప్టెంబర్ 18:** గ్రామీణ క్రీడాకారుల ఉత్సాహానికి ప్రోత్సాహం ఇచ్చే విధంగా సీఎం కప్ 2025 నిర్వహిస్తామని తెలంగాణ రాష్ట్ర క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో ఆయన జిల్లా యువజన క్రీడ అభివృద్ధి అధికారులు, మరియు క్రీడా శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ, సీఎం కప్2024 మాదిరిగానే సీఎం కప్ 2025 కూడా గ్రామీణ స్థాయి నుంచి నిర్వహిస్తామని, గ్రామీణ యువ క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని మొత్తం అందులో భాగస్వామ్యం చేస్తామని ఆయన తెలిపారు. సీఎం కప్ 2025 నిర్వహణ మొక్కుబడిగా నామమాత్రంగా నిర్వహించకుండా, అందరు ప్రజాప్రతినిధులను మరియు అధికారులను ఇందులో భాగస్వామ్యం చేస్తామని తెలిపారు. ఇందులో ఎటువంటి పార్టీ భేదాలు లేకుండా ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కూడా స్వయంగా మాట్లాడడం లేఖలు రాసి వారి సహాయాన్ని కోరుతామని, జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని ఆయన తెలిపారు. కేవలం పోటీలు నిర్వహించడమే కాకుండా ప్రతి క్రీడాకారుడి సమాచారాన్ని నిక్షి ప్తం చేసి ప్రతిభా కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, డిప్యూటీ డైరెక్టర్లు స్టేడియం అడ్మినిస్ట్రేటర్లు కోచులు పాల్గొన్నారు.

# సెన్సెక్స్ నిఫ్టీలకు ఫార్మా, ఐటి, ఆర్థికసేవలు ఊతం

## మూడోరోజూ లాభాల్లోనే ముగిసిన ఈక్విటీ మార్కెట్లు




**ముంబయి, సెప్టెంబరు 18:** స్టాక్ మార్కెట్లు మూడోరోజు కూడా లాభాల్లోనే ముగిసాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 0.39శాతం పెరిగి 320.25 పాయింట్లు వృద్ధిని నమోదుచేసి 83,013.96 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 93.95 పాయింట్లు పెరిగి 25,423.60 పాయింట్లవద్ద స్థిరపడింది. దేశీయంగా జిఎస్టీ సంస్కరణలు, భారత్ అమెరికాలమధ్య చర్చల పురోగతి వంటివ అంశాలు మార్కెట్లకు ఊతం ఇచ్చాయి. ఫార్మా, ఐటి, ఆర్థికసేవల రంగాలషేర్లు పెరిగితే మీడియా, ప్రభుత్వరంగబ్యాంకులసూచీ, రియాల్టీలు కొంత క్షీణించాయి. వరుసగా మూడోరోజు కూడా మార్కెట్లలో బిఎస్‌ఇ పెరుగుతూనే వచ్చింది. బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్‌సూచీ 0.36శాతంపెరిగితే, స్మాల్‌క్యాప్‌సూచీ 0.01శాతం క్షీణించింది. మార్కెట్లపరంగా మొత్తం 2193 షేర్లు పెరిగాయి. 1984 షేర్లు క్షీణించాయి. 174 కంపెనీలషేర్లు స్థిరంగా కొనసాగినట్లు తెలుస్తోంది. ఇక ఐపిఒ పరంగా యూరోప్రతిక్ సేల్స్ గణనీయంగాపెరిగింది. 1.20 రెట్లు ఇష్యూ కొనుగోళ్లుజరిగాయి. అలాగే విఎంఎస్ టిఎంటి కూడా 19.04 రెట్లు అధికంగా అమ్ముడుపోయింది. ఐవాల్యూ ఇన్ఫోసొల్యూషన్స్ కూడా 0.22 రెట్లు అధికంగా కొనుగోల్లు జరిగినట్లు తేలింది. నిఫ్టీలో ఫార్మాసూచీ 1.50శాతం పెరిగింది. బయోకాన్ 4.12శాతం, లారెస్ ల్యాబ్స్ 3.4శాతం, గ్లెన్‌మార్క్ ఫార్మాక్యూటికల్స్ 3.29శాతం, నాట్కో ఫార్మా 3.17శాతం, అరబిందోఫార్మా 3.1శాతం, మాన్‌కైండ్‌ఫార్మా 2.62శాతం, ఇప్కా ల్యాబ్స్ 2.32శాం,సన్‌ఫార్మా 1.72శాతం, గ్లాండ్ ఫార్మా 1.62శాతం, జైడస్ లైఫ్‌సైన్సెస్ 1.32శాతం పెరిగాయి. ఇతరత్రా అజంతా ఫార్మా 0.56శాతం గ్రాన్యూల్స్ ఇండియా 0.51శాతం, అబ్బట్ ఇండియా 0.29శాతం దిగుశ్రేణిలో ముగించాయి. యూరోపియన్ మార్కెట్లు ఫెడ్‌రిజర్వు రేట్‌కట్‌పైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఇతర ప్రపంచ బ్యాంకుల వడ్డీరేట్లపైనా దృష్టిపెట్టారు. ఆసియా మార్కెట్లు కొంతమేర దిగువస్థాయిలోనే ముగిసాయి. ఫెడ్‌రిజర్వుఛైర్మన్ జెరోమ్‌పావెల్ 20 బేసిస్ పాయింట్లు తగ్గింపును రిస్క్‌మేనేజ్‌మెంట్‌గా అభివర్ణించడమే కాకుండా భవిష్యత్తులో మరో రెండు రేట్‌కట్‌లు ఉంటాయని సంకేతాలిచ్చారు. బ్యాంక్ ఆఫ్‌జపాన్‌కూడా తన పాలసీరేట్లను సవరిస్తుందన్న అంచనాలున్నాయి. చైనా సెంట్రల్ బ్యాంకు కీలక వడ్డీరేట్లను మాత్రం స్థిరంగానే కొనసాగించింది. డౌజోన్స్ పారిశ్రామిక సగటు రికార్డు స్థాయికి పరిగింది. 260.42 పాయింట్లు పెరిగింది. ఎస్‌అండ్‌పి 500 మాత్రం 0.1శాతం క్షీణించింది. నాస్‌డాక్ కాంపోజిట్‌కూడా 0.3శాతం క్షీణించినట్లు మార్కెట్లలో వాతావరణం కనిపిస్తోంది.

# 32 పైసలు క్షీణించిన భారత్ రూపాయి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** డాలరుతో రూపాయి చెలామణీ 32 పైసలు తగ్గింది. గురువారం 88.13 వద్దనే ముగిసింది. ఈ ఏడాది ఇప్పటివరకూ రూపాయి 2.94శాతం క్షీణించిందని ఇతర ఆసియా కరెన్సీలన్నింటికంటే ఎక్కువ క్షీణించింది భారత్‌కరెన్సీయేనని నిపుణ/లు చెపుతున్నారు. డాలర్‌సూచీ ఫెడ్ పాలసీ నిర్ణయాల తర్వాత కూడా ఎలాంటి ప్రభావం లేకుండా స్థిరంగా కొసాగింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఫెడ్‌రిజర్వు పాలసీ రేట్లపరంగాను, అన్నింటికంటే కీలకంగా భారత్ అమెరికా వాణిజ్య చర్చలపైనా ఎకునకవ ఫోకస్‌పెంచారు. రూపాయికి మద్దతు 87.75వద్ద నిలిచి చివరకు 88.25వద్ద మరికొంత అనిశ్చితి ఏర్పడింది. చివరకు 88.13వద్ద కరెన్సీ ట్రేడింగ్‌ముగిసింది. ఫెడ్‌రిజర్వుఛైర్మన్ జెరోమ్ పావెల్ 25 బేసిస్ పాయింట్ల వడ్డీరేట్లను కోతవిధించారు. ఇదంతా రిస్క్ మేనేజ్‌మెంట్ కోసమేనని ప్రకటించారు.




# 8.71 లక్షలమందికి పెరిగిన భారత్ మిలియనీర్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** భారత్‌లో ఏటికేడాది మిలియనీర్లు పెరుగుతున్నారు. రానురాను భారత్‌మిలియనీర్ల హబ్‌గా మారుతోంది. కనీసం 8.5 కోట్ల సంపద కలిగిన వారు 2021 నుంచి ఇప్పటివరకూ 90శాతం వృద్ధి చెందినట్లు హురూన్ ఇండియా సర్వేలో తేలింది. 2021 నాటికి 4.58 లక్షలమంది ఉన్న మిలియనీర్లు అదే ఈ ఏడాది నాటికి 8.71 లక్షలమందికి పెరిగారు. అంటే సుమారు రెట్టింపు సంఖ్యలో ఉన్నట్లు తేలింది. మెర్సిడిస్ బెంజ్ హురూన్ ఇండియా వెల్త్‌రిపోర్టులో ఆసక్తికర అంశాలు బయటపడ్డాయి. మొత్తం కుటుంబాల్లో 0.31శాతం మిలియనీర్ల కుటుంబాలున్నాయి. 2021లో అదే 0.17శాతం మంది మాత్రమే ఉన్నారు. 2017 నుంచి 2025 వరకూ భారత్ 445శాతం వృద్ధిని నమోదుచేసింది. 8.5 కోట్లకుపైగా కుటుంబాలు మిలియనీర్ల జాబితాలోచేరాయి. ఈక్విటీ మార్కెట్లలో వృద్ధి, పెట్టుబడులను ఆకర్షించడంలో మన మిలియనీర్ పారిశ్రామికవేత్తలు ముందంజలో ఉన్నారు. దేశంలో అత్యధికంగా మహారాష్ట్రలో ఉన్నారు. 1.78 లక్షలకుటుంబాలు కనీసం 8.5 కోట్లకుపైబడిన సంపదతో ఉనానరు. ముంబయి ఒక్కటే 1.42 లక్షలమంది ఉన్నట్లు హురూన్‌నివేదిక తెలిపింది. ఢిల్లీలో 79,800 మంది ఉంటే తమిళనాడు



మూడోర్యాంకులో ఉంది. మొత్తం మిలియనీర్ కుటుంబాలు 72,600 మందివరకూ ఉన్నారు. భారత్‌లోని టాప్ పది రాష్ట్రాల్లోనే 80శాతంమంది మిలియనీర్ కుటుంబాలున్నట్లు తేలింది. ఢిల్లీ తర్వాత బెంగళూరులో 31,600 మంది వరకూ ఉన్నారు. అహ్మదాబాద్, పూణె, హైదరాబాద్, గురుగ్రామ్‌లు వాటి వాటాను పెంచుకుంటున్నాయి. 2017నాటికి దేశంలో కేవలం ఐదుశాతం మంది మిలియనీర్లు మాత్రం 100 కోట్ల సంపదతో ఉన్నట్లు తేలింది.



# బ్లూ ఎనర్జీ మోటార్స్ 30 మిలియన్ డాలర్ల నిధుల సమీకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** ఎల్‌ఎన్‌జిరవాణాచేసే భారీ ట్రక్కుల తయారీసంస్థ బ్లూఎనర్జీమోటార్స్ 30 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించింది. దీనితో ఈసంస్థ ఇప్పటివరకూ మొత్తం 50 మిలియన్ డాలర్లు సమీకరించినట్లయింది. ఇన్వెస్టర్ నిఖిల్‌కామత్, ఒమ్నిటెక్స్ ఇండస్ట్రీస్ కంపెనీకి ఇన్వెస్టర్లుగా మారారు. అంతేకాకుండా వ్యూహాత్మకంగా ఎస్సార్ ఎఫ్‌పిటి సంస్థలు మద్దతునిస్తున్నాయి. బిఇఎం తన ఉత్పత్తి సామర్థ్యాన్ని 10 వేల ట్రక్కులకు పెంచాలనినిర్ణఇంచింది. భారత రవాణా రంగంలో కీలక మార్పులుచేసేందుకునిర్ణయించింది. భారత రవాణారంగంలో ఇపుడు బిఇఎం ఎక్కువ వాటాతో ఉంది. విద్యుత్ ట్రక్కుల ఉత్పత్తివల్ల ఏటా 15శాతం కర్బన ఉద్గారాలను తగ్గించుకోగలమని విశ్వసిస్తోంది. భావితరం ఎల్‌ఎన్‌జి, విద్యుత్ హెవీడ్యూటీ ట్రక్కులు ఇపుడు రవాణారంగంలో కీలకంగాపనిచేస్తున్నాయి. కంపెనీ ఇప్పటివరకూ వెయ్యికిపైగా ఎల్‌ఎన్‌జి వాహనాలను విక్రయించింది. ఈ ట్రక్కులు సుమారు 60 మిలియన్ కిలోమీటర్ల దూరం వరకూ కవర్‌చేస్తాయి. కర్బన ఉద్గారాలను 15వేల టన్నులవరకూ తగ్గిస్తుందని కంపెనీ భరోసా ఇస్తోంది. ఇన్వెస్టర్ నిఖిల్‌కామత్ మాట్లాడుతూ భారత్‌లో రవాణారంగం స్వచ్ఛమైన, హరిత ఇంధనవనరులపైనే నడుస్తోందని, రానురాను మరింతపెరుగుతుందని బ్లూ ఎనర్జీ ఇందుకు మరింతగా ఉపయోగపడుతున్నదన్నారు. ఎస్సార్ డైరెక్టర్ అన్షుమన్ రూయా మాట్లాడుతూ కంపెనీ హెవీ డ్యూటీ ట్రక్కుల ట్రాన్స్‌పోర్టేషన్‌లో కర్బన ఉద్గారాల తగ్గింపులనకు బ్లూ ఎనర్జీ మోటార్స్ కృషి గణనీయంగా ఉందని అందుకే కంపెనీతో కలిసి పనిచేస్తున్నట్లు తెలిపారు.

# ఫండ్‌పెట్టుబడుల్లో మిలీనియల్స్,జెన్‌జడ్‌లే ఎక్కువ!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 18:** భారత్‌లో మూచువల్‌ఫండ్‌సలో పెట్టుబడులు పెడుతున్న ఇన్వెస్టర్లలో అత్యధికశాతం ఇటీవలికాలంలో మిల్లీనియల్స్, జన్‌జడ్ తరమే ఎక్కువకనిపిస్తోంది. అలయన్స్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ నిర్వహించిన సర్వే ప్రకారంచూస్తే 93శాతం జన్‌జడ్ తరం పొదుపు వైపు ఆసక్తిచూపిస్తున్నట్లు తేలింది. ఇన్వెస్టర్ల కమ్యూనిటీలో 48శాతం కూడా వీరేకావడం విశేషం. మిల్లినియల్స్,జన్‌జడ్‌పరంగాచూస్తే ఈ తరం పెట్టుబడులు 500 నుంచి 600 మిఇయన్ డాలర్లవరకూ ఉన్నట్లుఅంచనా. సంపదపై ఎక్కువ వ్యయంచేయడం కంటే ఎక్కువగా సహాయజమానులుగా నిలుస్తున్నారు. రూ.10 లక్షలనుంచి వారి సంపదను వృద్ధిచేసుకునేందుకు తాపత్రయపడుతున్నారు. నెలవారీ రిటర్న్లు సాధించడంలో ఎక్కువ ఫోకస్‌పెడుతున్న జన్‌జెడ్,మిల్లీనియల్స్ పెట్టుబడి పథకాల వడ్డీరేట్లను కూడా నిరంతరం గమనిస్తున్నట్లు సంస్థ సర్వేలో తేలింది. ప్రత్యామ్నాయ రుణపరపతితో యువ ఇన్వెస్టర్లు ఎక్కువ పెట్టుబడులు పెడుతున్నారు. పీర్‌టుపీర్ రుణపరపతివైపు కూడా వారు ఆసక్తితో ఉన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps